ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

కరీంనగర్ : fb.com/vaartha Digital

Published from Karimnagar, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

4-5-2026 సోమవారం సంపుటి: 32 సంచిక: 93 పేజీలు: 8+16 వెల: 6.50

అంతరిక్షయానంలో 'మిషన్ దృష్టి' మైలురాయి 5

నెదర్లాండ్స్ యువరాణుల హత్యకు కుట్ర

బెంగాల్, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి, అసోంలో ఉ. 8 గం.కు ఓట్ల లెక్కింపు ఆరంభం

కౌంటింగ్ కేంద్రాల వద్ద ఇసి పకడ్బందీ ఏర్పాట్లు

విజయోత్సవాలు, ర్యాలీలపై నిషేధం



# కింగ్‌లెవరో.. కింగ్ మేకర్లెవరో!

## తీవ్ర ఉత్కంఠకు తెర నేడే



కోల్‌కతాలోని ఓ కౌంటింగ్ కేంద్రంలో ఆదివారం ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

**న్యూఢిల్లీ, మే 3:** పశ్చిమబెంగాల్, తమిళనాడు, కేరళ, అసోం రాష్ట్రాలతోపాటు కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరి అసెంబ్లీ ఓట్ల లెక్కింపు సోమవారం జరుగనుంది. ఉదయం 8గం.లకు ప్రారంభం కానుంది. వారాల తరబడి సాగిన ప్రచారాలు, ఆరోపణలు, వాగ్దానాలు, ర్యాలీలతో ప్రారంభమై నేడు కౌంటింగ్‌తో ముగియనుంది. ఉత్కంఠభరితమైన నాటకీయతకు తెరపడనుంది. ఐదు రాష్ట్రాల్లో విభిన్న రాజకీయ పరిణామాలు, ఐదు విభిన్న పోటీలు. ఎనిమిది >>2

తుపాకులు పేల్చి
# నగలు లూటీ



కరీంనగర్‌లోని ఓ నగల దుకాణంలో చోరీ దృశ్యం

కరీంనగర్‌లో పట్టపగలు జ్యుయెలరీ షాపుపై దాడి

నలుగురికి తీవ్రగాయాలు

కిలో పైగా నగలు దోపిడి

అంతర్రాష్ట్ర ముఠా పనే అంటున్న పోలీసులు 2

ప్రత్యేక బృందాలతో గాలింపు

# ప్రశాంతంగా నీట్

ఫిజిక్స్ ప్రశ్నలు కఠినం.. మిగిలినవి సాధారణం!

ఎపిలోనూ పరీక్ష ప్రశాంతం



హైదరాబాద్‌లో ఓ పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులు

**హైదరాబాద్, ప్రభాతవార్త, మే 3:** దేశంలోని ప్రభుత్వ, ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో ఎంబీబీఎస్, బీడీఎస్‌తో పాటు ఇతరమెడికల్ కోర్సుల్లో అడ్మిషన్ల కోసం జాతీయ స్థాయిలో నిర్వహించే నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్(నీట్)- యుజీ-2026 పరీక్ష ఆదివారం దేశ వ్యాప్తంగా ప్రశాంతంగా జరిగింది. నీట్ ప్రశ్నాపత్రంలో ఫిజిక్స్ సబ్జెక్టుకి సంబంధించిన ప్రశ్నలు కొంచెం కఠినతరంగా, లెంగ్తీగా ఉండగా.. మిగిలిన కెమిస్ట్రీ, బయాలజీ ప్రశ్నలు సాధారణంగా ఉన్నట్టు పరీక్షకు హాజరైన విద్యార్థులతోపాటు, విద్యారంగ నిపుణులు చెబుతున్నారు. నీట్ ప్రశ్నాపత్రంలో ఎక్కువ శాతం ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్ నుంచే ప్రశ్నలు వచ్చాయని, అయితే ఈసారి నీట్ ప్రశ్నాపత్రంలో ఔట్ >>2



ఆదివారం ఇబ్రహీంపట్నం రాయపోల్ ఐకెపి కేంద్రంలో జొన్నల కల్లంలో ప్రాణాలు కోల్పోయిన రైతు

# ఎంత కష్టం.. ఎంత నష్టం!

## అకాల వర్షాలతో అన్నదాతలు ఆగమాగం

**హైదరాబాద్, మే 3, ప్రభాతవార్త:** అకాల వర్షాలు రైతులను నిండా ముంచుతున్నాయి. ప్రస్తుతం యాసంగి వరికోతలు ముమ్మరంగా సాగుతున్న వేళ, కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కుప్పలుగా పేరుకుపోయిన సమయంలో అన్నదాతలు కోలుకోలేనివిధంగా వర్షాలు దెబ్బతీస్తున్నాయి. కొద్ది రోజులుగా ఎండవేడితో అల్లాడుతున్న ప్రజలకు వర్షాలు కాస్త ఉపశమనం కల్పించినా పలు జిల్లాల్లో ఈదురు గాలులతో కూడిన అకాల వర్షాల ధాటికి కోతికొచ్చిన వరి పంట చేలల్లోనే నేలవాలగా, కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం తడిసిముద్దవుతోంది. ఆరుగాలం కష్టపడి పండించిన పంట >>2



నాగర్ కర్నూలులో కల్లంలో అకాల వర్షానికి తడిసిన ధాన్యం

తడిసిముద్దయిన వరి, మొక్కజొన్న

నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు, భారీ వృక్షాలు

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఇద్దరు రైతులు మృతి



ఆదివారం హైదరాబాద్‌లో కారు బోనెట్ పట్టుకొని వేలాడుతున్న జిలాని

# కారుతో ఢీకొట్టి 2 కి.మీ ఈడ్చుకెళ్లి

ఓ డ్రైవర్ రాక్షసం 2

గాయాలపాలైన తండ్రి, కొడుకు




ఎపిలో ఇటు మండుటెండలు..
# అటు పిడుగులు

ముమ్మిడివరంలో 72.7మిమీ, కాట్రేనికోనలో 57.7మిమీ వర్షపాతం


## ఈ సీజన్‌లో అత్యధిక ఉష్ణోగ్రత 46.2°

**విజయవాడ,మే2,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో విభిన్న వాతావరణ పరిస్థితులు కొనసాగుతున్నాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో ఎండతీవ్రత, మరికొన్ని ప్రాంతాల్లో పిడుగులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయని వెల్లడించారు. ఆదివారం నెల్లూరు జిల్లా గూడూరులో ఈ సీజన్లోనే అత్యధిక ఉష్ణోగ్రత 46.2, ప్రకాశం జిల్లా కొప్పెరపాడులో 46.1 డిగ్రీలు రికార్డయ్యాయని. పేర్కొన్నారు. కడప జిల్లాలో 33 మండలాలు, నెల్లూరు 33, తిరుపతి 31, ప్రకాశం 28, పల్నాడు 25, మార్కాపురం 21, నంద్యాల 20, చిత్తూరు 20, కర్నూలు 18, బాపట్ల 16 మండలాలు మొత్తంగా 28 జిల్లాలకు గాను 16 జిల్లాల పరిధిలోని 286 మండలాల్లో ఎండ తీవ్ర ప్రభావం చూపి 41 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వెల్లడించారు. నెల్లూరు జిల్లా గూడూరులో 46.2 C, ప్రకాశం జిల్లా కొప్పెరపాడులో 46.1 C, మార్కాపురం(జి) కంభం లో 45.7 C, తిరుపతిజిల్లా బోనుపల్లెలో 45.6 C, పల్నాడుజిల్లా నడిగడ్డలో 44.2, బాపటజిల్లా కారంచేడులో 44 కర్నూలుజిల్లా తోవిలో 43.9, చిత్తూరుజిల్లా తవణంపల్లెలో 43.8, అనంతపురం జిల్లా తెరన్నపల్లి, కడప జిల్లావీరబల్లెలో 43.4 నంద్యాలజిల్లా బనగానపల్లె, ఎన్టీఆర్ జిల్లాచిలకల్లులో 43.1డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు పేర్కొన్నారు. మరోవైపు దక్షిణ ఛత్తీస్‌గఢ్ నుండి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు మీదుగా కొమోరియన్ ప్రాంతం వరకు ద్రోణి విస్తరించి ఉందని ఎపిఎస్డీఎంఎ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. దీని ప్రభావంతో సోమవారం అనకాపల్లి, కాకినాడ, కోనసీమ జిల్లాల్లో అక్కడక్కడ ..పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని అంచనా అన్నారు శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, అల్లూరి, పోలవరం, విశాఖ, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ ..పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు.. కురిసే అవకాశం ఉందన్నారు. రైతులు వ్యవసాయ పనుల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఉరుములతో కూడిన వర్షం పడేటప్పుడు పొలాల్లో పని చేసే రైతులు, కూలీలు, పశు కాపరులు చెట్ల కింద నిలబడరాదని హెచ్చరించారు.

సోమవారం రాష్ట్రంలో విజయనగరం జిల్లా : బొబ్బిలి, వంగర మండలాలు. పార్వతీపురంమన్యం జిల్లా: బలిజపేట, గరుగుబిల్లి, గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలస, కొమరాడ, కురుపాం, పార్వతీపురం, సీతానగరం, వీరఘట్టం మండలాలు.

పోలవరం జిల్లా: చింతూరు, కూనవరం, వరరామచంద్రపురం మండలాలు. ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలం, ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం, కంచికచర్ల గుంటూరు జిల్లా మంగళగిరి, మెడికొండూరు, ఫిరంగిపురం, తాడికొండ, తాడేపల్లి, తుళ్లూరు మండలాలు పల్నాడు జిల్లా అమరావతి, పెదకూరపాడు మండలాలు నెల్లూరు జిల్లా మనుబోలు, గూడూరు మొత్తంగా 27మండలాల్లో వడగాలులు ప్రభావం చూపనున్నట్లు తెలిపారు. ఎండ తీవ్రత, ఉక్కపోత పట్ల ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ఆదివారం సాయంత్రం 5 గంటల నాటికి కోనసీమ జిల్లా ముమ్మిడివరంలో 72.7మిమీ, కాట్రేనికోనలో 57.7మిమీ, కాకినాడ జిల్లా పెద్దాపురంలో 50.2మిమీ, పిఠాపురంలో 45.5మిమీ, కాకినాడ రూరల్ 43మిమీ, అచ్చుతాపురంలో 42మిమీ, కాకినాడ అర్బన్ 41మిమీ వర్షపాతం నమోదైందన్నారు.



ఖమ్మం జిల్లా చింతకాని మండల పాతర్లపాడు గ్రామంలో దగ్ధమవుతున్న మొక్కజొన్న బస్తాలు

# రైతన్న గుండె పగిలింది

## అగ్నికి ఆహుతైన మొక్కజొన్న బస్తాలు..

200 క్వింటాళ్లు పైగా మంటల్లో కాలిపోయిన దుస్థితి

30 గొర్రెలు సైతం మృత్యువాత

40 మంది రైతుల కళ్లలో కన్నీరు

**చింతకాని, ప్రభాతవార్త, మే 3:** ఆరుగాలం శ్రమించి పండించిన పంట చేతికొచ్చే దశలో అగ్నికి ఆహుతై మంటల్లో కళ్ళముందే కొన్ని వందల క్వింటాల బస్తాలు కాలిపోతున్న ఏమి చేయలేని నిస్సహాయ స్థితిలో రైతన్న గుండె పగిలిపోయిన ఘటన ఖమ్మం జిల్లా చింతకాని మండల పరిధిలోని పాతర్లపాడు గ్రామంలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు మేరకు పాతర్లపాడు గ్రామంలో ఊరు శివారులో అనేకమంది రైతులు మొక్కజొన్న పంటను కల్లాలలో పోసుకున్నారు. దీనిలో కొందరు కాటాలు వేశారు మరికొందరు బస్తాలు లాట్ వేసి ఉంచారు గత నెల రోజుల క్రితమే గ్రామంలో ప్రభుత్వం మార్కెఫెడ్ ద్వారా కొనుగోలు చేసి కాటాలు లేచిందికానీ ఇంతవరకు ఎగుమతి గోడన్ లకు ఎత్తకపోయేసరికల్లా ఆ బస్తాలు ఆ కళ్ళల్లోనే ఉండిపోయాయి. ఇది ఇలా ఉండగా ఆదివారం ఓ గుర్తు తెలియని వ్యక్తి తన పంట పొలానికి నిప్పంటించుకుని వస్తే ఆ నిప్పు కాస్త ఆ పరిసర ప్రాంత మొక్కజొన్న దంటుకు అంటుకొని చివరికి కళ్ళల్లో ఉన్న సుమారు 40 మంది రైతుల 200 క్వింటాళ్ల బస్తాలు ఆ మంటలో ధ్వంసం అయిపోయాయని రైతన్నలు కన్నీరు మున్నీరు అవుతున్నారు. అంతేకాకుండా మేతకు వెళ్లినటువంటి గొర్రెలు కూడా ఆ మంటల్లో చిక్కుకొని ఊపిరాడక 30 గొర్రెలు మృత్యువాత పడిన పరిస్థితి నెలకొంది. సాయంత్రం సమయంలో గాలి దుమారం ఒక్కసారిగా ఎగిసిపడడంతో మంటలు కూడా అట్టి గాలికి ఎగిసి పడటంతో ఉధృతంగా మంటలు వ్యాపించడంతో రెండు ఫైరింజన్లు వచ్చినా గాని అదుపులోకి రాని పరిస్థితి నెలకొంది వాస్తవానికి నెల రోజులు కాటా లేసినా గాని ఇంతవరకు బస్తాలను ఎగుమతి చేసుకో పోవడంతో ఈ తీవ్రమైన నష్టం రైతన్నలకు వాటిల్లిందని లబోదిభో గుండెల పగిలిన రోదిస్తున్నారు. మంటలు ఎగిసిపడి కళ్ళ ముందే కాటా వేసిన బస్తాలు కాలిపోతుంటే రైతన్న కళ్ళల్లో కన్నీళ్లు పలువురిని కంటతడి పెట్టిస్తున్నాయి.. కొన్ని లక్షలు రూపాలు రైతన్నలు నష్టపోవడం జరిగిందని వారు తెలిపారు. ఇంత జరిగినా గాని సంఘటన స్థలానికి అధికారులు కన్నెత్తి కూడా చూడలేదని స్థానికులు వాపోతున్నారు.

# కృష్ణా కరకట్టపై 4 లేన్ల రహదారి

## రూ.443 కోట్లతో నిర్మాణం

**విజయవాడ,మే3,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ రాజధాని అమరావతి అభివృద్ధిలో భాగంగా ప్రస్తుత కృష్ణానది కరకట్టను నాలుగు లైన్లుగా విస్తరించనున్నారు. దీనికోసం రూ.443 కోట్లు వెచ్చించనున్నారు. కృష్ణానది వరదల నుండి భద్రతతోపాటు తీరాన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దనున్నారు. మూడుదశల్లో సీతానగరంలోని ఫ్లడ్ పంపింగ్ స్టేషన్ నుండి వైకుంఠపురం వరకూ కరకట్టను విస్తరించనున్నారు. రివర్ ఫ్రంట్ పేరుతో డిపిఆర్ కూడా సిద్ధం చేశారు. ప్రస్తుతం సింగిల్ లైనుగా ఉన్న కరకట్టను నాలుగు లైన్ల రోడ్డుగా మార్చడంతోపాటు మధ్య డివైడర్ ఏర్పాటు ద్వారా సుందరంగా తీర్చిదిద్దనున్నారు. 24 మీటర్ల వెడల్పున దీన్ని నిర్మించనున్నారు. మొత్తం మూడు దశల్లో నిర్మించే ఈ రోడ్డును తొలిదశలో 6.9 కిలోమీటర్లు నిర్మించనున్నారు. సెంట్రల్ లైటింగ్ కూడా ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుతం ఒకవైపు ఉన్న విద్యుత్ స్తంభాలను మార్చాలని ప్రతిపాదించారు. తొలిదశలో రోడ్డును ఫ్లడ్ పంపింగ్ స్టేషన్ నుండి వెంకటపాలెం సమీపంలో జాతీయ రహదారి వరకూ విస్తరిస్తారు. 37వ ప్యాకేజీగా నిర్మించే ఈ రోడ్డు కోసం రూ.149.82 కోట్లు కేటాయించారు. ఇటీవల క్యాబినెట్లోనూ దీనికి ఆమోదం లభించింది. త్వరలోనే అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ టెండర్లు పిలవనుంది. ఇప్పటికే సర్వే కూడా పూర్తి చేశారు. గతంలో కరకట్టను ఒకవైపే విస్తరించాలని నిర్ణయించినా కొత్త ప్రతిపాదనలో రెండువైపులా విస్తరించనున్నారు.

**కొండవీటివాగుపై రెండులైన్ల వంతెన..**

కరకట్ట విస్తరణలో భాగంగా కొండవీటివాగుపై రెండు వరుసల వంతెన నిర్మించనున్నారు. దీనికి షిప్ లాక్ కూడా ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుతం కృష్ణా పశ్చిమ కాలువ మీద నిర్మిస్తున్న స్టీలు వంతెన పనులు పూర్తయి అందుబాటులోకి రాగానే కరకట్టపై రాకపోకలు నిలిపేసి ప్రస్తుతం ఉన్న గేట్ల వద్ద కొత్తవంతెన, గేట్లు ఏర్పాటు చేయనున్నారు. దీనికోసం రూ.93 కోట్లు ఖర్చవుతుందని ఎగ్జిక్యూటివ్ కమిటీలో నిర్ణయించారు. కృష్ణానది కుడి కరకట్ట రోడ్డును నాలుగులైన్లుగా విస్తరించడం ద్వారా అక్కడ రవాణాతోపాటు పర్యాటకంగానూ ఆ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. ఇప్పటికే వెంకటపాలెం తాళ్లాయపాలెం సమీపంలో రివర్ ఫ్రంట్ అభివృద్ధి కోసం భూమిని కూడా కేటాయించారు. టెండర్లనూ ఆహ్వానించారు. ప్రకాశం బ్యారేజీ నుండి వెంకటపాలెం జాతీయ రహదారి వరకూ రివర్ ఫ్రంట్ ఏర్పాటు చేయడంతోపాటు నగరవాసులకు అహ్లాదకర వాతావరణం ఉండేలా సదుపాయాలు కల్పించనున్నారు.



# ఎంత నష్టం!

>> వర్షార్పణంకావడంతో రైతులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. కొనుగోలు కేంద్రాలు, వ్యవసాయ మార్కెట్ అధికారుల తీరుపై మండిపడుతున్నారు. పదిహేను రోజులు దాటినా కొనుగోలు చేయకపోవడంతో అకాల వర్షాలకు ధాన్యం తడిసిపోతోందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఆదివారం పలుచోట్లు ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిశాయి. బలంగా వీచిన ఈదురుగాలుల ధాటికి చెట్లు, విద్యుత్ స్తంబాలు నేలకొరిగాయి. మంచిర్యాల జిల్లా మందమర్రి, రామకృష్ణాపూర్ పట్టణాల్లో ఈదురు గాలులతో కూడిన వర్షం బీభత్సం సృష్టించింది. కోల్‌బెల్ట్ రహదారిపై పలుచోట్ల చెట్లు విరిగిపడ్డాయి. పలు ఇళ్లపైకప్పు రేకులు ఎగిరిపోవడంతో పలువురు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సుమారు గంటపాటు భారీ వర్షం కురవడంతో జన జీవనం స్తంభించి పోయింది.

మందమర్రి, సింగరేణి కాలనీల్లో విద్యుత్ సరఫరా నిలిచింది. భద్రాద్రి జిల్లా ఇల్లందు, గుండాల మండలంలో ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో పలుచోట్ల రహదారులపై ఆరబోసిన మొక్కజొన్న కొట్టుకుపోయింది.

కాగా.. మహబూబాబాద్ జిల్లా కురవి మండలం సూదనపల్లిలో విషాదం చోటుచేసుకుంది. ధాన్యం కొనుగోలు కేంద్రంలో పిడుగుపడి కార్మికుడు మృతిచెందాడు. కొనుగోలు కేంద్రంలో ధాన్యంపై టార్పాలిన్లు కప్పుదుతుండగా పిడుగుపాటు సంభవించింది. అక్కడ పనిచేస్తున్న నీలం వెంకన్న ప్రాణాలు కోల్పోయారు. మరో ఇద్దరు రైతులు అస్వస్థతతకు గురయ్యారు.

అదేవిధంగా రంగారెడ్డి జిల్లాలో ఇబ్రహీంపట్నం రాయిపోల్ ఐకెపి సెంటర్‌లో ఎం. గౌరయ్య అనే రైతు ఎండకు వడదెబ్బ తగలడంతో మృతి చెందాడు సిద్ధిపేట జిల్లాలోని హుస్నాబాద్‌లో ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. మార్కెట్ యార్డ్‌లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో రైతులు ఆరబోసిన మొక్కజొన్నలు, వరి ధాన్యం తడిసిపోయింది. మొక్కజొన్న, వరి ధాన్యానికి టార్పాలిన్ కవర్లు కప్పేలోపే వర్షం జోరుగా కురిసి ధాన్యం తడిచిపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కాగా..నల్గొండలో భారీ వర్షం కురిసింది. నకిరేకల్, కట్టంగూర్, కేతేపల్లి మండలాల్లో భారీ ఈదురుగాలులతో కూడిన రాళ్ల వర్షం కురిసింది. సూర్యాపేట, మిర్యాలగూడ, కోదాడ, తొర్రూర్, మహబూబాబాద్, డోర్నకల్‌తోపాటు ఖమ్మం జిల్లా వైరా, చింతకాని, కొణిజర్ల ప్రాంతాల్లోనూ అకాల వర్షాలు కురిశాయి.

**పలు జిల్లాల్లో భారి వర్షాలు...**

రాగల రెండు రోజుల పాటు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. వర్షంతోపాటు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని అధికారులు తెలిపారు. మే 5న రాష్ట్రంలోని నాలుగు జిల్లాల్లో వాతావరణం తీవ్రంగా మారే అవకాశం ఉంది. ముఖ్యంగా జయశంకర్ భూపాలపల్లి, ములుగు, వరంగల్, హనుమకొండ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. పిడుగులు పడే ప్రమాదం కూడా ఉన్నందున ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. రాష్ట్రంలోని కుమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల్లో అక్కడక్కడా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు గాలి వేగం పెరిగే అవకాశం ఉన్నందున పాత భవనాలు, చెట్లు, విద్యుత్ స్తంభాల వద్ద జాగ్రత్తగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు. అకాల వర్షాల నేపథ్యంలో రైతులు తమ ధాన్యం కుప్పలపై పట్టాలు కప్పుకుని తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

**ఈ ఏడాది ముందే నైరుతి...**

రికార్డుస్థాయిలో ఎండలు, అడుగంటిపోతున్న భూగర్భ జలాలు, ఎల్‌నినో ప్రమాద హెచ్చరికలతో వానాకాలం సాగుపై ఆందోళన పెట్టుకున్న రైతులకు భారత వాతావరణశాఖ (ఐఎండి) తీపికబురు అందించింది. ఈ సారి దేశంలోకి నైరుతి రుతుపవనాలు ముందుగానే వచ్చే అవకాశం ఉందని అంచనా వేసింది. ఈనెల 14 నుంచి 16 మధ్య రుతుపవనాలు అండమాన్ నికోబార్ దీవులను తాకొచ్చని పేర్కొంది. ఆ తరువాత కేరళ, తమిళనాడు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల గుండా దేశవ్యాప్తంగా విస్తరించనున్నట్లు పేర్కొంది. రుతుపవనాల ఆగమనం సాధారణ సమయం కన్నాకొంచెం ముందేకావడంతో మే నెలలో దేశవ్యాప్తంగా సగటు వర్షపాతం సాధారణం కంటే ఎక్కువగా ఉండే అవకాశం ఉందని వాతావరణశాఖ అంచనా వేసింది.

నైరుతి ముందుగానే వచ్చే అవకాశం ఉండడంతో మే నెలలో చివరి రెండు వారాల్లో ఎండల తీవ్రత తగ్గే అవకాశం ఉంది.నైరుతి రుతుపవనాల కారణంగా దక్షి ణ రాష్ట్రాలు, పశ్చిమ భారతంలో అధిక వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈశాన్య రాష్ట్రాలు, తూర్పు మధ్య భారతంలోని కొన్ని ప్రాంతాల్లో మాత్రం సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదవుతుందని ఐఎండి అంచనా వేసింది. సాధారణంగా నైరుతి రుతుపవనాలు ఏటా మే చివరి వారం లేదా జూన్1 నాటికి కేరళ తీరాన్నితాకుతాయి. మేలో దేశ సగటు వర్షపాతం సాధారణం కంటే 110 శాతం ఎక్కువగా ఉండొచ్చని అంచనా వేశారు.

# నేడు కేబినెట్ భేటీ

## తుమ్మిడిహెట్టి బ్యారేజీ, పెండింగ్ బిల్లుల అజెండా

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే3:** తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గం సోమవారం సమావేశం కానుంది. సచివాలయంలో మధ్యాహ్నం 3 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన కేబినెట్ భేటీ జరగనుంది. తుమ్మిడిహెట్టి బ్యారేజీపై కేబినెట్ చర్చించనున్నట్లు తెలుస్తోంది. ప్రాణహితచేవెళ్ల ప్రాజెక్టులో భాగంగా తుమ్మిడిహెట్టి వద్ద 150 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మించి శ్రీపాద ఎల్లంపల్లికి నీటిని తరలించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల నిర్వహించిన సమావేశంలో నిర్ణయించారు. తుమ్మిడిహెట్టి నుంచి ఎల్లంపల్లికి నీటిని తరలించేందుకు నాలుగు మార్గాలు ప్రతిపాదనలో ఉన్నాయి. వీటిపై కేబినెట్ చర్చించి, నిర్ణయం తీసుకొనే అవకాశం ఉంది. ఉద్యోగులు, ఫించనర్ల సమస్యలు, డిమాండ్లపై మంత్రి మండలి చర్చించనున్నట్లుగా తెలుస్తోంది. ఉద్యోగులు, పింఛనర్ల పెండింగ్ బిల్లులు 100 రోజుల్లో క్లియర్ చేయాలని భావిస్తున్న ప్రభుత్వం, అందుకు సంబంధించిన కార్యాచరణపై కేబినెట్ భేటీలో నిర్ణయం తీసుకోనుంది. పెండింగ్ డీఏలు, ప్రభుత్వం నగదు రహిత చికిత్సలపై మంత్రివర్గ సమావేశంలో చర్చించే అవకాశం ఉంది. ప్రభుత్వంలో ఆర్టీసీ ఉద్యోగుల విలీనం, కొత్త ఆసరా ఫించన్లు, తెలంగాణ ఉద్యమకారుల కోసం కార్యక్రమాలు, ఇందిరమ్మ బీమా పథకం తదితర అంశాలపై కూడా నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉందని సమాచారం. ఇటీవల జరిగిన సమావేశంలో ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘాలకు నామినేట్ పద్ధతిన పాలక వర్గాలను నియమించేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. గచ్చిబౌలి స్టేడియాన్ని పీపీపీ పద్ధతిలో అభివృద్ధి చేయాలని కేబినెట్ నిర్ణయించింది. అదే విధంగా ఉద్యోగులకు సంబంధించిన రిటైర్మెంట్ బెనిఫిట్స్ సహా పలు కీలక అంశాలపై ఇటీవల జరిగిన కేబినెట్ భేటీలో నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే.

# ఎర్రబెల్లి భుజం తట్టిన చంద్రబాబు

## ఓ కార్యక్రమంలో ఆసక్తికర సన్నివేశం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 3:** ప్రముఖ సినీ నటుడు, నిర్మాత బండ్ల గణేశ్ కుమార్తె జనని నిశ్చితార్థ వేడుకలో ఆసక్తికర సన్నివేశం కనిపించింది. హైదరాబాద్‌లో



హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన ఓ కార్యక్రమంలో ఏపి సిఎం చంద్రబాబు, ఎర్రబెల్లి దయాకర్‌రావు

ఈరోజు జనని, పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన సూర్యతేజల నిశ్చితార్థం జరిగింది. ఈ వేడుకకు రాజకీయ, సినీ ప్రముఖులు హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, బీఆర్ఎస్ నాయకుడు, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఎదురుపడ్డారు. వేడుకకు హాజరయ్యేందుకు ఇద్దరూ దాదాపు ఒకే సమయంలో వచ్చారు. రాజకీయాలను పక్కనపెట్టి వారు ఆత్మీయంగా పలకరించుకున్నారు. చంద్రబాబు కనిపించగానే ఎర్రబెల్లి దయాకర్ రావు దగ్గరకు వెళ్ళి, ఆయన చేతులు పట్టుకుని కాస్త వంగి నమస్కరించారు. చంద్రబాబు ఆయన భుజం తట్టి, నమస్కరించారు. దీంతో ఎర్రబెల్లి కూడా ప్రతినమస్కారం చేశారు. ఆ తర్వాత ఏపీ ముఖ్యమంత్రి అక్కడి నుంచి ముందుకు కదిలారు. ఆంధ్రప్రదేశ్ విభజనకు ముందు ఎర్రబెల్లి దయాకర్ రావు తెలుగుదేశం పార్టీలో, చంద్రబాబు నేతృత్వంలో సుదీర్ఘకాలం పనిచేశారు. రాష్ట్ర విభజన తర్వాత కొంతకాలం టీడీపీలోనే ఉన్నప్పటికీ, ఆ తర్వాత టీఆర్ఎస్ (నేటి బీఆర్ఎస్)లో చేరారు. బండ్ల గణేశ్ కుమార్తె నిశ్చితార్థ వేడుకకు మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, మెగాస్టార్ చిరంజీవి, దర్శకేంద్రుడు రాఘవేంద్రరావు, విజయవాడ మాజీ ఎంపీ లగడపాటి రాజగోపాల్ తదితరులు హాజరయ్యారు.

## వారం - వర్జ్యం

04-05-2026, సోమవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
వైశాఖమాసం, ఉత్తరాయణం
వసంత ఋతువు, కృష్ణపక్షం, కృత్తిక కార్తె
తదియ తె.5.24
అనూరాధ ఉ.9.58
వర్జ్యం : సా.4.15-సా.6.03
దు.ము.12.30-మ.1.21, 2)మ.3.03-మ.3.54
శుభసమయం : ఉ.8.30-9.30
రాహుకాలం - ఉ.7.30-9.00

## వార్తాఫలం

**మేషం :** సోదరుల నుండి కీలక సమాచారం అందుకుంటారు. ఆరోగ్య సమస్యలు ఎదురైన అధిగమిస్తారు.

**వృషభం:** మీ మేధస్సుతో ప్రయోజనాలు దెబ్బ తినకుండా జాగ్రత్తలు తీసుకో గలుగుతారు. క్రయవిక్రయాలలో ప్రోత్సాహం.

**మిథునం:** ఉద్యోగస్థులకు మధ్యస్త ఫలితాలు గోచరిస్తున్నాయి. మీ మాటలకు వక్రభాష్యాలు చెప్పేవారు అధికమవుతారు.

**కర్కాటకం:** దూరప్రాంతాల నుండి శుభవార్తలు వింటారు. వివాదాలకు మాత్రం దూరంగా ఉండటం మంచిది. ఆరోగ్యం జాగ్రత్త.

**సింహం:** అనుకోని అవకాశాలు కలిసి వస్తాయి. తద్వారా లాభపడతారు. యోగాభ్యాసాలు చేయటం వలన లాభపడతారు.

**కన్య :** కోర్టు సంబంధిత కేసులు మీకు అనుకూలంగా మారతాయి. వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్త అవసరం.

**తుల :** స్థిరాస్తి వివాదాలు తీరి లబ్ది పొందుతారు. సాంకేతిక విద్యలపై ఆసక్తి చూపుతారు. వాహన సౌఖ్యం.

**వృశ్చికం:** వీసా, పాస్‌పోర్టులకు సంబంధించిన విషయాలలో సాంకేతిక లోపాలు ఎదురవుతాయి. ఆరోగ్యం విషయం జాగ్రత్త.

**ధనుస్సు:** కుటుంబంలో స్పర్థలు రాకుండా జాగ్రత్తలు పాటించండి. స్పష్టంగా ఉన్న కొన్ని విషయాలలో స్పష్టత ఏర్పడుతుంది.

**మకరం:** వ్యాపార విషయాలలో భాగస్వాముల నిజాయితీ మీద అతి నమ్మకం నిర్లక్ష్యం వద్దు. శుభవార్తలు అందుకుంటారు.

**కుంభం:** సంతానానికి సంబంధించిన విషయ వ్యవహారాలు మీ కనుసన్నలలో నడుస్తాయి. శ్రమకు తగిన ఫలితం.

**మీనం:** మీ వాళ్ళకు సరియైన అవకాశాలు కల్పించడానికి లేక వాళ్ళ ప్రతిభతో తెచ్చుకున్న అవకాశాలు దుర్వినియోగం అవుతాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# కింగ్‌లెవరో.. కింగ్ మేకర్లెవరో!

>> వందల ఇరవై నాలుగు స్థానాల ఫలితాలు ఏకకాలంలో తేలుతున్నాయి. ఈ ఫలితాలు ప్రతి రాష్ట్ర ప్రాంతీయ సరిహద్దులను దాటి ప్రతిధ్వనిస్తాయి. జాతీయ చర్చను రూపుదిద్దుతాయి, పార్టీ వ్యూహాలను పునఃసమీక్షిస్తాయి, 2029 లోక్‌సభ ఎన్నికలకు తొలి దిశానిర్దేశం చేస్తాయి. ప్రతి ఎగ్జిట్ పోల్ రేపు ఎలా ఉండవచ్చో దాని స్వంత అంచనాను అందించింది. లెక్కలోకి వచ్చే ఏకైక అంచనా ఉదయం కౌంటింగ్ కేంద్రాల వద్ద మొదలుకానుంది.

ఓట్ల లెక్కింపునకు సంబంధించి ఎన్నికల కమిషన్ అన్ని ఏర్పాట్లు చేసింది. కౌంటింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులోకి తీసుకొచ్చారు. విజయోత్సవాలు, సభలు, ర్యాలీలపై నిషేధం విధించింది. అలాగే ఆయా రాష్ట్రాలలో శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక బలగాలను కేంద్ర ఎన్నికల సంఘం రంగంలోకి దించింది.

ఇక గెలుపుపై అన్ని పార్టీలూ ధీమాతోనే ఉన్నాయి. బెంగాల్‌లో నాల్గోసారి సంపూర్ణ మెజారిటీతో ప్రభుత్వం ఏర్పాటు చేయబోతున్నామని సిఎం మమతా బెనర్జీ పేర్కొన్నారు. ఈసారి టిఎంసి విధ్వంసక పాలనకు ప్రజలు చరమగీతం పాడారని, తామే అత్యధిక మెజారిటీతో విజయం సాధిస్తున్నామని ప్రతిపక్ష నేత, బిజెపి అగ్రనేత సువేందు అధికారి తెలిపారు. అటు అసోంలో మళ్లీ తామే అధికారంలోకి వస్తున్నామని సిఎం బిశ్వంత్ శర్మ ధీమా వ్యక్తం చేశారు. అసోంలో విభజన రాజకీయాలకు తావులేదని, బిజెపికి ఈసారి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో కాంగ్రెస్ పక్ష ఉపనేత గౌరవ్ గొగోయ్ ఆశాభావం వ్యక్తం చేశారు. కేరళలో మూడోసారి విజయం తమదేనని సిఎం పినరయి విజయన్ పేర్కొన్నారు. తమ ప్రభుత్వంపై ప్రజల్లో ఎలాంటి వ్యతిరేకత లేదని, నేటి ఫలితాల్లో అది రుజువుకానుందని అభిప్రాయపడ్డారు. ఖచ్చితంగా ఈసారి యుడిఎఫ్ అత్యధిక మెజారిటీతో విజయం సాధిస్తుందని ఆ కూటమి పక్ష నేత, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సతీషన్ ధీమా వ్యక్తం చేశారు. తమిళనాడులో మరోమారు తామే అధికారంలోకి వస్తున్నామని డిఎంకె అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ తెలిపారు. ఎగ్జిట్ పోల్స్ కూడా చెప్పాయని ఆయన గుర్తుచేశారు. ఎఐఎడిఎంకె నేతృత్వంలోని ఎన్‌డియే భారీవిజయం సాధించబోతున్నది, ఖచ్చితంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తున్నామని మాజీ సిఎం పళనిస్వామి ధీమా వ్యక్తం చేశారు. ఈసారి ఎన్నికల్లో తామే కింగ్‌లు, కింగ్ మేకర్లమని టివికె అధినేత, సినీ నటుడు విజయ్ పేర్కొన్నారు.

ఇక రాష్ట్రాల వారీగా పరిశీలిస్తే, పశ్చిమ బెంగాల్‌కు ఉన్నంత జాతీయ ప్రాధాన్యత లేదు. దశాబ్దానికి పైగా బిజెపి నిరంతర విస్తరణ ప్రయత్నాన్ని ప్రతిఘటించిన రాష్ట్రం ఇది. సంక్షేమ పథకాల పంపిణీ, బెంగాలీ గుర్తింపు, ప్రతి ఎన్నికను రాష్ట్ర ఆత్మ కోసం జరిగే నాగరిక పోరాటంగా చిత్రీకరించగల సామర్థ్యంలో పాతుకుపోయిన వ్యక్తిగత ప్రజాదరణను మమతా బెనర్జీ రాజకీయ సంస్థకు అతీతమైన దానిని నిర్మించిన రాష్ట్రం ఇది. ఆమె వరుసగా నాలుగోసారి పదవిని కోరుకుంటున్నారు. 2011లో ముప్పై నాలుగేళ్ల లెఫ్ట్ ఫ్రంట్ పాలనను కూల్చివేసినప్పటి నుండి తృణమూల్ కాంగ్రెస్ అధికారంలో ఉంది. ఇది భారత రాజకీయ చరిత్రలోనే అత్యంత చెప్పుకోదగిన ఎన్నికల మార్పులలో ఒకటి. బిజెపి ఇప్పటివరకు బెంగాల్‌లో అత్యంత అధునాతన వ్యూహంతో ఈ ఎన్నికల్లోకి ప్రవేశిస్తోంది. 2021 నుండి నిర్మించిన సంస్థాగత పటిష్టత, ఓటర్లకు భరోసా ఇచ్చేందుకు కేంద్ర సాయుధ పోలీసు బలగాలను మోహరించడం, నదీ తీరంలో మోడీ జలమురి కార్యక్రమం నుండి డార్జిలింగ్‌లోని గోర్ఖా సమాజానికి అమిత్ షా గడువులోగా ఇచ్చిన హామీల వరకు జాగ్రత్తగా రూపొందించిన ప్రచారం. ఇవన్నీ రేపటి ఓట్ల లెక్కింపు కోసమే జరుగుతున్నాయి.

ఇక తమిళనాడు విషయానికొస్తే, ఎంకే స్టాలిన్ నేతృత్వంలోని డిఎంకె వరుసగా రెండోసారి అధికారంలోకి వస్తుందా, లేక ఐదేళ్ల పాటు అధికారానికి దూరంగా ఉన్న ఎఐఎడిఎంకె నేతృత్వంలోని ప్రతిపక్షం, బిజెపితో కలిసి ఎన్‌డియే పతాకం కింద తిరిగి అధికారాన్ని చేజిక్కించుకుంటుందా అనే విషయాన్ని తమిళనాడు ఎన్నికలు తేల్చనున్నాయి.

ఈ పోటీకి గతంలో జరిగిన ఏ తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలకూ లేని విధంగా మూడో కోణం ఉంది. అదే తమిళ సినిమా రంగంలోని అగ్రశ్రేణి నటులలో ఒకరైన విజయ్, 2024లో ప్రారంభించిన "తమిళగా వెట్రి కజగం" పార్టీ ఉనికి. విజయ్ స్వయంగా పెరంబూర్ నుంచి పోటీ చేస్తున్నారు. ఓట్ల లెక్కింపు ప్రారంభమైనప్పుడు, అధికార పార్టీ డిఎంకె వ్యతిరేక ఓట్లను ఏకీకృతం చేయడంలో టివికె సామర్థ్యం లేదా వాటిని చీల్చడంలో దాని పాత్ర నిర్ణయాత్మక అంశాలలో ఒకటిగా ఉంటుంది.




మీడియాతో బాధితుడు జిలాని



డ్రైవర్ నీలకంఠం సత్యనారాయణ

# కారుతో ఢీకొట్టి 2 కి.మీ ఈడ్చుకెళ్లి..

## ఓ డ్రైవర్ రాక్షసం

## తీవ్ర గాయాలపాలైన తండ్రి, కొడుకు

## జనం అడ్డుకోవడంతో డ్రైవర్ పరార్

**సరూర్‌నగర్, మే 3 ప్రభాతవార్త:** కారు, బైకు ఢీకొన్న సంఘటనలో ఓ డ్రైవర్ ఉన్మాదిలా ప్రవర్తించాడు. ప్రమాదానికి కారకుడైన డ్రైవర్‌ను నిలదీసిన వ్యక్తి అడ్డుకునే ప్రయత్నం చేయగా సదరు డ్రైవర్ ఓ వ్యక్తిని దారుణంగా ఢీకొట్టుకుంటూ పారిపోవాలని యత్నించాడు. అయితే పట్టువదలకుండా ఆ వ్యక్తి కారు బ్యానెట్ పట్టుకొని ఆపాలని యత్నించినా డ్రైవర్ మాత్రం రాక్షసంగా ప్రవర్తిస్తూ అందరూ చూస్తుండగానే దాదాపు రెండు కిలోమీటర్ల వరకు ఈడ్చుకెళ్ళాడు. ఈ ఉదంతాన్ని రోడ్డుపై వెళ్తున్న కొందరు వీడియోలు తీసి సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేయడంతో కలకలం రేగింది. ఎట్టకేలకు డ్రైవర్ కారును ఆపి తర్వాత పరారుకాగా రంగంలో దిగిన పోలీసులు దర్యాప్తు చేసి నిందితుడిని అదుపులోకి కేసును నమోదు చేశారు. సినిమా ఫైట్స్ మాదిరిగా జరిగిన ఈ దిగ్భ్రాంతికర సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. మీర్‌పేట్ ప్రాంతానికి చెందిన ఎస్ఎ జిలానీ తన కుమారుడు ఫైసల్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై ఎల్‌బినగర్ వైపు వెళ్తుండగా గాయత్రీనగర్ యు టర్న్ వద్ద టిజి 07 యు 1109 అనే నెంబర్ గల కారు ఢీకొట్టింది. దీంతో డ్రైవర్‌కు, బైక్‌పై వెళ్తున్న తండ్రి కొడుకులకు మధ్య వాగ్వివాదం జరిగింది. అయితే డ్రైవర్ ఫైసల్‌పై దాడి చేయడమే కాకుండా జుట్టు పట్టుకొని కారు డ్రైవ్ చేస్తూనే ఈడ్చుకెళ్ళాడు. ఈ ఘటనతో డివైడర్ మధ్య నలిగిన ఫైసల్ తీవ్రంగా గాయపడ్డాడు. ఫైసల్ కింద పడిన తర్వాత తండ్రి జిలాని కారును అడ్డుకునే ప్రయత్నం చేశాడు. దీంతో డ్రైవర్ అక్కడి నుండి తప్పించుకునే క్రమంలో జిలాని కారుకు అడ్డుగా నిలబడ్డాడు. అయినా డ్రైవర్ మాత్రం రాక్షసంగా ప్రవర్తిస్తూ ఢీకొట్టుకుంటూ వెళ్లాలని ప్రయత్నించినా జిలాని మాత్రం బ్యానెట్‌ను పట్టుకొన్నాడు. ఆ తర్వాత కారు డ్రైవర్ వేగాన్ని పెంచి ముందుకు దూసుకుపోగా జిలాని మాత్రం బ్యానెట్‌ను వదలకుండా ప్రమాదకర పరిస్థితిలో వేలాడుతూనే ఉన్నాడు. ప్రమాదం జరిగిన స్థలం నుండి బాలాపూర్ చౌరస్తా వైపు వెళ్ళిన కారు తిరిగి మంద మల్లమ్మ వైపు రాగా కొందరు అడ్డుకున్నారు. దీంతో భయపడిన డ్రైవర్ కారు దిగి పారిపోయాడు. ఈ ఘటనలో గాయపడిన తండ్రి కొడుకులను ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. కారు డ్రైవర్ కారణంగా ఫైసల్ కాళ్ళకు ఫ్యాక్చర్ అయ్యాయి. ఈ మేరకు కేసు నమోదు చేసిన మీర్‌పేట్ పోలీసులు నిందితుడైన కారు డ్రైవర్‌ను గుర్తించారు. క్యాబ్ డ్రైవర్‌గా పని చేసే నీలకంఠం సత్యనారాయణ (28)ను అదుపులోకి తీసుకొని పోలీసులు విచారిస్తున్నట్లు తెలిసింది.

# సరిగా పనిచేయండి.. ఆదాయం పెరుగుతుంది

## నెలకు అదనంగా రూ.3వేల కోట్ల ఆదాయం పెంచవచ్చు

## ఉద్యోగులకు పలు సూచనలు చేసిన సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే3:** రాష్ట్రానికి ఆదాయం పెంచేందుకు పన్నులు పెంచడం పరిష్కారం కాదని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. పన్నులు చెల్లించాల్సిన వారందరినీ సిస్టంలోకి తీసుకొస్తే రాష్ట్ర ఆదాయం మరింత పెరుగుతుందని పేర్కొన్నారు. ఉద్యోగ సంఘాలతో చర్చలు సందర్భంగా రాష్ట్ర ఆదాయం పెంచేందుకు ఉద్యోగులు నిర్వర్తించాల్సి విధులకు సంబంధించి పలు సూచనలు చేశారు. ఉద్యోగులు తమ విధులు సక్రమంగా నిర్వహిస్తే రాష్ట్రానికి నెలకు రూ.3వేల కోట్ల ఆదాయం పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. జీఎస్టీలో అరవింద్ సుబ్రమణ్యం అనే అధికారిని నియమించి, ఆయన అధ్వర్యంలో టీమ్‌ను ఏర్పాటు చేయడంతో ఆదాయం పెరిగిందన్నారు. డిసెంబర్‌లో ఆయనను నియమిస్తే జనవరిలో రూ.500 కోట్లు, ఫిబ్రవరిలో రూ.500 కోట్లు, మార్చిలో రూ.500 కోట్లు, ఏప్రెల్‌లో రూ.1000 కోట్ల ఆదాయం పెరిగిందని పేర్కొన్నారు. ఏప్రెల్ నెలలో 35శాతం జీఎస్టీ ఆదాయం పెరిగిందని పేర్కొన్నారు. చిన్న లీకేజీన్ అరెస్ట్ చేసి కరెక్షన్ చేస్తే నాలుగు నెలల్లో రూ.2500 కోట్ల ఆదాయం వచ్చిందని తెలిపారు. పైన ఉండే కమిషనర్లు, ప్రిన్సిపాల్ సెక్రటరీలను తప్ప మిగతా జీఎస్టీలో అదే ఉద్యోగులు ఉన్నారని, ఓల్డ్ ఎస్టాబ్లిస్ట్ సిస్టమే అయినా వాళ్లంతా కుదురుగా పనిచేస్తే రాష్ట్రానికి ఎంతో ఆదాయం వచ్చిందన్నారు. ఉద్యోగులందరూ ఇలా కుదురుగా పనిచేస్తే రాష్ట్రానికి నెలకు రూ.1000 కోట్ల ఆదాయం పెరుగుతుందని, సంవత్సరానికి రూ.12వేల కోట్ల ఆదాయం పెరుగుతుందని పేర్కొన్నారు. మైనింగ్‌లో గతంలో రూ.600 కోట్ల ఆదాయం వచ్చేందని, రూ.600 కోట్లు దాటకుండా 8 ఏండ్లు మేనేజ్ చేయడంతో ఇసుకలో ఆదాయం అక్కడే ఆగిందన్నారు. ఒక అధికారిని పెట్టి కొంత ప్రోత్సహిస్తే అదనంగా రూ.500 కోట్ల ఆదాయం పెరిగిందని, ఈసారి మొత్తంగా ఆదాయం రూ.1100 కోట్ల ఆదాయం వస్తుందని పేర్కొన్నారు.


# ప్రశాంతంగా నీట్

>> ఆఫ్ సిలబస్ నుంచి ప్రశ్నలు రాలేదని చెబుతున్నారు. నీట్ పరీక్షను ఆదివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించారు. పరీక్షను దేశ వ్యాప్తంగా 552 నగరాల్లో నిర్వహించారు. నీట్ పరీక్షను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టిఏ) నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. నీట్ యుజీ- 2026 పరీక్ష కోసం 22,79,743 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. వారిలో 13,32,928 మంది మహిళా అభ్యర్థులు ఉండగా 9,46,815 మంది పురుష అభ్యర్థులు ఉన్నారు. టెట్ పరీక్షకు తెలంగాణ రాష్ట్రంలోని ఆదిలాబాద్, ఆసిఫాబాద్, భూపాలపల్లి, గద్వాల, జగిత్యాల, జనగామ, కొత్తగూడెం, మహబూబాబాద్, మంచిర్యాల, మెదక్, మేడ్చల్, నల్గొండ, నిజామాబాద్, సిద్దిపేట, సూర్యాపేట, వికారాబాద్, హైదరాబాద్, సికింద్రాబాద్, కరీంనగర్, ఖమ్మం, రంగారెడ్డి, వరంగల్, సంగారెడ్డి, మహబూబ్‌నగర్‌తో కలిపి 24 పట్టణాల్లోని 199 కేంద్రాల్లో నీట్ నిర్వహించారు. ఒక్క హైదరాబాద్‌లోనే 69 పరీక్ష కేంద్రాలును ఎన్‌టిఏ ఏర్పాటు చేసింది. తెలంగాణలో సుమారు 73,084 మంది విద్యార్థులు నీట్‌కి దరఖాస్తు చేసుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో కూడా నీట్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది.

# తుపాకులు పేల్చి నగలు లూటీ



ఆదివారం కరీంనగర్‌లో చోరీకి పాల్పడిన దుండగులు



నగల దుకాణంలో సిబ్బందిని తుపాకులతో భయపెడుతున్న దృశ్యం

## కరీంనగర్‌లో పట్టపగలు జ్యుయెలరీ షాపుపై దాడి

## నలుగురికి తీవ్రగాయాలు.. కిలో పైగా నగలు దోపిడి

## అంతర్రాష్ట్ర ముఠా పనే అంటున్న పోలీసులు

## ప్రత్యేక బృందాలతో గాలింపు

**కరీంనగర్ క్రైమ్, ప్రభాతవార్త:** కరీంనగర్ జిల్లా కేంద్రం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. జిల్లా ప్రధాన న్యాయస్థానం పక్కన వీధిలో ఉన్న నగల దుకాణంలో సాయుధులైన ఐదుగురు దుండగులు ఆయుధాలు చేతపట్టి అడ్డువచ్చిన వారిపై కాల్పులు జరిపి దోపిడీకి పాల్పడ్డారు. ఆదివారం ఉదయం సుమారు 10:30గంటల సమయంలో జరిగిన ఈ ఘటన సంచలనం సృష్టిస్తుంది. నిరంతర నిఘా రెండు రోజులుగా నాఖాబందీ నిర్వహిస్తున్న పోలీసులకు సవాల్ విసురుతూ జిల్లా కేంద్రంలో దోపిడీకి పాల్పడటం ఒక్కసారిగాభయాందోళనకు గురి చేసింది. సరిగ్గా దుకాణం తెరిచిన కొద్దిసేపటికే ఐదుగురు దుండగులు లోపలికి ప్రవేశించి కాల్పులు జరిపినట్లు తెలుస్తోంది. అప్పటికి దుకాణంలో కొంతమంది సిబ్బంది మాత్రమే వచ్చినట్లు సమాచారం. వచ్చి రాగానే కాల్పులు జరగడంతో జువెలరీ షాప్ సిబ్బంది భయంతో పరుగులు తీశారు. బంగారు గొలుసు కావాలని ఖరీదు చేసేందుకు మొదట కొంతమంది లోపలికి వచ్చిన తర్వాత, మరో ఇద్దరు గన్స్ తో వచ్చి కాల్పులు జరిపినట్లు సిబ్బంది తెలిపారు. దుకాణం తెరవగానే లాకర్ లో ఉన్న నగలను డిస్ ప్లేలో సర్దుతుండగా ఈ ఘటన జరిగినట్లు సిబ్బంది చెప్తున్నారు. ఘటన స్థలాన్ని పరిశీలించిన కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం సుమారు కిలో కు పైగా బంగారు నగలను ఎత్తుకెళ్లినట్లు ప్రాథమిక నిర్ధారణకు వచ్చినట్లు తెలిపారు. దుండగులు జరిపిన కాల్పుల్లో నలుగురికి గాయాలయ్యాయని ప్రైవేట్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నారని ప్రాణాపాయం ఏమి లేదని కమిషనర్ తెలిపారు. గాయపడిన వారిలో కమల్, ముస్తాక్ , రాజేష్, మధుకర్ ఉన్నట్లు చెప్పారు..దుండగులలో నలుగురు మాత్రం మాస్క్ ధరించలేదని, ఒక్కరు మాస్క్ ధరించి ద్విచక్ర వాహనాలపై కోర్టు వెనకాల ఉన్న వీధి మార్గంలో పారిపోయినట్లు లభించిన ఆధారాల మేరకు దర్యాప్తు కొనసాగుతుందనీ పోలీసులు చెప్తున్నారు. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నిందితులను పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. నిఘా వైఫల్యమేనా? జిల్లా కేంద్రం నడిబొడ్డున కోర్టు సమీపంలో ఈ ఘటన చోటు చేసుకోవడం పోలీసుల వైఫల్యాన్ని ఎత్తిచూపుతుందనే విమర్శలు లేకపోలేదు. గడిచిన రెండు రోజులుగా నగరంలో నాఖబంధి పోలీస్ అధికారులకు నిర్వహిస్తున్నారు. అయినప్పటికీ ఈ దోపిడి జరిగిన తీరు పలు అనుమానాలకు దారి తీస్తుంది. కోర్టు సమీపంలో ఈ ఘటన జరగడం నిరంతర భద్రత ఉండే చోట ఓ ముఠా పక్క స్కెచ్ తో దోపిడీకి పాల్పడటం వెనక పోలీస్ శాఖ నిరక్ష్యాన్ని బయటపెడుతుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో చొప్పదండి బ్యాంక్ దోపిడి మొదలుకొని నేటివరకు అంతరాష్ట్ర ముఠాలు కరీంనగర్‌ను లక్ష్యంగా చేసుకున్నప్పటికీ పోలీసులు మాత్రం భద్రత కల్పించడంలో విఫలమవుతున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.

శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో భారీగా డ్రగ్స్ పట్టివేత

## 5.8 కిలోల హైడ్రోపోనిక్ గంజాయి సీజ్: ఇద్దరు అరెస్ట్

**రంగారెడ్డి అర్బన్, మే3,ప్రభాతవార్త:** శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో కస్టమ్స్ ఏఐయూ అధికారులు మరోసారి భారీగా మాదకద్రవ్యాలను పట్టుకుని స్మగ్లింగ్ ముఠాకు గట్టి షాక్ ఇచ్చారు. కౌలాలంపూర్ నుంచి హైదరాబాద్‌కు వచ్చిన ఓప్రయాణికుడి వద్ద నుంచి సుమారు 5.8కిలోల హైడ్రోపోనిక్ గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంలో సంబంధం ఉన్న మరో వ్యక్తిని కూడా అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. వివరాల్లోకి వెళ్తే.. మే 2వ తేదీ తెల్లవారుజామున ఏకే69 విమానంలో కౌలాలంపూర్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు చేరుకున్న మోహన్ కందన్ అనే ప్రయాణికుడిపై కస్టమ్స్ అధికారులకు అనుమానం కలిగింది. వెంటనే అతడిని అరైవల్ విలేజ్ ప్రాంతంలో అడ్డగించి సామాన్లను క్షుణ్ణంగా తనిఖీ చేయగా.. సిగరెట్ బాక్సుల్లో అత్యంత చాకచక్యంగా దాచిపెట్టిన 5.8 కిలోల హైడ్రోపోనిక్ గంజాయి బయటపడింది. ఈ కేసు విచారణలో భాగంగా తమిళనాడులోని తోండి ప్రాంతానికి చెందిన సిథిక్ అలీ అనే వ్యక్తి ఈ మాదకద్రవ్యాలను స్వీకరించాల్సి ఉందని అధికారులు గుర్తించారు. దీంతో అతడిని కూడా అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.సీజ్ చేసిన గంజాయితో పాటు స్మగ్లింగ్‌కు ఉపయోగించిన వస్తువులను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులిద్దరిపై ఎన్డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి, బషీర్‌బాగ్‌లోని కస్టమ్స్ హెడ్‌క్వార్టర్స్‌కు తరలించి మరింత లోతుగా దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# జూన్ 2 నుండి ఉచిత విద్యుత్ పంపిణీ సంస్థ ప్రారంభం

### కొత్త సంస్థకు 42 శాతం మార్కెట్ వాటా

### డిస్కం పరిధిలో 29.08 లక్షల కనెక్షన్లు

### డివిజనల్ ఇంజనీర్లకు జిల్లాల పర్యవేక్షణ

**హైదరాబాద్, మే 3, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం వివిధ వర్గాల వారికి ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఉచిత విద్యుత్ పథకాలకు సంబంధించి ప్రత్యేకంగా కొత్తగా ఏర్పాటు చేసిన ఉచిత విద్యుత్ పంపిణీ సంస్థ (టిజిఆర్డీడీసీఎల్) రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం జూన్ 2వ తేదీ నుండి తన కార్యకలాపాలను నిర్వహించనుంది. ఈ మూడో ఉచిత విద్యుత్ పంపిణీ సంస్థ ప్రారంభానికి సంబంధించిన పరిపాలనా ఏర్పాట్లు చురుకుగా జరుగుతున్నాయి. విద్యుత్ శాఖ అధికార వర్గాల వివరాల ప్రకారం మూడో ఉచిత విద్యుత్ డిస్కం కార్యకలాపాల నిర్వహణకు గాను అన్ని చట్టబద్ధమైన పత్రాలు పూర్తయ్యాయి. అంతేకాకుండా ఈ డిస్కం ద్వారా విద్యుత్ పంపిణీ చేసేందుకు అవసరమైన లైసెన్సుల కోసం దరఖాస్తులను తెలంగాణ విద్యుత్ నియంత్రణ కమిషన్‌కు ఇప్పటికే సమర్పించడం జరిగింది. ప్రధానంగా ఉచిత విద్యుత్ రంగానికి సేవలు అందించేందుకు ఉద్దేశించిన ఈ మూడవ విద్యుత్ పంపిణీ సంస్థ ఏర్పాటు చేయడంతో తెలంగాణ విద్యుత్ పంపిణీరంగం గణనీయమైన పునర్వ్యవస్థీకరణకు గురవుతోంది. గత ఐదేళ్లగా నమోదైన విద్యుత్ వినియోగ ధోరణుల ఆధారంగా ఈ కొత్త సంస్థకు 42 శాతం మార్కెట్ వాటాను కేటాయించారు. దీని ఫలితంగా, దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (ఎస్పీడీసీఎల్) వాటా 71 శాతం నుండి 45 శాతానికి, ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ (ఎన్పీడీసీఎల్) సంస్థ వాటా 29 శాతం నుండి 13 శాతానికి తగ్గుతుంది. మరోపక్క మూడు పంపిణీ సంస్థల సవరించిన మార్కెట్ వాటాలకు అనుగుణంగా సిబ్బంది పునఃపంపిణీ చేపడుతోంది. ఉమ్మడి జిల్లాలను సూపరింటెండింగ్ ఇంజనీర్లు పర్యవేస్తారు. కంపెనీ కార్యకలాపాలకు అవసరమైన జిల్లాల్లో ఉచిత విద్యుత్ పంపిణీకి సంబంధించిన పర్యవేక్షణ డివిజనల్ ఇంజనీర్ పర్యవేక్షణలో ఉంటుంది. సంస్థాగత చట్రాన్ని అందించే డైరెక్టర్ల బోర్డు ఇప్పటికే ఏర్పాటు చేయబడింది. నియామక ప్రణాళికలలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 660 మంది ఇంజనీర్లు మరియు అదనంగా 1,340 మంది ఉద్యోగులను నియమించనున్నారు. దీనికి సంబంధించి ఇటీవలే బదిలీ ప్రక్రియకు శ్రీకారం



చుట్టింది. కొత్త నియామకాలు, అంతర్గత పదోన్నతుల సమతుల్య మిశ్రమం ద్వారా సిబ్బందిని యామకం జరుగుతోంది. తెలంగాణ విద్యుత్ ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ (ట్రాన్స్‌కో), తెలంగాణ విద్యుత్ ఉత్పత్తి సంస్థ (జెన్కో), ఉత్తర, దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులను ఈ మూడో ఉచిత విద్యుత్ పంపిణీ సంస్థకు పదోన్నతి, బదిలీలకోసం తాజాగా నోటిఫికేషన్ సైతం విడుదల చేసింది. ప్రస్తుతం ఉన్న దక్షిణ, ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలకు చెందిన దాదాపు 34 వేల మంది శాశ్వత ఉద్యోగులు, ఆర్టిజన్లు ఉచిత విద్యుత్ పంపిణీ సంస్థలో చేరడానికి ఆసక్తిచూపారని విద్యుత్ శాఖ అధికవర్గాలు వెల్లడించాయి. కాగా ఇప్పటివరకు హైదరాబాద్ కేంద్రంగా ఉన్న ఎస్పీడీసీఎల్, వరంగల్ కేంద్రం గా ఉన్న ఎన్పీడీసీఎల్ అనే రెండు సంస్థలు రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ పంపిణీ నెట్వర్క్‌ను నిర్వహిస్తున్నాయి. అయితే రాష్ట్ర ప్రభుత్వం వివిధ వర్గాలకు ప్రధానంగా వ్యవసాయం, గృహాలు, బలహీనవర్గాల కాలనీలు, మిషన్ భగీరథ తదితర వాటకి ఇప్పటి వరకూ ఉన్న రెండు విద్యుత్ పంపిణీ సంస్థల ద్వారా ఉచిత కరెంట్‌ను సరఫరా చేస్తోంది. ఇందుకు గాను వాటికయ్యే వ్యయం నిమిత్తం విద్యుత్ పంపిణీ సంస్థలకు సబ్సిడీ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం వాటి మొత్తాలను చెల్లిస్తోంది. అయితే వ్యవసాయానికి తదితర వాటికి విద్యుత్ వినియోగం ఎంత జరుగుతుందనే దానికి ఇప్పుడున్న పంపిణీ సంస్థల వద్ద కరెక్ట్ లెక్కలు లేకుండా పోయాయి. ఉచిత విద్యుత్‌కు సంబంధించి కీలకమైన కార్యాచరణ మార్పులో భాగంగా, రాష్ట్ర ప్రభుత్వం 29.08 లక్షల విద్యుత్ కనెక్షన్లను కొత్త ఉచిత విద్యుత్ పంపిణీ సంస్థకు బదిలీ చేసింది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా ఉచిత విద్యుత్ కయ్యే వాస్తవ వినియోగం, వ్యయాన్ని గుర్తించేందుకు మూడో ఉచిత విద్యుత్ పంపిణీ సంస్థను ఏర్పాటు చేసింది.

## ప్రశాంతంగా ముగిసిన టిజిఆర్‌జేసీ ఎంట్రన్స్ టెస్ట్

### పరీక్షకి 77.77శాతం హాజరు, 35 రెసిడెన్షియల్ కాలేజీలు, 93 కేజీబీవీల్లో అడ్మిషన్ల కోసం పరీక్ష నిర్వహణ

**హైదరాబాద్, ప్రభాతవార్త, మే 3:** తెలంగాణ రాష్ట్రంలోని జనరల్ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీలతోపాటు,93కస్తూర్బాగాంధీ బాలికా విద్యాల యాలు(కేజీబీవీ) ల్లో 2026-27 విద్యా సంవత్సరంలో ఇంటర్ మొదటి సంవత్సరంలో అడ్మిషన్ల కోసం నిర్వహించే టిజిఆర్‌జేసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(టిజిఆర్‌జేసీ సెట్)-2026 ఆదివారం ప్రశాంతంగాజరిగింది. పరీక్షకు 77.77శాతం మంది హాజరైనట్టు రెసిడెన్షియల్ సొసైటీ సెక్రటరీ ఒకప్రకటనలో తెలిపారు. పరీక్షను ఆదివారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించారు.ఎంట్రన్స్ టెస్ట్‌కి 76,174మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 59,244మంది హాజరయ్యారు. టిజిఆర్‌జేసీ సెట్-2026 ద్వారా 35 తెలంగాణ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీలతోపాటు 93కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలలో ఇంటర్మీడియట్ మొదటిసంవత్సరంలో అడ్మిషన్లు తీసుకోనున్న విషయం తెలిసిందే. ఇంటర్‌లో ఇంగ్లీషు మీడియంలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపుల్లో అడ్మిషన్లను తీసుకోనున్నారు. 35 గురుకుల కాలేజీల్లో 3000 సీట్లు అందుబాటులో ఉండగా93 కేజీబీవీల్లో 3700 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ప్రవేశపరీక్ష కోసం మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్, మెదక్, నిజామాబాద్, అదిలాబాద్, కరీంనగర్, హనుమకొండ, ఖమ్మం, నల్గొండ, సిద్దిపేట, సంగారెడ్డి జిల్లా కేంద్రాల్లో, అభ్యర్థులకు 317 సెంటర్లు ఏర్పాటు చేశారు.

## దేశంలోనే అత్యల్ప ద్రవ్యోల్బణం తెలంగాణలోనే..

**హైదరాబాద్, మే 3, ప్రభాతవార్త:** దేశంలోనే తెలంగాణ అత్యల్ప ద్రవ్యోల్బణాన్ని నమోదు చేసింది. ఏప్రిల్ నెలలో తెలంగాణలో ద్రవ్యోల్బణం 1.26 శాతంగా ఉంది. తెలంగాణ తర్వాత అత్యల్ప ద్రవ్యోల్బణం ఢిల్లీలో నమోదైంది. అక్కడ ద్రవ్యోల్బణం 1.77 శాతంగా నమోదైంది. ఈ రెండు రాష్ట్రాల్లో మాత్రమే ద్రవ్యోల్బణం రెండు శాతానికి దిగువగా ఉంది. భారతదేశంలో రిటైల్ ద్రవ్యోల్బణం ఏప్రిల్‌లో 3.16 శాతానికి తగ్గిందని గణాంకాల శాఖ విడుదల చేసిన తాజా సమాచారం వెల్లడించింది. ఇది జూలై 2019 తర్వాత దేశంలో నమోదైన అతి తక్కువ స్థాయి ద్రవ్యోల్బణం. ముఖ్యంగా ఆహార ధరలు తగ్గడమే దీనికి ప్రధాన కారణంగా పేర్కొంది. తెలంగాణలో ఏప్రిల్ నెలలో రిటైల్ ద్రవ్యోల్బణం 1.26 శాతంగా నమోదైంది. ఇది మార్చిలో నమోదైన 1.06 శాతం కన్నా స్వల్పంగా పెరిగినా, దేశ సగటు స్థాయి 3.16 శాతం కంటే చాలా తక్కువ.

ఈ రేటు భారత రిజర్వ్ బ్యాంక్ సూచించిన ఆరోగ్యకరమైన ద్రవ్యోల్బణ పరిధి (2 నుండి 4 శాతం ) కంటే దిగువగా ఉండడం గమనార్హం. విభాగాల వారీగా చూస్తే, తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లో ద్రవ్యోల్బణం కేవలం 0.44 శాతంగా నమోదైంది, ఇది దేశంలో అత్యల్పంగా ఉంది. పట్టణ ప్రాంతాల్లో ఇది 1.99 శాతంగా ఉంది, ఇది ఢిల్లీ తర్వాత రెండవ తక్కువ రేటు. దేశస్థాయిలో గ్రామీణద్రవ్యోల్బణం సగటు 2.92 శాతం కాగా, పట్టణంలో అది 3.36 శాతంగా ఉంది.మార్చిలో 1.06 శాతం, ఫిబ్రవరిలో 1.31శాతం, జనవరిలో 2.22 శాతం ద్రవ్యోల్బణంతో తెలంగాణ తక్కువ స్థాయిల్లో కొనసాగుతోంది. ఇది దేశంలో మొత్తం ద్రవ్యోల్బణం తగ్గుదల నేపథ్యంలో ముఖ్యమైన అంశంగా నిలుస్తోంది. ఆహార ధరల తగ్గుదలతో కలిపి, పట్టణ,గ్రామీణ ప్రాంతాల్లో ద్రవ్యోల్బణం లోనవుతున్న తీరును ఇది ప్రతిబింబిస్తోంది. రాష్ట్రాల వారీగా చూస్తే, కేరళ ఏప్రిల్‌లోనూ దేశంలో అత్యధిక ద్రవ్యోల్బణాన్ని నమోదు చేసిన రాష్ట్రంగా నిలిచింది.

ఇది వరుసగా నాల్గో నెలగా కొనసాగుతోంది. మార్చిలో 6.59 శాతంగా ఉన్న ద్రవ్యోల్బణం ఏప్రిల్‌లో 5.94 శాతానికి తగ్గినప్పటికీ,ఇది ఇప్పటికీ దేశంలో అత్యధికంగా ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో కేరళ ద్రవ్యోల్బణం 6.46 శాతంగా ఉండగా, పట్టణాల్లో ఇది 4.91 శాతంగా నమోదైంది.

## నేటి నుండి హజ్‌కు విమానాలు

### ఒక్కో ట్రిప్‌కు 430 మంది యాత్రికులు

### రాష్ట్ర హజ్ కమిటీ ఛైర్మన్ గులాం అఫ్జల్

**హైదరాబాద్, మే 3, ప్రభాతవార్త:** హజ్ యాత్రకు రాష్ట్ర హజ్ కమిటీ పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేసింది. ఈ నెల 4వ తేదీ నుండి హజ్‌కు తీసుకెళ్లేందుకు విమానాలను సిద్ధం చేసింది. హైదరాబాద్ నుండి బయలు దేరే యాత్రికుల కోసం సమగ్ర ఏర్పాటు చేసినట్లు తెలంగాణ రాష్ట్ర హజ్ కమిటీ ఛైర్మన్ మౌలానా సయ్యద్ షా గులాం అఫ్జల్ బియాబానీ ఖుస్రూ పాషా వెల్లడించారు. ఈ మేరకు అదివారం ఒక ప్రకటనలో హజ్ యాత్రికుల ప్రయాణం, వసతి సౌకర్యాలు సజావుగా జరిగేందుకు అన్ని ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు. యాత్రా కాలానికి సంబంధించిన కీలకమైన రవాణా ఏర్పాట్లను గుర్చి వివరిస్తూ యాత్రికులను హైదరాబాద్‌లోని హజ్ హౌస్ నుండి రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి ఏసీ బస్సుల్లో తరలిస్తారన్నారు. ప్రతీ యాత్రికుడికి గరిష్టంగా 40 కిలోల బరువున్న రెండు చెక్-ఇన్ బ్యాగ్‌లతో పాటు, మరో 7 కిలోల బరువున్న ఒక చేతి సంచిని కూడా అనుమతిస్తారన్నారు. హైదరాబాద్ నుండి బయలుదేరే యాత్రికుల ప్రయాణాలు ఈ నెల 4వ తేదీన ప్రారంభం కానుండగా, చివరి బృందం ఇదే నెల 21న బయలుదేరుతుందని వెల్లడించారు. అంతర్జాతీయ విమానాశ్రయం నుండి బయలుదేరే ప్రతి విమానంలో సుమారు 430 మంది యాత్రికులు ప్రయాణించనున్నట్లు తెలిపారు. యాత్రికులకు మార్గనిర్దేశం, సమాచార మార్పిడిలో సహాయపడటానికి హజ్ కమిటీ అఫ్ ఇండియా స్మార్ట్ వాచ్‌లను అందిస్తుందని పేర్కొన్నారు. ఇటీవల విమాన ఛార్జీల పెంపును ప్రస్తావిస్తూ అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో పెరుగుతున్న ఇంధన ధరలకు అనుగుణంగా విధించిన అదనపు రూ.10 వేల ఛార్జీని పున:పరిశీలించాలని తెలంగాణ ప్రభుత్వం కేంద్రాన్ని కోరిందని తెలిపారు.

## నేటి నుంచి ఎప్‌సెట్ అగ్రికల్చర్ పరీక్షలు

### 106 కేంద్రాల్లో 90,960 మందికి పరీక్ష

### రేపు కూడా కొనసాగింపు.. నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదు

### 9 నుంచి 11 వరకు ఇంజనీరింగ్ పరీక్షలు

**హైదరాబాద్, ప్రభాతవార్త, మే3:** తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల్లో 2026-27 విద్యాసంవత్సరానికి ఇంజనీరింగ్ కోర్సుల్లో చేరేందుకు నిర్వహించే ఈఏపి(ఎప్)సెట్-2026కి సంబంధించిన అగ్రికల్చర్ పరీక్షలు నేటి(సోమవారం) నుంచి ప్రారంభంకానున్నాయి. రేపు(మంగళవారం) కూడా కొనసాగనున్నాయి. నిమిషంఆలస్యమైనా పరీక్షా కేంద్రంలోనికి అనుమతి లేదని అధికారులు స్పష్టం చేశారు. అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షల కోసం రాష్ట్ర వ్యాప్తంగా 106 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు ఎప్‌సెట్-2026 కన్వీనర్ ప్రొఫెసర్ విజయ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఎప్ సెట్-2026కి 3,01,203 దరఖాస్తులు వచ్చాయి. ఏప్రిల్ 23 నుంచి అగ్రికల్చర్ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థుల హాల్ టికెట్స్‌ను విడుదల చేశారు. మొత్తం 3,01,203 దరఖాస్తుల్లో ఇంజనీరింగ్‌కి 2,10,318 దరఖాస్తులు రాగా, అగ్రికల్చర్, ఫార్మసీకి 90,569 దరఖాస్తులు వచ్చాయి. అగ్రికల్చర్ పరీక్షలను నేడు(సోమవారం) రేపు(మంగళ వారం) రెండు రోజుల్లో నిర్వహించనున్నారు. నేటి ఉదయం సెషన్‌లో 30,333 మంది, మధ్యాహ్నసెషన్‌లో 30,253 మంది హాజరు కానుండగా.. రేపు(మంగళవారం) జరిగే సెషన్‌కి 30,372 మందికి పరీక్షను నిర్వహిం చనున్నారు. అగ్రికల్చర్ పరీక్షల కోసం రాష్ట్రవ్యాప్తంగా 106 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎప్ సెట్ పరీక్షా కేంద్రాలను ఇప్పటికే నిర్ణయించిన నేపథ్యంలో వాటిల్లో పరీక్షల నిర్వహణ కోసం అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈసారి నుంచి విద్యార్థులు పరీక్షరాసిన వెంటనే వారికి ప్రాథమికకీ ప్రకారం ఎన్ని మార్కులు సాధిస్తారనేది వెంటనే తెలిసిపోతుంది. అయితే వారికి ఫైనల్ ర్యాంకులను మాత్రం ఫైనల్ కీతోపాటు నార్మలైజేషన్‌ను బట్టివారికి ఎప్ సెట్-2026 ర్యాంకులను కేటాయిస్తారు. ఈ నెల 9 నుంచి 11 వరకు ఇంజనీరింగ్ పరీక్షలు జరగనున్నాయి.

## గ్యాస్ సిలిండర్ డెలివరీపై అదనంగా వసూళ్లు

### రూ.20నుంచి రూ.50మేర ఛార్జి



**హైదరాబాద్, మే 3, ప్రభాతవార్త:** గ్యాస్ సిలిండర్ ధరలు సామాన్యుడికి గుదిబండగా మారితే, డెలివరీ బాయ్స్ వసూలు చేస్తున్న అదనపు ఛార్జీలు సామాన్యుల కష్టాలను మరింత పెంచుతున్నాయి. ఎల్‌పిజి సిలిండర్ డోర్ డెలివరి సమయంలో డెలివరి బాయ్స్ గ్యాస్ సిలిండర్ బిల్లుపై ఉన్న ధర కంటే అదనంగా రూ. 20 నుంచి రూ. 50 వరకు వసూలు చేయడం ఇప్పుడు సర్వసాధారణంగా మారింది.నిబంధనల ప్రకారం, సిలిండర్ ధర కాకుండా ఒక్క రూపాయి కూడా అదనంగా చెల్లించాల్సిన అవసరం లేదని గ్యాస్ కంపెనీలు స్పష్టం చేస్తున్నాయి. నిబంధనల ప్రకారం గ్యాస్ ఏజెన్సీలు వినియోగదారుల ఇంటి వద్దకే సిలిండర్‌ను ఉచితంగా డెలివరీ చేయాలి. బుకింగ్ సమయంలో నిర్ణయించిన ధర మాత్రమే చెల్లించాలి. వాస్తవానికి సిలిండర్ ధరలోనే హోమ్ డెలివరి ఛార్జీలు కూడా కలిసి ఉంటాయి. పౌరసరఫరాల శాఖ నిబంధనల ప్రకారం... గ్యాస్ ఏజెన్సి నుంచి 5 కిలోమీటర్లలోపు డెలివరి పూర్తిగా ఉచితం. 5 నుండి 30 కిలోమీటర్లలోపు ఉంటే కేవలం రూ. 10 మాత్రమే రవాణా ఛార్జీగా వసూలు చేయాలి. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి ఇందుకుభిన్నంగా ఉంది. కిలోమీటరు దూరంలో ఉన్న కాలనీల్లో కూడా అదనంగా రూ. 25 వసూలు చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రూ.50కి తక్కువ కాకుండా వసూలు చేస్తున్నారు. ఓ వైపు బిల్లులపై ఉన్న ధరకు అదనంగా చెల్లించవద్దని ఏజెన్సీల ప్రతినిధులు చెబుతున్నా సిలిండర్ ఇంటికి తీసుకొచ్చే సిబ్బంది రూ.20 నుంచి రూ. 50 వరకూ ప్రాంతాన్ని బట్టి వసూలు చేస్తున్నారంటే దోపిడీ ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు కోటి యాభైలక్షల ఎల్‌పిజి కనెక్షన్లు ఉన్నాయి. రాష్ట్రంలో రోజుకు 2.5లక్షల సిలిండర్ల అవసరం ఉం టుంది. సగటున ఒక్కో సిలిండర్‌పై రూ. 20 అదనంగా వసూలు చేసినా రోజుకు ఏకంగా రూ. 50 లక్షలు వినియోగదారుల జేబుల నుండి తరలిపోతున్నాయి. అయితే గ్యాస్ కంపెనీలు ఇచ్చే రవాణా ఛార్జీలను ఏజెన్సీలే వాడుకుంటున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తమకు కంపెనీలు జీతా లు ఇవ్వడం లేదని, వినియోగదారుల నుంచే వసూలు చేసుకోమంటున్నారని కొందరు డెలివరీ బాయ్స్ బాహాటంగానే చెబుతున్నారు. ఇదేంటని ప్రశ్నించిన వినియోగదారులపై సిబ్బంది దురుసుగా ప్రవర్తించడం, ఇంటికి తాళం వేసి ఉంది అనే సాకు చూపించి సిలిండర్ వెనక్కి తీసుకెళ్లడం వంటి చర్యలకు పాల్పడుతున్నారు. ఇప్పటికైనా పౌరసరఫరాలశాఖ అధికారులు స్పందించి గ్యాస్ ఏజెన్సీలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎల్‌పిజి వినియోగదారులు కోరుతున్నారు.

## ప్రధాని మోడీ పర్యటనతో రాష్ట్రానికి అభివృద్ధి పండగ

### బిజెపి రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి ఎన్‌వి. సుభాష్

**హైదరాబాద్, మే 3, ప్రభాతవార్త:** ప్రధాని నరేంద్ర మోదీ తెలంగాణ పర్యటన రాష్ట్రానికి అభివృద్ధి పండుగ అని బిజెపి తెలంగాణ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిది ఎన్‌వి సుభాష్ పేర్కొన్నారు. మూడోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటిసారి తెలంగాణకు వస్తున్నారని పేర్కొన్నారు. ప్రధాని రాష్ట్రానికి వస్తున్నారంటే వేల కోట్ల అభివృద్ధిని మూటగట్టుకొని వస్తారని చెప్పారు. ఈ నెల 10న రాష్ట్ర పర్యటనలో దాదాపు రూ. 7,823 కోట్ల విలువైన ప్రాజెక్టులకు ప్రధాని శ్రీకారం చుట్టబోతున్నారని వివరించారు. ఈ విషయమై ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రధాని మోది పర్యటన తెలంగాణను దేశంలోనే అగ్రగామిగా నిలిపే మరో పెద్ద అడుగు అని పేర్కొన్నారు. కాకతీయుల కళా వైభవానికి నిలయమైన వరంగల్ గడ్డ, ఇప్పుడు టెక్స్‌టైల్ పవర్‌హౌస్‌గా మారబోతోందన్నారు. రూ. 1,695 కోట్లతో ఏర్పాటు చేస్తున్న పీఎం మిత్ర కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్‌ను జాతికి అంకితం చేస్తున్నారని తెలిపారు. బీబీనగర్ ఎయిమ్స్ రూపంలో రూ.2,000 కోట్లతో ఒక అద్భుతమైన దవాఖానాను కేంద్రం కట్టిందని చెప్పారు. మోదీ సర్కార్ హయాంలో తెలంగాణ రైల్వేలకు వేలకోట్ల నిధులు వచ్చాయన్నారు. ఏ రంగం చూసినా కేంద్రం తెలంగాణపై ప్రత్యేక ఫోకస్ పెట్టిందన్నారు. జహీరాబాద్ స్మార్ట్ సిటీతో మరో వేలాదిమందికి ఉపాధి అవకాశాలు రాబోతున్నాయని వివరించారు.

## ప్రజాస్వామ్యంలో పత్రికా స్వేచ్ఛ కీలకం

### పాత్రికేయులకు శుభాకాంక్షలు తెలిపిన సిఎం రేవంత్‌రెడ్డి



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మే3:** ప్రపంచ పత్రికా స్వేచ్ఛా దినో త్సవం సందర్భంగా పాత్రికేయ సోదర, సోదరీమణులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ప్రజాస్వామ్యంలో పత్రికా స్వేచ్ఛ, సత్యాన్వేషణ, సమాజహితానికి పాత్రికేయుల పాత్ర అత్యంత కీలకమని ఒక సందేశంలో పేర్కొన్నారు. నిబద్ధత, ధైర్యం, బాధ్యతతో పనిచేసే పాత్రికేయులు సమాజానికి మార్గదర్శకులుగా నిలుస్తున్నారని ప్రశంసి స్తున్నారు. ప్రజల గొంతుకగా నిలిచి, సమాజ పురోగతికి తోడ్పడుతున్న పత్రికా రంగానికి ముఖ్య మంత్రి అభినందనలు తెలియజేశారు.

## కామారెడ్డిలో భారీ అగ్ని ప్రమాదం: 20 దుకాణాలు దగ్ధం

**హైదరాబాద్, మే 3, ప్రభాతవార్త:** కామారెడ్డి పట్టణంలో శనివారం అర్థరాత్రి సమయంలో సంభ వించిన భారీ అగ్ని ప్రమాదంలో 20 దుకాణాలు పూర్తిగా కాలిపోయాయి. పాత బస్టాండ్ మలుపు వద్ద గల దుకాణలలో అర్ధ రాత్రి వేళ ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో దుకాణాలన్నీ నిమిషాల్లో మంటల్లో చిక్కుకున్నాయి. ఈ విషయం తెలిసిన వెంటనే పోలీసులు, అగ్నిమాపక అధికారులు హుటాహుటిన రంగంలో దిగి అగ్నిమాపక యంత్రాలతో మంటలను ఆర్పివేశారు. అయితే దుకాణాల లోని బట్టలతో పాటు ఇతర వస్తువులన్నీ మం టలకు ఆహుతయ్యాయి.

దుకాణాల సమీపంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వుండడం, దాని పక్కనే చెత్త వేయడంతో అక్కడ మంటలు అంటుకుని ఇది పెద్దదిగా మారి మొదట ట్రాన్స్‌ఫార్మర్, ఆ తరువాత దుకాణాలకు వ్యాపించి వుంటాయని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ ప్రమాదం వల్ల 50 లక్షల రూపాయలకు పైగా నష్టం వాటిల్లిందని పోలీసులు భావిస్తున్నారు. ఘటనా స్థలాన్ని మున్సిపల్ ఛైర్ పర్సన్ ఇప్ప ఉమారాణితో పాటు ఇతర అధికారులు సందర్శించారు. బాధితులను ఆమె ఓదార్చారు. ఉన్నతాధికారులతో మాట్లాడి దుకాణాల నిర్వాహకులకు కొంత ఆర్థిక సహాయం అందేలా చూస్తానని ఆమె హామీ ఇచ్చారు.

## తెలంగాణలోనూ బిజెపి జైత్రయాత్ర

### బిజెపి శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

**హైదరాబాద్, మే 3, ప్రభాతవార్త:** బిజెపి జైత్రయాత్రను తెలంగాణలోనూ విస్తరించి రాష్ట్ర ప్రజలకు సుపరిపాలన అందించడమే ప్రధాని మోది ఆశయమని ఆ పార్టి శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. కేంద్రంలో మూడోసారి అధికారి చేపట్టిన తరువాత ప్రధాని మోది తొలిసారిగా తెలంగాణకు వస్తున్నారని వెల్లడించారు. ఈ విషయమై ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఢిల్లీ, బీహార్, హర్యానా, ఒరిస్సా తదితర రాష్ట్రాల్లో ఇప్పటికే బీజేపీ ప్రభుత్వాలు ఉన్నాయని, అస్సాం, పశ్చిమ బెంగాల్ ఎన్నికల ఫలితాల్లో కూడా కమలం విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అదే క్రమంలో తెలంగాణలో కూడా బీజేపీ ప్రభుత్వం రావాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రజలు కూడా మార్పును కోరుకుంటున్నారని వెల్లడించారు. 12 ఏళ్ల మోది పాలనలో తెలంగాణ అభివృద్ధికి రూ. 12 లక్షల కోట్లు కేటాయించిందని, కాంగ్రెస్ పార్టీ మాదిరిగా కేవలం ధనవంతులకే ప్రాధాన్యత ఇచ్చే హైబ్రిడ్ మోడల్ విధానం బిజెపిది కాదని తేల్చి చెప్పారు. ఒకప్పుడు బిజెపి ఉనికినే ప్రశ్నించిన పార్టీలు నేడు పార్లమెంటు ఎన్నికల్లో సున్నా సీట్లకు పరిమితమయ్యాయని ఎద్దేవా చేశారు. తెలంగాణలో కమలం ఎవరితోను పొత్తు పెట్టుకోదని, ఒంటరిగానే పోటీ చేసి అధికారంలోకి వస్తుందని స్పష్టం చేశారు. రాష్ట్ర పర్యటనలో ప్రధాని దాదాపు రూ. 7500 కోట్ల విలువైన అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారని వివరించారు. ఈనెల 10న జరిగే ప్రధాని మోది సభకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలి రావాలని పిలుపునిచ్చారు.

# బంగారం దుకాణాలకు ఏదీ భద్రత?

### కొన్ని కేసుల్లో నేరగాళ్లు పట్టుబడినా లభించని నగలు, నగదు

### దుండగులు సిబ్బందిపై కాల్పులు జరుపుతున్నా కళ్లు తెరవని పోలీసులు

**హైదరాబాద్, మే 3, ప్రభాతవార్త:** కరీంనగర్‌లోని పిఎంజి నగల దుకాణంలో దోపిడి దొంగలు కాల్పులు జరిపి నగలను లూటీ చేసిన ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపింది. ఈ ఘటనలో దుకాణంలో పనిచేస్తున్న ముగ్గురు గాయపడగా వీరి పరిస్థితి నిలకడగా వుంది. రాష్ట్రంలో ఇటీవల కాలంలో నగల దుకాణాలను దోపిడి దొంగలు టార్గెట్ చేయడం, సిబ్బందిపై కాల్పులు జరపడం వరుసగా జరుగుతున్నా దుకాణాల నిర్వాహకులు, పోలీసులు కళ్లు తెరవడం లేదు. గత ఏడాది శివార్లలోని చందానగర్‌లో గల ఖజానా జువెల్లరీ దుకాణంలో బారీ దోపిడి జరగగా అంతకు ముందు సూర్యాపేట్, సికింద్రాబాద్‌లోని మహంకాళి, మేడ్చల్, నాగోల్‌లలో కొన్ని నగల దుకాణాలు లూటీకి గురయ్యాయి. ఈ దోపిడీ లకు పాల్పడ్డ నేరగాళ్లు పట్టుబడినా పూర్తిగా



నగలు లభించలేదు. నగల దుకాణాలపై వరుసగా జరుగుతున్న దోపిడీలను చూస్తుంటే వీటికి భద్ర త గుండు సున్నాగా చెప్పాలి. దేశ వ్యాప్తంగా గడచిన కొన్నేళ్లుగా నగల వ్యాపారం భారీగా పెరగడం తెలిసిందే. దేశ జిడిపిలో నగల వ్యాపారం షేర్ 1.3 శాతంగా వుందని గణాంకాలు చెబుతున్నాయి. గత పదేళ్లుగా బంగారం ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో వీటి వ్యాపారం కూడా 35 శాతం పెరిగాయి. ఇక తె లంగాణ వరకు వస్తే రాష్ట్రంలో 55 వేలకు పైగా నగల దుకాణాలు వుండగా ఇందులో హైదరాబాద్ సహా శివారు ప్రాంతాలు, పట్టణ ప్రాంతాల లో పది వేల వరకు నగల దుకాణాలున్నాయి. ఇందులో వెయ్యికి పైగా పెద్ద దుకాణాలు గ్రేటర్ పరిధిలోనే వున్నాయని పోలీసులు చెబుతున్నాంప. నగల దుకాణాలలో పనిచేసే కార్మికులు, ఇతర ఉద్యోగులు పది లక్షల మంది వరకు వున్నారు. ఈ విషయం ఇలావుంటే నగల దుకాణాలలో వున్న భద్రత అంతా డొల్లేనని అనేకసార్లు రూఢీ అయ్యింది. రాత్రి వేళల్లో గోడలు బద్దలు కొట్టి, తాళాలు విరగొట్టి దోపిడీలకు పాల్పడే దొంగలు ఇటీవల కాలంలో పెరిగిపోయారు. ఇందుకు గల కారణాలను పరిశీలిస్తే చాలా వరకు నగల దుకాణాలలో సెక్యూరిటీ గార్డులు వుండక పోవడం. సమీప పోలీసు స్టేషన్లకు అనుసంధానం చేసే అలారం వ్యవస్థ లేక పోవడం, ఇక పగటి పూట దోపిడీ దొంగలు తుపాకులు ధరించి కాల్పులు జరుపుతూ అడ్డువచ్చిన వారిని కాల్చివేసి మరీ నగలను దోచుకుంటున్న ఘటనలు ఇటీవల కాలంలో రాష్ట్రంలో ఎక్కువయ్యాయి. చందానగర్, మహంకాళి, నాగోల్, మేడ్చల్ ఘటనలు మరువక ముందే ఆదివారం నాడు కరీంనగర్‌లో పట్టపగలు మరో నగల దుకాణంలో దోపిడి జరిగింది. ఇక బడా చోరీల వరకు వస్తే పంజా గుట్ట అలుకాస్, అబిడ్స్‌లోని నాలుగు దుకాణాలో జరి గిన ఘటనలు తీవ్రమైన నేరాలుగా చెప్పాలి. అబిడ్స్ లోని ఓ బడా నగల దుకాణంలో 17 ఏళ్ల క్రితం సాయం త్రం వేళ ముంబాయికి చెందిన ముఠా తుపాకులతో వచ్చి సిబ్బందిని ఒకచోట బంధిం చి నగలను లూటీ చేయడం అతి పెద్ద ఘటన. ఈ ఘటనలు రాష్ట్రంలో నగల దుకాణాలకు భద్రత లేదని తేటతెల్లం చేస్తు న్నాయి. ఇక నగల దుకాణాలలో ఎప్పుడు చోరీ లేదా దోపిడి జరిగినా లక్షల రూపాయల నుంచి కోట్లాది రూ పాయల నగలు లూటీ అవుతున్నాయి.

ఇక పోలీసులకు పట్టుబడుతున్న సందర్భాలలో కొన్నింటిలోనే పూర్తిగా దొరుకుతుండగా చాలావాటిలో 30 శాతం కూడా రికవరీ జరగడం లేదు. నేరగాళ్లు చోరీ సొత్తుతో జల్సా లు చేస్తున్నారు. కాగా నగల దుకాణాల వద్ద 24 గంటల పాటు సాయుధ గార్డులు వుండాలని, ఇక్కడి సిసి కెమె రాలు, సమీపపోలీసు స్టేషన్లకు అనుసంధానం అయ్యేలా అలారంవ్యవస్థలు వుండాలని పోలీసులు చెబుతున్నారు.

## కేసీఆర్‌తో కేటీఆర్, హరీశ్‌రావు భేటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మే3:** తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో మాజీ మంత్రులు, ప్రస్తుత ఎమ్మెల్యేలు హరీశ్ రావు, కేటీఆర్ భేటీ అయ్యారు. ఎర్రవల్లిలోని కేసీఆర్ వ్యవసాయ క్షేత్రానికి చేరుకున్న వారిద్దరూ ఆయనతో సమావేశమయ్యారు. ఈనెల 6న వరంగల్‌లో రైతు సభ నేపథ్యంలో వీరి తాజా భేటీకి ప్రాధాన్యం సంతరించుకుంది. సభలో ప్రసంగించాల్సిన పలు అంశాలపై ముగ్గురు నేతలూ చర్చిస్తున్నట్లు సమాచారం. ముఖ్యంగా రైతులకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలు, ధాన్యం కొనుగోళ్లలో వైఫల్యం, రైతులు పడుతున్న ఇబ్బందులపై రైతు సభ వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎండగట్టేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్లు తెలుస్తోంది. అలాగే ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వ వైఫల్యాన్ని నిరసిస్తూ వరంగల్ సభ తర్వాత తీసుకోవాల్సిన చర్యలపైనా చర్చిస్తున్నట్లు సమాచారం. ముఖ్యంగా జిల్లాల వారీగా కలెక్టరేట్ల ముట్టడి, రహదారుల దిగ్బంధం అంశాలపై బీఆర్ఎస్ అగ్ర నేతలు కీలక చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది.

వార్త

బలియమైన విశ్వాసాలకు, నైతిక సూత్రాలకు కట్టుబడిన వారు ఏ పార్టీలో ఉన్నా వారికి ఆ పార్టీకి కూడా క్షేమం కలగదు.

న- అండర్సన్

# చండ్ర నిప్పులు!

ఈ సారి ముందస్తు వానల కబురు మనసును తేలిక చేస్తుంటే, అదే సమయానికి నడి నెత్తి మీద ఎండవేడిమి వడదెబ్బ రూపంలో మొట్టికాయలు వేయడం కాకతాళీయమే కావచ్చు. తెలుగురాష్ట్రాల ప్రజలు ఎండ,వానలతో విచిత్ర అనుభవాలు ఎదుర్కొంటున్నారు. ఒక తెలుగు రాష్ట్రం తెలంగాణలో ఎండ తీవ్రత తట్టుకోలేని విధంగా ఉంది. కొన్ని జిల్లాల్లో ఎండ చండ్ర నిప్పులు కురుస్తోంది. ఎండలు నిప్పులు కొలిమిని తలపిస్తున్నాయి. పగలు కానీ రాత్రి కానీ పిల్లలు ఇళ్ళల్లో మగ్గిపోతున్నారు .భద్రాద్రి జిల్లాలో అకాల వర్షాలతో రైతాంగం విస్తుపోతోంది. శని వారం సాయంత్రం వడగండ్ల వాన,ఈదురు గాలులతో రోడ్ల పక్కన చెట్లన్నీ నేల వాలాయి. ఆదివారం ఆంధ్ర ప్రదేశ్ రాజమండ్రిలో ఎడతెరిపిలేని వర్షంతో గోదావరి జిల్లా వాసులు తడిసి ముద్దయ్యారు. పిడుగులు సంగతి మామూలే!మరో నాలుగు రోజులు ఇదే మాదిరి వాతావరణం చూస్తామని హెచ్చరికలు ఉన్నాయి. నిజామాబాద్ జిల్లా మెండోరాలో గతంలో ఎన్నడూ లేని విధంగా విభిన్నరీతిలో 46 డిగ్రీ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అటుఏటా అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు చేసుకునే పల్నాడుజిల్లా రెంటచింతల 45 డిగ్రీల నమోదుతో ఉష్ణోగ్రతలో కాస్తవెనకబడింది.ప్రతి రోజు సాయంత్రం వేళల్లో ఈ ప్రాంతంలో 46, 47 డిగ్రీల ఉష్ణోగ్రత ఉంటుంది, కనుక మధ్యాహ్నాం 12గంటల నుంచి నాలుగు గంటల వరకుబయటకి కదల రాదన్న ఆంక్షలున్నాయి. శనివారం తెలంగాణ రాష్ట్రంలో 12 జిల్లాలలో సూరీడు నిప్పులు కక్కుతూ జనాన్ని ఉక్కపోతకు గురిచేశాడు. రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో వడదెబ్బకు గురై నలుగురు మృతి చెందారు. వారిలో ఇద్దరు రైతులు. వచ్చే రెండు రోజులు పాటు తెలంగాణలో గరిష్ట ఉష్ణోగ్రతలు తప్పవని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరిస్తోంది. ఏదైనా కాసింత ఉపశమనం పొందాలన్నా ఆరవ తేదీ తర్వాతనే. ఆ తర్వాత మాత్రమే రెండు నుంచి నాలుగు డిగ్రీల ఉష్ణోగ్రతలకు తగ్గుతుందని సూచన. ఇలాంటి పరిస్థితుల్లో ఇంటి నుంచి బయటికి వెళ్తే ఇబ్బందులు తప్పవని అందుకే అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు చేస్తోంది. భవన నిర్మాణా కార్మికులు, అసంఘటిత కార్మికులు, ఉపాధి కార్మికులు అత్యధిక ఉష్ణోగ్రతల మధ్య ఎండల్లో పని చేస్తూ ఆపసోపాలు పడుతున్నారు. మొన్నో రోజు హైదరాబాద్‌లోవాషింగ్ మిషన్‌పేలిన సంఘటన, నిన్న తూర్పు ఢిల్లీలో ఎసి యూనిట్‌పేలి ఒక నివాస భవనంలో 9మంది చావుకు కారణమైనదుర్ఘట. కారణం బయటి వాతావరణంలో అత్యధిక వేడిమివల్లనే జరిగింది. ఈ స్థాయి వేడిమికి జంతుజాలానికి, ప్రత్యేకించి పక్షులకు ప్రమాదమే. ఇప్పటికేచాలా పక్షులు నేల రాలిన సంఘటనలు నమోదయ్యాయి. కొన్ని తూర్పు తీరప్రాంతాల్లో సాధారణంగా కన్నా ఎక్కువరోజులు వడగాల్పులు వీచే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. ఇదంతా ఎల్‌నినో ఎఫెక్టే కారణం. కాగా హీట్ ఐలాండ్ ఎఫెక్ట్ పెరగడమనేది పట్టణీకరణ వల్లే కావచ్చు. కానీ ఉష్ణోగ్రతలు పెరిగినప్పుడు దానికి తగ్గ ఉపశమనాలు పాటించకపోతే అనారోగ్యంపాలవుతామని డాక్టర్లు సైతంహెచ్చరిస్తున్నారు. ప్రభుత్వాలు హీట్ వేవ్ యాక్షన్‌ప్లాన్‌లను విడుదలచేసి వేడిమి ఉప శమన ద్రవాలు, మజ్జిగ, మంచినీళ్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచింది.కానీ వడగాలులు ఎవరిని ఎప్పుడు ఎలా చుట్టుముడతాయో చెప్పలేం కనుక ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాల్సిందే! వేసవిలో ఎండతీవ్రత 45 డిగ్రీల సెల్సియస్ దాటితే సమస్యలు పెరుగుతున్నాయన్నమాటే. ఎండల ధాటి 45డిగ్రీల స్థాయికి చేరుకుంటే, ప్రమాద స్థాయిమరింతగా పెరుగుతుంది. ఎండవేడిమితో త్వరగా అలసట, నీరసం ఆవహించి, అతిసారం,వాంతులు తల తిరగడం వంటి అనారోగ్య లక్షణాలు వెంటాడతాయి. ఉష్ణో గ్రతలు 45డిగ్రీలు దాటినట్లయితే, వడదెబ్బ సోకే అవకాశాలు ఎక్కువ.ఈ ఉష్ణోగ్రతలు ఒక్కోసారి ప్రాణాపాయానికి కూడా దారితీయవచ్చు.అందుకే ముందు జాగ్రత్తలు అవసరం. గడచిన పదేళ్లలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో సగటు గరిష్ఠ ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల కంటే ఎక్కువగానే నమోదయ్యాయి. భారత వాతావరణ శాఖ వివరాల మేరకు ఆంధ్రప్రదేశ్లో వేసవి సగటు గరిష్ఠ ఉష్ణోగ్రతలు 40.5, 42.5 డిగ్రీలవరకు, తెలంగాణలో 41.5 నుంచి 43.5డిగ్రీల వరకు నమోదయ్యాయి. కానీ ఈసారి ఆ అంకెలు దాటిపోయి ప్రమాదకర పరిస్థితిలో పడ్డాయి. విజయవాడ, కర్నూలు, రామగుండం, భద్రాచలం వంటి కొన్ని ప్రాంతాల్లో వేసవి సగటు గరిష్ఠ ఉష్ణోగ్రతలు 45, 47 డిగ్రీల వరకు కూడా నమోదయ్యాయి.

ఇదిలా ఉండగా నైరుతిరుతుపవనాల రాక గురించి వాతావరణశాఖ ఓ మంచి వార్త చెప్పింది. సాధారణంగా వచ్చే సమయం కన్నా ముందుగానే నైరుతి రుతుపవనాలు భారత్‌ను పలకరిస్తాయని పేర్కొంది. ఈనెల 14,15 తేదీలలో నైరుతి రుతుపవనాలు అండమాన్‌కి వస్తున్నాయి. ఈ సందర్భంగా పలుప్రాంతాల్లో సాధారణంగా అధిక స్థాయిలో వడగాలులు వీస్తాయి. మరికొన్ని ప్రాంతాల్లో అతిఎక్కువ వర్షపాతం నమోదవుతుందని వెల్లడిస్తోంది. గుజరాత్‌లోని సౌరాష్ట్ర, మహారాష్ట్ర, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరఖండ్‌లోని దక్షిణ ప్రాంతాలు, బీహార్, ఉత్తరప్రదేశ్, తమిళనాడు, ఒడిస్సా సహా కోస్తా తీరరాష్ట్రాల్లో ఎక్కువ స్థాయిలో వడగాలులు వీస్తాయి.దేశంలో రాత్రిపూట సాధారణంగా ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదు కావచ్చని ఐఎండి డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ మహాపాత్ర వివరించారు. మేనెలలో సాధారణ వర్షపాతంకంటే 110శాతం ఎక్కువగా ఉండచ్చునని అంచనా.వర్షాలుఉన్నాయని చెప్పినా వేడిమిలో ఊరట ఉండబోదు. పైగా పగటి ఉష్ణోగ్రత ఎలా ఉన్నా సాయంత్రం ఉష్ణోగ్రత మాత్రం అధికంగానే ఉంటాయని ఐఎండి తెలియ చేస్తోంది.



మీరు సాహసంతో పనిని చేపట్టలేకపోతే, మీరు ఓటమికి గురికానేకారు. కాని మీరు జీవితంలో ఏది సాధించలేకపోతారు.

వినోబా భావే



ఒకరు మరొకరికి హాని చేస్తుంటే చూసి నవ్వడం చాలా తేలిక. అదే హాని తనకు జరిగితే భరించటం చాలా కష్టం.

స్వామి వివేకానంద

# అధిక ఉష్ణంతో మనుగడకు ముప్పు!

**ఎల్‌నినో ప్రభావంతో ఋతుపవనాలు ఆలస్యమవుతాయి. దీనివల్ల ఎండలు సాధారణం కంటే ఎక్కువకాలం కొనసాగుతాయి. వర్షపాతం తగ్గిపోవడం లేదా ఆలస్యమవడం వల్ల రైతులు విత్తనాలు వేయడంలో ఇబ్బందులు పడతారు. విత్తనాలు ఆలస్యమైతే పంటల పెరుగుదల ప్రభావితం అవుతుంది. దిగుబడులు తగ్గిపోవడం వల్ల రైతుల ఆదాయం పడిపోతుంది. ఇది వ్యవసాయ రంగానికి మాత్రమే కాదు, దేశ ఆర్థిక వ్యవస్థను కూడా దెబ్బతీస్తుంది. నీతి ఆయోగ్ నివేదిక ప్రకారం దేశంలో సుమారు 60 కోట్ల మంది నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారు. ఒక్క డిగ్రీ ఉష్ణోగ్రత పెరిగినా భూగర్భ జలాలపై తీవ్ర ప్రభావం పడుతుంది. బావులు ఎండిపోవడం, నీటి మట్టాలు పడిపోవడం సాధారణమవుతోంది. పట్టణాల్లో నీటి సరఫరా సంక్షోభంగా మారుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో అయితే తాగునీటి కోసం కిలోమీటర్ల దూరం నడవాల్సిన పరిస్థితులు కనిపిస్తున్నాయి.**



మేకిరి దామోదర్

తెలంగాణతో పాటు దేశవ్యాప్తంగా ఎండాకాలం తీవ్రత రోజు రోజుకీ పెరుగుతోంది. గతంతో పోలిస్తే ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరగడం, ఉక్కపోత అధికమవడం ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. ముఖ్యంగా ఈసారి పగటి వేడి మాత్రమే కాదు, రాత్రి వేడి కూడా పెరగడం పరిస్థితిని మరింత క్లిష్టం చేస్తోంది. సాధారణంగా చల్లదనాన్ని ఇస్తూ శరీరానికి విశ్రాంతినిచ్చే రాత్రులు కూడా ఇప్పుడు వేడి గాలులతో నిండిపోతున్నాయి. కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 4.5 నుంచి 6.4 డిగ్రీల సెల్సియస్ వరకు అధికంగా నమోదవడం వేడి రాత్రుల తీవ్రతను సూచిస్తోంది. వాతావరణ మార్పులు, పట్టణీకరణ, గ్రీన్‌హౌస్ వాయువుల పెరుగుదలకలిసి ఈ పరిస్థితిని తీవ్రమయ్యేలా చేస్తున్నాయి. ఎల్‌నినో ప్రభావం కారణంగా ఈ ఏడాది ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకా శముందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. పిడుగులు, నీటి ఎద్దడి, వ్యవసాయ నష్టాలు వంటి సమస్యలు పెరిగే ప్రమాదం ఉంది. 2023లో దేశవ్యాప్తంగా పిడుగుల వల్ల 2,560 మంది ప్రాణాలు కోల్పోవడం పరిస్థితి తీవ్రతను స్పష్టంగా తెలియజేస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో 99 మంది, తెలంగాణలో 47 మంది మరణించడం అప్రమత్తత ఎంత అవసరమో చెబుతోంది. ఎల్‌నినో ప్రభావంతో ఋతుపవ నాలు ఆలస్యమవుతాయి. దీనివల్ల ఎండలు సాధారణం కంటే ఎక్కువకాలం కొనసాగుతాయి. వర్షపాతం తగ్గిపోవ డం లేదా ఆలస్యమవడం వల్ల రైతులు విత్తనాలు వేయడం లో ఇబ్బందులు పడతారు. విత్తనాలు ఆలస్యమైతే పంటల పెరుగుదల ప్రభావితం అవుతుంది. దిగుబడులు తగ్గిపోవడం వల్ల రైతుల ఆదాయం పడిపోతుంది. ఇది వ్యవసాయ రంగానికి మాత్రమే కాదు, దేశ ఆర్థిక వ్యవస్థను కూడా దెబ్బతీస్తుంది. నీతి ఆయోగ్ నివేదిక ప్రకారం దేశంలో సుమారు 60 కోట్ల మంది నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారు. ఒక్క డిగ్రీ ఉష్ణోగ్రత పెరిగినా భూగర్భ జలాలపై తీవ్ర ప్రభావం పడుతుంది. బావులు ఎండిపోవడం, నీటి మట్టాలు పడిపోవడం సాధారణమవుతోంది. పట్టణాల్లో నీటి సరఫరా సంక్షోభంగా మారుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో అయితే తాగునీటి కోసం కిలోమీటర్ల దూరం నడవాల్సిన పరిస్థితులు కనిపిస్తున్నాయి. వాతావరణ మార్పులు జీవ వైవిధ్యంపై కూడా తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. పశ్చిమ కనుమలు, హిమాలయాలు, సుందర్బన్ల వంటి ప్రాంతాల్లో అనేక జాతులు అంతరించిపోతున్నాయి. అడవుల్లో అగ్ని ప్రమాదాలు పెరుగుతున్నాయి. ఇవి ప్రకృతి సమతౌల్యాన్ని దెబ్బతీస్తున్నాయి. ఇక వ్యవసాయ దిగుబడుల విషయంలో పరిస్థితి మరింత ఆందోళనకరం. పరిశోధనల ప్రకారం వరి



దిగుబడులు 2050 నాటికి 20శాతం, 2080 నాటికి 47శాతం వరకు తగ్గే అవకాశం ఉంది. గోధుమ దిగుబడులు కూడా19 శాతం నుంచి 40 శాతంవరకు పడిపోవచ్చు. దీని వల్ల కోట్లాది ప్రజలు ఆహార భద్రత సమస్యను ఎదుర్కోవాల్సి వస్తుంది. ధరలు పెరగడం, సరఫరా లోపాలు వంటి సమస్యలు మరింత తీవ్రమవుతాయి. అధిక ఉష్ణోగ్రతలు మానవ ఆరోగ్యంపై తీవ్రమైన ప్రభావం చూపుతున్నాయి. ప్రతి డిగ్రీ ఉష్ణోగ్రత పెరుగుదలతో వడదెబ్బ ముప్పు గణనీయంగా పెరుగుతోంది. ముఖ్యంగా చిన్నా రులు, వృద్ధులు, గర్భిణీలు, శారీరక శ్రమ చేసే కార్మికులు ఎక్కువగా ప్రభావితమవుతున్నారు. పసిపిల్లల్లో డీహైడ్రేషన్ సమస్యలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. శరీరంలో నీరు తగ్గిపోవడం వల్ల సోడియం స్థాయిలు పెరిగి ఫిట్స్ వచ్చే ప్రమాదం ఉంది. పెద్దల్లో తలనొప్పి, వాంతులు, అలసట, అధిక చెమటలు, కొన్నిసార్లు చెమటలు రాకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఇవి వడదెబ్బ సంకేతాలుగా పరిగ ణించాలి. మధుమేహం, రక్తపోటు వంటి దీర్ఘకాలిక వ్యాధు లు ఉన్నవారికి వేడి మరింత ప్రమాదకరం. శరీరం వేడిని తట్టుకోలేకపోతే అపస్మారక స్థితి కూడా రావచ్చు. కాబట్టి లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించడం అవసరం. ఈ పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు చాలా కీలకం. రోజుకు కనీసం 3 నుంచి 4 లీటర్ల నీరు తాగాలి. నిమ్మరసం, ఉప్పు, చక్కెర కలిపిన ద్రావణాలు తీసుకోవడం ద్వారా శరీరంలో ఎలక్ట్రోలైట్ సమ తౌల్యాన్ని కాపాడుకోవచ్చు. పసిపిల్లలకు తరచూ తల్లిపాలు ఇవ్వాలి. ఎండ తీవ్రంగా ఉన్న సమయంలో బయటకు వెళ్లకుండా ఉండాలి. ఇటీవల వేడి రాత్రులు కూడా పెద్ద సమస్యగా మారాయి. పట్టణాల్లో అర్బన్ హీట్ ఐలాండ్ ప్రభావం వల్ల రాత్రివేళ కూడా వేడి తగ్గడం లేదు. తారు రోడ్లు, కాంక్రీట్ భవనాలు పగటిపూట వేడిని నిల్వ చేసి రాత్రివేళ విడుదల చేస్తాయి. గాలి ప్రసరణకు అడ్డంకులు ఏర్పడటంతో వేడి నేల దగ్గరే నిలిచిపోతుంది. ఈ సమస్య ను తగ్గించేందుకు చెట్ల పెంపకం చాలా అవసరం. శీతల పై కప్పులు, ప్రతిఫలించే నిర్మాణ పదార్థాలు, గాలి ప్రసరణకు అనుకూల నగర ప్రణాళికలు అమలు చేయాలి. ఇవి రాత్రి వేడిని తగ్గించడంలో సహాయపడతాయి. ఎండల తీవ్రత రోజురోజుకీ పెరుగుతున్న ఈ సమయంలో ప్రభు త్వం, ప్రజలు కలిసి బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. వాతా వరణ మార్పులను అంచనా వేసి ముందస్తు చర్యలు తీసు కోవాలి. కార్బన్ ఉద్గారాలను తగ్గించడం, పునరుత్పా దక ఇంధన వనరులను ప్రోత్సహించడం, నీటి సంరక్షణపై దృష్టి సారించడం అత్యవసరం. ప్రజలు వ్యక్తిగత స్థాయిలో కూడా జాగ్రత్తలు పాటించాలి. ఎవరి ప్రాణాలు వారి చేతుల్లోనే ఉన్నట్లు తగినంత నీరు తాగడం, ఎండలో బయటకు వెళ్లకుండా ఉండడం, ఆరోగ్య సమస్య లను నిర్లక్ష్యం చేయకపోవడం ద్వారా ప్రాణాలను కాపాడు కోవచ్చు. ఈ వేసవిలో నిర్ణీత ఉష్ణోగ్రత దాటాక పెరిగిన ప్రతి డిగ్రీ ఉష్ణోగ్రత ప్రాణాలకు పరీక్షగా మారుతున్న వేళ.. అప్రమత్తతే మనకు కవచం. జాగ్రత్తలే జీవరక్షణ మార్గం.

# ప్రతిభకు బాటలు ప్రభుత్వ బడులు

ఎల్లబోయిన వెంకటేశ్వర్లు

ఇటీవలి కాలంలో విద్యా రంగంలో గమనించదగిన మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ముఖ్యంగా రెండు తెలుగు రాష్ట్రాల్లో విడుదలైన 10వ తరగతి ఫలితాలు ఒక కొత్త దిశను సూచిస్తున్నాయి. చాలా కాలంగా కార్పొరేట్ పాఠశాలలే నాణ్యమైన విద్యకు ప్రతీకగా భావించబడుతున్నప్పటికీ, ఈసారి ప్రభుత్వ పాఠశాలలు సాధించిన ఫలితాలు ఆ భావనను సవాల్ చేస్తున్నాయి. 600 మార్కులకు 580కి పైగా స్కోర్లు సాధించిన విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల నుంచే రావడం, ఈ మార్పుకు స్పష్టమైన సంకేతం. గతంలో ప్రభుత్వ పాఠశాలలు అనగానే తల్లిదండ్రుల్లో అనుమానం ఉండేది. సదుపాయాల కొరత, బోధనలో నాణ్యత లోపం, ఉపాధ్యాయుల నిర్లక్ష్యం వంటి విమర్శలు వినిపించేవి. అయితే, ఇటీవల ప్రభుత్వాలు తీసుకున్న సంస్కరణలు ఈ పరిస్థితిని పూర్తిగా మార్చాయి. డిజిటల్ క్లాస్‌రూమ్స్, ఇంగ్లీష్ మీడియం బోధన, పాఠ్య ప్రణాళికలో మార్పులు, ఉపాధ్యాయుల శిక్షణ ఈ అన్ని అంశాలు కలసి ప్రభుత్వ పాఠశాలల స్థాయిని పెంచాయి. ప్రత్యేకంగా చెప్పాల్సింది ఉపాధ్యాయుల పాత్ర. ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు విద్యార్థులపై వ్యక్తిగత శ్రద్ధ చూపుతూ, వారి బలహీనతలను గుర్తించి, వాటిని అధిగమించేలా మార్గనిర్దేశనం చేస్తున్నారు. ఇది కార్పొరేట్ పాఠశాలల్లో సాధ్యంకాని అంశం. అక్కడ విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉండటం వల్ల వ్యక్తిగత శ్రద్ధ తగ్గిపోతుంది. కానీ ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి విద్యార్థి అభివృద్ధి ఒకలక్ష్యంగామారింది. ఇంకా ఒక ముఖ్యమైన అంశం తల్లిదండ్రుల దృక్పథంలో వచ్చిన మార్పు. గతంలో డబ్బు పెట్టితేనే మంచి విద్య"



అనే భావన బలంగా ఉండేది. ఇప్పుడు ఆ భావన క్రమంగా కూలిపోతోంది. భారీ ఫీజులు చెల్లించడం కంటే, నాణ్యమైన బోధన, మంచి ఫలితాలు ముఖ్యమని తల్లిదండ్రులు గుర్తిస్తున్నారు. ఫలితంగా ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్ల కోసం పోటీ పెరుగుతోంది. ఇది కేవలం విద్యార్థుల విజయమే కాదు, ప్రభుత్వ విధానాల విజయమూ. ఉచిత పుస్తకాలు, యూనిఫార్ములు, మధ్యాహ్న భోజనం వంటి పథకాలు విద్యార్థుల హాజరును పెంచడంలో కీలక పాత్ర పోషించాయి. అంతేకాకుండా, మౌలిక వసతుల అభివృద్ధి క్లాస్‌రూమ్స్, టాయిలెట్స్, డిజిటల్ పరికరాలు విద్యార్థులకు మంచి వాతావరణాన్ని కల్పించాయి. అయితే ఈ విజయాన్ని నిలబెట్టుకోవడం అంతే ముఖ్యమైన సవాలు. ఫలితాలు మెరుగుపడ్డాయి కాబట్టి అక్కడే ఆగిపోవడం సరైంది కాదు. నిరంతర మెరుగుదల అవసరం.పాఠ్యప్రణాళికను కాలానుగుణంగా నవీకరించడం, ఉపాధ్యాయులకు మరింత శిక్షణ ఇవ్వడం, విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించడం ఈ అంశాలపై దృష్టి పెట్టాలి. ముఖ్యంగా, కేవలం మార్కులకే పరిమితం కాకుండా, సృజనాత్మకత, విమర్శనాత్మక ఆలోచన, సామాజిక బాధ్యత వంటి అంశాలను కూడా అభివృద్ధి చేయాలి. ఇంకా ఒక కీలక అంశం ఈ మార్పు సమాజంలో సమానత్వాన్ని బలోపేతం చేయడం. మంచి విద్య అందరికీ అందుబాటులోకి రావడం, ఆర్థిక అసమానతలను తగ్గించడంలో సహాయపడుతుంది. ఇది భవిష్యత్తులో సమాజ అభివృద్ధికి బలమైన పునాది అవుతుంది. మొత్తానికి, ప్రస్తుతం కనిపిస్తున్న మార్పులు ఒక సానుకూల సంకేతం. ప్రభుత్వ పాఠశాలలు కేవలం ప్రత్యామ్నాయం కాదు, ఇప్పుడు ఒక శక్తివంతమైన ఎంపికగా మారుతున్నాయి. ఈ దిశలో తీసుకుంటున్న చర్యలు కొనసాగితే, భవిష్యత్తులో ప్రభుత్వ విద్యా వ్యవస్థ మరింత బలపడటం ఖాయం. విద్యా రంగంలో ఈ మార్పుకేవలం ఒక ట్రెండ్ కాదు ఇది ఒక పరివర్తన. ఈ పరివర్తనను నిలబెట్టుకోవడం మన అందరి బాధ్యత.

# ప్రజావాక్కు



## జంతుబలిని నిషేధించండి

ఈనెల 5 నుండి 13 వరకు తిరుపతిలో గంగమ్మ జాతర నిర్వహించబడుతుంది.దానిఆహ్వాన కమిటీవారు ముఖ్యమంత్రి చంద్రబాబు గారిని ఆహ్వానించారు. మూఢనమ్మకాలనుప్రోత్సహించే ఇలాంటిజాతరలకు ఒక ముఖ్యమంత్రి వెళ్లడం అంటే మూఢనమ్మకాలను ప్రోత్సహించటమే అవుతుంది. కొన్ని వేలకోళ్లు చంపబడతాయి. గొర్రెలు, మేకలు కూడా వందలాదిగా చంపబడతాయి. ఆ చుట్టు ప్రక్కల మొత్తం ఆ వారమంతా రక్తం వాసన వస్తూ ఉంటది. ఇది మా ఆచారం అంటూ మొగవాళ్ళు ఆడవేషం, ఆడవాళ్ళు మగవేశం వేసుకొని,ముఖాలకు సున్నపుబొట్లు పూసుకొని, రకరకాల వేషాలేసుకుని తిరుగుతారు. సరే అది వేరే విషయం. చివరిరోజు గంగమ్మను బూతులు తిడుతూ, కొడుతూ ఆ మట్టి బొమ్మను ఉతికి ఆరేస్తారు.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

## ఉద్యోగావకాశాల కల్పన

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అమరావతి వేదికగా రూపుదిద్దుకుంటున్న అమరావతి క్వాంటం వ్యాలీ ప్రాజెక్ట్ ఒక చారిత్రాత్మక ఘట్టం. భారతదేశంలోనే మొట్టమొదటి క్వాంటం టెక్ పార్క్‌గాగుర్తింపు పొందనున్న ఈకేంద్రం, ఉద్దండరాయునిపాలెంలో ఏర్పాటు అవుతోంది. దీని ప్రధాన లక్ష్యం 133 క్యూబిట్ల క్వాంటం కంప్యూటర్ (సిస్టమ్ 2)ను నెలకొల్పడం. ఐబీఎం, టీసీఎస్ వంటి గ్లోబల్ సంస్థలసహకారంతో రూపొందుతున్న ఈ ప్రాజెక్ట్ ద్వారా పరిశోధకులు, స్టార్టప్‌లకు అత్యాధునిక సాంకేతిక వనరులు అందుబాటులోకి వస్తాయి. ఈ ప్రాజెక్ట్ వల్ల దాదాపు లక్ష ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ప్రభుత్వం అంచనా వేస్తోంది.క్వాంటం కంప్యూటింగ్,కృత్రిమ మేధస్సు క్రిప్టోగ్రఫీ వంటి రంగాలలో యువతకు శిక్షణ ఇచ్చి ప్రపంచ స్థాయినిపుణులుగా తీర్చిదిద్దుతారు.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## ఆర్థిక వ్యవస్థ అల్లకల్లోలమే!

పశ్చిమాసియా ఘర్షణ కేవలం ఆ ప్రాంత సరిహద్దులకే పరిమితం కాకుండా,ప్రపంచ ఆర్థికవ్యవస్థ గుండెకాయను తాకుతున్నాయి. ఈఘర్షణలు నేడు ప్రతిదేశపు వంటింటి బడ్జెట్‌ను,పారిశ్రామిక రంగాన్ని అతలాకుతలం చేస్తు న్నాయి.ముఖ్యంగా అంతర్జాతీయ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధిలో నెలకొన్న అనిశ్చితి, ప్రపంచ దేశాల ఇంధన భద్రతను ప్రశ్నార్థకం చేస్తోంది.

- ఎం. సి. సుదర్శన్, హైదరాబాద్

## బాధితులకు ఉపశమనం

ప్రకృతి విపత్తులు ఊహించే సమయంలోనే కాకుండా ఎప్పుడైనా సంభవించి జన జీవితం అతలాకుతలం అవుతుంది. దీనికి తోడు తుఫానుకు, అగ్ని ప్రమాదాలకు నివాస గృహాలు పోయి గూడులేక, పనులు స్తంభించి కుటుంబాల రోదనతో బాధ వర్ణనాతీతం. ప్రభుత్వ పరిహారం అందేలోపున రిజర్వ్ బ్యాంక్ ప్రభావిత ప్రాంతాల అభ్యర్థులకు వారు అడగక ముందే రుణ ఉపశమన చర్యలు అమలుచేయొచ్చునని మార్గదర్శకాలు వెలువడినవి. ఈ నిర్ణయం బాధలతో ఉన్న వారిని దయతో,బ్యాంకులు ఆదుకోవడం మానవత్వం తో తీసుకున్న ఉత్తర్వు. దీనితోపాటు బ్యాంకుల సేవలను తాత్కాలిక ప్రాంగణం నుండి చేస్తారు. ఇంటిని పునర్నిమాణం చేయుటకు బాధితులకుఎంతో ఉపశమనం కల్గించే ఈవిషయం హర్షదయకం.

- బొల్లోజు మేఘనాదం, విశాఖపట్నం

## ఎఐ అంటే భయం

అమెరికా కంటే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అంటేనే భయం చాలా పెరిగిపోతోంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న మేధావులు, తెలివైన వాళ్ళు ,మోసగాళ్లు, అగ్రవర్ణాలు ఉన్న అద్భుతమైన ప్రదేశమే అమెరికా. స్వేచ్ఛా విహంగాల పతంగం అక్కడే బాగా ఎగురుతుంది. అలాంటి ఆ స్వేచ్ఛ వాతావరణంలో నిర్భయత్వానికి చోటు చాలా తక్కువ. ఎప్పుడు ఎవడు ఏ ఆయుధంతో ఎటాక్ చేస్తాడో అనే భయం ప్రతి వాళ్లలోనూ ఉంటుంది. అలాఎటాక్ చేయడానికి, కుదిరితే చంపేయడానికి పెద్ద కారణాలేమీ ఉండవు. శత్రుత్వం, విరోధం, ద్వేషంఏమీ ఉండదు. కేవలం సరదాలగ్గరిగా బ్రతకడానికి తనకు చేతనైతే దొరికిన వాడిని చంపి డబ్బు తీసుకోవాలనే ఒక ప్రయత్నం. కానీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అంటే అలా అనిపించలేదు.

- వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

## పెరిగిన వాణిజ్య సిలిండర్ల ధర

వాణిజ్య సిలిండర్ గ్యాస్ కొరత పేరుతో హోటళ్లు, రెస్టారెంట్ల యజమానులు రేట్లు పెంచి సాధారణ మానవుడి నడ్డి విరుస్తున్నారు. గ్యాస్ సరఫరా ఎలా ఉన్న రెట్లు మాత్రం పెంచారు. ఎప్పుడైనా పరిస్థితుల దృశ్య రెట్లు పెంచడమే కానీ తగ్గించడం మాత్రం అస్సలు ఉండదు కదా. ఇలాంటిది అమాంతం రెట్లు పెంచడం అనేది ప్రభుత్వాల చేతుల్లో లేదా అధికారుల చేతిలో ఉండాలి గాని యాజమానుల ఇష్టారీత్య ఉండకూడదు. వాణిజ్య సిలిండర్ ధర పెరిగి మూడువేలకు మూడువందలకు చేరుకుంది. ఈ రేట్లు వినియోగదారుడిపై భారం మోపుతుంది.

-ఎన్. రామస్వామి, హైదరాబాద్

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి | ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

# భూదాన భూముల్లో వెలుగునీడల జంజాటం!

దిలీప్.వి

చట్టాలు, ప్రభుత్వాలు, ప్రభుత్వ అధికారులు పేదల సమస్యల పట్ల పనిచేసేటప్పుడు చూపించే ఉదాసీన నిర్లక్ష్యపు వైఖరికి భిన్నంగా న్యాయం పేర ఇవే వ్యవస్థలు పేదల మీద ఎంత వికృతంగా విరుచుకుపడి చట్టాన్ని అమలుచేస్తున్నామని చేసే ప్రకటనలు ఎంత జుగుప్సను, వ్యవస్థలపట్ల అసహ్యాన్ని కలిగిస్తాయో. ఏదో యుద్ధంలో బాంబులు పడితే చెల్లాచెదురై చెట్టుకొకరు పుట్టకొకరు అన్నట్టుగా ఉన్న ఆ ప్రాంతాన్ని చూస్తే ఎంతటివారి హృదయాలనైనా కరిగిస్తుంది. గత నెల ఫిబ్రవరి 24వ తారీఖున ఉన్నపళంగా ఏదో యుద్ధానికి వచ్చినట్టు వేల మంది పోలీసు బలగాలను వెంటపెట్టుకుని వచ్చి ఉదయం 6గంటలకే సుమారుగా 50బుల్డోజర్ల ద్వారా గంటల్లో ఇండ్లను నేలమట్టం చేసి ఈ ప్రభుత్వం ఘనకార్యం చేసినట్టు చెప్పుకుంటున్నది. అధికారులు వారేదో కబ్జాదారుల నుండి భూములను కాపాడినట్టు వారికి వారే సర్టిఫికెట్లు ఇచ్చుకున్నారు. గ్రామీణ పేదల సంఘం గత నాలుగు ఐదు దశాబ్దాలుగా వివిధ ప్రాంతాలలో ఉన్నటువంటి ప్రభుత్వ భూములను భూమిలేని నిరుపేదలకు ఇప్పించడానికి,గూడు లేని పేదలకు నివాసాలు ఏర్పాటు చేసుకోడానికి భూములివ్వాలని వివిధ రకాలుగా ఉద్యమాలు చేస్తూ పేద ప్రజలకు భూమి, నివాస స్థలాలు ఇప్పించడానికి కృషిచేస్తున్నది. ఈ క్రమంలో ఖమ్మం పట్టణం కేంద్రానికి అనుకుని ఉన్న వెలుగుమట్ల ప్రాంతంలో 147, 148, 149 సర్వే నెంబర్ల గల భూమి భూదానోద్యమ కర్త వినోబా భావే పిలుపుతో ఒకప్పటి భూస్వాములు ఇచ్చినటువంటి భూదాన భూములు ఉన్నాయని వాటిలో పట్టణంలో వివిధ రకాల పనులు చేస్తూ అద్దె ఇండ్లలో పనిచేస్తున్న పేదలకు ఇవ్వండని ఈ సంఘం ఆధ్వర్యంలో 2014 జనవరిలో దరఖాస్తులు పెట్టుకుంటే భూదాన్ బోర్డు వారు ప్రొసీడింగ్స్ ఇచ్చి లేఔట్ ఇవ్వడమైనది. ఆ ప్రొసీడింగ్స్ అమలులోకి తెచ్చి అక్కడ నివాసం ఉండటానికి భూదాన్ బోర్డు నుండి పత్రాలు పొందిన పేదలందరికీ నివాస హక్కులు ఇవ్వాలని అధికారులను ఎన్ని సార్లు వేడుకున్నప్పటికీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో సుమారుగా 400 కుటుంబాలు 2018 లో మొదటగా అక్కడ నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. అది క్రమంగా నేడు 1000కుటుంబాల నివాసాల వరకు వెళ్లింది. ఈ పేదలు చాలాసార్లు కోర్టులకు కూడా వెళ్ళడం జరిగింది. కోర్టు కూడా జోక్యం చేసుకోవద్దని చెప్పింది కానీ స్పష్టమైన తీర్పు ఇవ్వకపోవడంతో ఆ పేద ప్రజలు అక్కడే నివాసం ఉంటూ పొట్టకూటికోసం పట్టణంలో చుట్టూ ప్రాంతాలలో కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తు న్నారు. ఈ క్రమంలో ఆ ప్రజలు తమకు కనీస సౌకర్యాలు కల్పించమని, ఇండ్లు మంజూరు చేయమని పలుమార్లు ప్రభుత్వాన్ని వేడుకున్నారు. గత ప్రభుత్వం కూడా ఒకసారి వీరినీ వెళ్లగొట్టాలని చూసినప్పటికీ ఆ బాధితులు గట్టిగా నిలబడటంతో వెనక్కి తగ్గారని చెప్పారు. అంతేకానీ అక్కడి ఆ ఇండ్లలో నివసిస్తున్న ప్రజలకు అవసరమైన కనీసంమౌలిక సదుపాయాలైన మంచినీటిని, విద్యుత్తును అందించడానికి కూడా ప్రభుత్వం, ప్రభుత్వ అధికారులు ఎటువంటి చొరవ చూపకపోవడం పేద ప్రజల జీవితాల పట్ల పాలకులకు, అధికారులకు ఉండేటటువంటి నిరక్ష్యపు వైఖరికి అద్దం పడుతుంది. ఆ ప్రజలే వారు సొంతంగా నీళ్ళ ట్యాంకర్‌తో నీళ్లు తెచ్చుకోవడం, జనరేటర్ పెట్టుకుని లేదా




సోలార్ దీపాలు పెట్టుకుని అక్కడ బతుకీడుస్తున్నారు.ఐతే ఇక్కడ నివాసం ఉంటున్న ప్రజలను ఇక్కడ ఉండే అధికారం లేదంటూ వెళ్లగొట్టడానికి ప్రయత్నించిన ప్రభుత్వాలు ప్రతిసారి ఎన్నికల్లో వీరి ఓట్లను వేయించుకుని అధికారంలోకి వచ్చినవే. ఇప్పుడు అధికారంలో ఉన్న ప్రభుత్వం గుడిసెలు కూలగొట్టాక మేము మీకు అండగా ఉంటామని ప్రకటిస్తున్న ప్రస్తుత ప్రతిపక్షం రెండు కూడా ఈ వెలుగుమట్ల ప్రజల దగ్గరికి వచ్చి ప్రచారం చేసి ఎన్నికల్లో ఓట్లు అడుక్కున్నపుడు వీరు అనధికారికంగా ఉంటున్నారనే విషయం ఈ పాలకులకు లేదా? సరిగ్గా కలెక్టర్ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న ఈ ప్రజలు నిత్యం వందల సార్లు వారికి నీళ్ళు, కరెంట్ ఇవ్వమని అప్లికేషన్లు పెట్టుకుని, ధర్నాలు చేసినప్పుడు ఈ ప్రజలు ఇక్కడ ఎట్లా నివాసం ఉంటున్నారు. వారు ఎవరు అని వారితో మాట్లాడాల్సిన అవసరం, బాధ్యత ఈ అధికారులకు లేదా? నిజంగానే ఈ ప్రజలు అక్రమంగా నివాసం ఉంటున్నారనిభావిస్తే గత ఎనిమిది సంవత్సరాలుగా అధికారులు ఈ పేద ప్రజలతో మాట్లాడి ఇక్కడ నుండి మర్యాదగా వారిని తరలించడానికి ప్రయత్నమే చేయలేదు ఎందుకు? అత్యంత నిర్దాక్షిణ్యంగా, అమానవీయంగా ఇళ్ళు కూలకొట్టించిన ప్రభుత్వం అధికారులతో అసలు అక్కడ ఉండటానికి ఎవరికి హక్కే లేదని అబద్ధాలు మాట్లాడిస్తున్నారు. అధికారులు భుకాయిస్తున్నారు కదా! మరి అక్కడ అప్లికేషన్లు పెట్టుకున్న 120మంది బాధితుల్లో 60మందికి ఇంటి నెంబర్లు ఎట్లా కేటాయించారు. మిగతా వారి ఇంటి నెంబర్లు బ్లాకులో ఎందుకు ఉంచారు. ఈ సంఘటన జరిగిన వెంటనే కొంత మంది బాధితుల ఫోన్లకు ఇంటి పన్ను కట్టమని ఫోన్లకు సందేశాలు వచ్చాయని చెపుతు న్నారు. అంటే అక్కడ నివాసం ఉంటున్న పేదలు నివాసం ఉండటానికి వారికి హక్కు ఉన్నదన్నట్టే కదా. ప్రజలకు హక్కులేకనా లేదా ప్రభుత్వం కావల్సుకుని వారికి గల హక్కును నిరాకరిస్తూ బలవంతంగా వారిని ఎల్లగొట్టే కుట్ర చేసిందని అర్థమవుతుంది. నిజంగానే ప్రభుత్వం ఆ భూమిని రక్షించడానికి లేదా ఇంకేదన్నా ప్రజాప్రయోజనం కోసం ఉపయోగిద్దాం అనుకుంటే ఆ ప్రజలతో మాట్లాడి నోటీసులు ఇచ్చి ఆ తర్వాత ఇటువంటి చర్యకు దిగితే బాగుండేది కదా. అయినా వారిని అట్లా యెల్లగొట్టడానికి వారేమీ దురాక్రమణదారులు కూడా కాదు కదా. కనీసం ఇంట్లో ఉన్న పప్పులు,ఉప్పులు ఏవీ తీసుకునే వీలు లేకుండా తెల్లవారి తెల్లవారే ఆ వెలుగుమట్ల ప్రజల జీవితాల్లో నాలుగు గంటల్లో చీకట్లు నింపిన ప్రభుత్వం తమది ప్రజా ప్రభుత్వం ఎట్లా సమర్థించుకుంది. నిజానికి 1951లో వినోబాభావే ప్రారంభించిన భూదాన ఉద్యమంలో భాగంగా ఇచ్చిన భూములన్నీ కూడా భూమిలేని పేదలకు భూమి ఇచ్చి సమాజంలో సామాజిక సమానత్వాన్ని సాధించాలనే ప్రధాన ఉద్దేశ్యంతో జరిగిన ఉద్యమం. భూమి లేని పేదలు వ్యవసాయం చేసుకోడానికి, గూడు లేని వారికి నివాసం కల్పించడానికి అనే లక్ష్యంతో ఈ భూదాన ఉద్యమాల్లో భూములు సేకరించడం జరిగింది. ఈ భూములకు ప్రభుత్వం ఒక ట్రస్టీలాగ ఉండవలసిందే కానీ ఈ భూములపై ప్రభుత్వానికి ఎటువంటి అధికారాలు లేవు. దానికి ఉన్న అధికారమల్లా ఈ భూములను దురాక్రమణల నుండి భూ కబ్జాదారులనుండి రక్షించడం మాత్రమే. ఈ భూములను ఎట్టి పరిస్థితులలో పేదల కోసం ప్రజాప్రయోజలకోసం మాత్రమే కేటాయించాల్సిన అవసరం ఉంది. మరి అటువంటప్పుడు ఈఖమ్మం పట్టణం కేంద్రంలోని వెలుగుమట్ల ప్రాంతంలో ఉన్న ప్రజలు వందకు వంద శాతం అర్హులే కదా. ఈసంఘటన జరిగిన తరువాత అర్హులందరికీ ఇండ్ల స్థలాలు కేటాయించి ఇండ్లు కట్టిస్తామని ఆప్రాంత మంత్రి పత్రికల ముందు టీవీల ముందుప్రకటిస్తున్నారు. అసలు నిజంగా ప్రభుత్వానికి ఆ ఉద్దేశమేఉంటే అక్కడే సర్వేచేసి అర్హులైన వారిని ఉంచి మిగతావారిని చట్టప్రకారం వెళ్లగొట్టే అవకాశం లేకపోయిందా. కోట్ల విలువైన భూమిని కాపాడామని ఆ జిల్లా అధికారులు ప్రకటిస్తున్నారు.అసలు ఆభూమి పేదప్రజల ప్రయోజనాలకోసం ఇచ్చి నటువంటి దాన్ని వ్యాపారకోణంలో మార్చి మాట్లాడు తుంటేనే ఇందులో ఏదో కుట్రపూరితంగా చేసిన చర్యగా కనపడుతుంది.

# అంతరిక్షయానంలో 'మిషన్ దృష్టి'

## దేశ సాంకేతిక సామర్థ్యానికి ఇది గీటురాయి: ప్రధాని మోదీ

### ప్రపంచంలోనే తొలి ఆప్టోసార్ ఉపగ్రహ ప్రయోగం సక్సెస్



**న్యూఢిల్లీ, మే 3:** భారతదేశ అంతరిక్ష ప్రయాణంలో మిషన్ దృష్టి ఒక ప్రధాన మైలురాయి అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదివారం ప్రశంసించారు. ప్రపంచంలోనే మొట్టమొదటి ఆప్టోసార్ ఉపగ్రహం విజయవంతంగా ప్రయోగించడం, ఆవిష్కరణలు, దేశ నిర్మాణం పట్ల దేశ యువతకున్న అభిరుచిని ప్రతిబింబిస్తుందని ఆయన అన్నారు. 'పోస్ట్ ఆన్ ఎక్స్'లో ప్రధాని మోదీ ఈ ప్రాజెక్ట్ వెనుక ఉన్న బృందాన్ని అభినందిస్తూ, ఈ విజయం భారతదేశంలో పెరుగుతున్న సాంకేతిక సామర్థ్యాలను నొక్కి చెబుతోందని అన్నారు. "గెలాక్సీఐ చేపట్టిన మిషన్ దృష్టి మన అంతరిక్ష ప్రయాణంలో ఒక ప్రధాన విజయం. ప్రపంచంలోనే మొట్టమొదటి ఆప్టోసార్ ఉపగ్రహం, భారతదేశంలోనే అతిపెద్ద ప్రైవేటు ఉపగ్రహం విజయవంతంగా ప్రయోగించబడటం, ఆవిష్కరణలు, దేశ నిర్మాణం పట్ల మన యువతకున్న అభిరుచికి నిదర్శనం" అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఈ విజయవంతమైన ప్రయోగానికి గాను, "గెలాక్సీఐ వ్యవస్థాపకులకు, యావత్ బృందానికి హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు," అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. స్పేస్‌ఎక్స్ రాకెట్ ద్వారా ప్రయోగించబడిన భారతీయ స్టార్టప్ 'దృష్టి' ఉపగ్రహం బెంగళూరుకు చెందిన అంతరిక్ష స్టార్టప్ గెలాక్సీఐ 'మిషన్ దృష్టి' ఉపగ్రహాన్ని ఆదివారం కాలిఫోర్నియా నుండి స్పేస్‌ఎక్స్ ఫాల్కన్ 9 రాకెట్ ద్వారా ప్రయోగించారు. కంపెనీ ప్రకటన ప్రకారం, బెంగళూరుకు చెందిన స్టార్టప్ సంస్థ 'గెలాక్స్ఐ' రూపొందించిన 'మిషన్ దృష్టి' ఎలక్ట్రో ఆప్టికల్, సింథటిక్ ఎపర్చర్ రాడార్ సెన్సర్ల సాంకేతికతో పనిచేస్తుంది. ప్రపంచ అంతరిక్ష చరిత్రలో ఈ తరహా టెక్నాలజీతో పనిచేసే మొట్టమొదటి ఉపగ్రహం ఇదే కావడం విశేషం. సాధారణ ఉపగ్రహాలు కేవలం వెలుతురు ఉన్నప్పుడు మాత్రమే స్పష్టమైన చిత్రాలను తీయగలవు. అయితే 'మిషన్ దృష్టి' మాత్రం పగలు, రాత్రి అనే తేడా లేకుండా వాతావరణం ఎలా ఉన్నా అత్యంత స్పష్టమైన చిత్రాలను పంపే సామర్థ్యం కలిగి ఉంది. ప్రస్తుతం 'మిషన్ దృష్టి' ఉపగ్రహం పనితీరును పరిశీలించే ప్రక్రియపై దృష్టి సారించినట్లు గెలాక్స్ఐ సిఇఒ సుయష్ సింగ్ తెలిపారు. ఆప్టోసార్ టెక్నాలజీ ద్వారా లభించే విభిన్నమైన డేటాపై ప్రపంచవ్యాప్తంగా అప్పుడే ఆసక్తి మొదలైందని పేర్కొన్నారు. ద్వంద్వ ప్రయోజన భూ పరిశీలన ఉపగ్రహంగా, ఈ మిషన్ రక్షణ, వ్యవసాయం, విపత్తు నిర్వహణ, సముద్ర పర్యవేక్షణ, మౌలిక సదుపాయాల ప్రణాళిక వంటి రంగాలలో ఉపయోగపడుతుంది. ఇస్రో తన ఇటీవలి వార్షిక నివేదికలో పేర్కొన్న 29 క్రియాశీల భూ పరిశీలన ఉపగ్రహాలతో సహా, భారతదేశం విస్తృత కార్యక్రమాలకు ఈ ఉపగ్రహం తోడ్పాటు అందిస్తుందని కూడా భావిస్తున్నారు. గెలాక్సీఐ 2030 నాటికి మిషన్ దృష్టిని 10 ఉపగ్రహాల సమూహంగా విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకుంది, తద్వారా భారతదేశం కోసం ఒక పటిష్టమైన, సార్వభౌమ భూ పరిశీలన మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తుంది.



## విదేశ పర్యాటకులకు ఆరోగ్యబీమా తప్పనిసరి

**బ్యాంకాక్, మే 3:** విదేశీ పర్యాటకులను ఎక్కువ ఆకర్షించే థాయ్‌లాండ్‌కు వెళ్లే వారికి ఆరోగ్య బీమా తప్పనిసరి కానుంది. దేశంలోకి అడుగుపెట్టే పర్యాటకులు, విదేశీ కార్మికులు, ఇతర సందర్శకులందరికీ ఆరోగ్య బీమాను తప్పనిసరి చేయాలన్న ప్రతిపాదనను థాయ్ ప్రభుత్వం తీవ్రంగా పరిశీలిస్తోంది. ఈ నిర్ణయంతో దేశ ఆరోగ్య వ్యవస్థపై పడుతున్న ఆర్థిక భారాన్ని తగ్గించుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. విదేశీ రోగులు ఆసుపత్రుల్లో చికిత్స పొంది, బిల్లులు చెల్లించకుండా వెళ్తున్న ఉదంతాలు పెరగడమే ఇందుకు ప్రధాన కారణమని థాయ్ పబ్లిక్ హెల్త్ మంత్రి పట్టానా ప్రొంఫాట్ తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రులు, ముఖ్యంగా సరిహద్దు ప్రాంతాల్లోని వైద్యశాలలు తీవ్రంగా నష్టపోతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ సమస్యను అధిగమించేందుకే బీమాను తప్పనిసరి చేయాలని భావిస్తున్నట్లు వివరించారు. ఈ కొత్త నిబంధన అమల్లోకి వస్తే, పర్యాటకులు, విదేశీ కార్మికులు, సరిహద్దుల గుండా స్వల్పకాలానికి వచ్చేవారితో సహా అందరికీ ఇది వర్తిస్తుంది. అయితే, పర్యాటకులను నిరుత్సాహ పరచకుండా ఉండేందుకు బీమా ప్రీమియంలను సాధ్యమైనంత తక్కువగా ఉంచుతామని అధికారులు స్పష్టం చేస్తున్నారు. థాయ్‌లాండ్‌ను ఒక ప్రాంతీయ ఆరోగ్య కేంద్రంగా మార్చాలన్న లక్ష్యంలో భాగంగా ఈ చర్యలు చేపడుతున్నట్లు మంత్రి పట్టానా తెలిపారు. ప్రస్తుతం ఈ ప్రతిపాదన సమీక్ష దశలో ఉంది. ఒకవేళ ఇది అమలైతే, థాయ్‌లాండ్ వెళ్లే భారతీయులతో సహా ప్రపంచవ్యాప్తంగా ఉన్న పర్యాటకులు తమ ప్రయాణానికి ముందే తప్పనిసరిగా ఆరోగ్య బీమా పాలసీని కొనుగోలు చేయాల్సి ఉంటుంది. దీనిపై త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది.

## హార్ముజ్‌ను దాటి విశాఖకు చేరుతున్న స్వరశక్తి ట్యాంకర్!

**న్యూఢిల్లీ, మే 3:** ప్రాంతీయ ఉద్రిక్తత కారణంగా దాదాపు రెండు వారాలుగా నిలిచిపోయిన నౌకల రాకపోకల మధ్య భారతకు భారీ ఊరట లభించింది. ఇంధన కొరతతో ఇబ్బంది పడుతున్న దేశానికి ఊపిరినిస్తూ.. 46,313 మెట్రిక్ టన్నుల ద్రవరూప పెట్రోలియం గ్యాస్ (ఎల్పీజీ)తో సర్వశక్తి అనే నౌక హార్ముజ్ జలసంధిని సురక్షితంగా దాటింది. మే 2న ఈ కీలక జలమార్గాన్ని దాటిన ఈ నౌక, ప్రస్తుతం గల్ఫ్ ఆఫ్ ఒమన్‌లో ప్రయాణిస్తూ విశాఖపట్నం దిశగా వస్తోంది. అధికారిక వర్గాల సమాచారం ప్రకారం, సర్వశక్తి నౌకలో 18 మంది భారతీయులతో సహా మొత్తం 20 మంది సిబ్బంది ఉన్నారు. ఈ నౌక మే 13న విశాఖ పట్నం పోర్టుకు చేరుకుంటుందని అంచనా వేస్తున్నారు. భారత ప్రభుత్వం ఇరాన్ అధికారులతో జరిపిన దౌత్యపరమైన చర్చల ఫలితంగానే ఈ నౌక ప్రయాణానికి మార్గం సుగమమైంది. ప్రయాణ సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా, నౌక తన ఆటోమేటిక్ ఐడెంటిఫికేషన్ సిస్టమ్‌ద్వారా భారత్, భారతీయ సిబ్బంది అని నిరంతరం ప్రసారం చేస్తూ ముందుకు సాగింది. ప్రాంతీయ సంఘర్షణల నేపథ్యంలో గత రెండు వారాల్లో హార్ముజ్ జలసంధిని దాటిన తొలి భారత అనుసంధాన ఇంధన ట్యాంకర్ ఇదే కావడం గమనార్హం.

## రీల్స్ పిచ్చి ముదిరి మృత్యు వాత

**లక్నో, మే 3:** సోషల్ మీడియాలో రీల్ కోసం ఐదుగురు యువకులు పాత నీటి ట్యాంక్‌పైకి ఎక్కారు. కిందకు దిగుతుండగా దాని మెట్లు విరగడంతో ముగ్గురు కిందపడ్డారు. వీరిలో ఒకరు మరణించగా, ఇద్దరు గాయపడ్డారు. వాటర్ ట్యాంక్‌పై చిక్కుకున్న మరో ఇద్దరు యువకులను హెలికాప్టర్ ద్వారా ఎయిర్‌ఫోర్స్ సిబ్బంది రక్షించారు. ఉత్తరప్రదేశ్‌లోని సిద్ధార్థ నగర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. కాన్షీ రామ్ ఆవాసీయ్ కాలనీకి చెందిన ఐదుగురు యువకులు రీల్ రికార్డ్ చేసేందుకు శనివారం మధ్యాహ్నం 1 గంటకు స్థానికంగా ఉన్న పురాతన వాటర్ ట్యాంక్‌పైకి ఎక్కారు. రీల్ రికార్డ్ తర్వాత ఆ యువకులు కిందకు దిగేందుకు ప్రయత్నించారు. అయితే పాత మెట్లు విరిగిపోవడంతో ముగ్గురు యువకులు కింద పడ్డారు. వీరిలో సిద్ధార్థ్ అక్కడికక్కడే మరణించాడు. షాని, గోలు అనే ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. వారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మరోవైపు వాటర్ ట్యాంక్ మెట్లు విరిగిపోవడంతో మిగతా ఇద్దరు యువకులైన పవన్, కల్లు దానిపై చిక్కుకున్నారు. ఆ ఇరుకైన ప్రాంతానికి జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం, అగ్నిమాపక సిబ్బంది చేరుకోలేకపోయారు. దీంతో ఇద్దరు యువకులు రాత్రంతా అక్కడే ఉన్నారు. ఈ నేపథ్యంలో భారత వాయుసేన సహాయాన్ని అధికారులు కోరారు. ఆదివారం తెల్లవారు జామున 5.30 గంటలకు సెంట్రల్ ఎయిర్ కమాండ్‌కు చెందిన ఐఏఎఫ్ ఎంఐ17 వీ5 హెలికాప్టర్ అక్కడకు చేరుకున్నది. పురాతన వాటర్ ట్యాంక్‌పై 16 గంటలుగా చిక్కుకున్న పవన్, కల్లును ఐఏఎఫ్ సిబ్బంది రక్షించారు.

## బాలివుడ్ నటుడు సుధేశ్‌కుమార్ కన్నుమూత

**ముంబయి, మే 3:** బాలివుడ్ సీనియర్ నటుడు సుధేశ్‌కుమార్ కన్నుమూసారు. 95 ఏళ్ల సుదేశ్‌కుమార్ 1950నుంచి 1970 వరకూ బాలివుడ్ రంగంలో విశేష ఖ్యాతిని ఆర్జించారు. శ్వాసకోస సమస్యలపై ఆసుపత్రిలో చేరి చికిత్స పొంది డిశ్చార్జి అయిన తర్వాత ఇంట్లోనే కన్నుమూసినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. సోమవారం ప్రార్థనలు జరుగుతాయని తెలిపారు. గతనెల 27వ తేదీనే ముంబయిలోని బ్రీచ్‌క్యాండీ ఆసుపత్రిలో సుదేశ్‌ను చేర్పించారు. ఆ తర్వాత స్వయంగా ఆయన విజ్ఞప్తిమేరకే ఆయన్ను ఇంటికి తీసుకువచ్చి కుటుంసభ్యులు సపర్యలు చేస్తున్నారు. ఆయన భార్య జయా ధావన్ మాట్లాడుతూ ఆయన విజ్ఞప్తితోనే ఇంటికి తీసుకువచ్చి చికిత్స అందిస్తున్నామని, మెడికల్ యూనిట్‌ను కూడా మార్చినట్లు తెలిపారు. అయితే ఇంట్లోనే ఆయన తదుపరిరోజు కన్నుమూసినట్లు తెలిపారు.

# యుద్ధం ముగిసిందా! లేదా?

## అమెరికా 9 పాయింట్ల ప్రతిపాదన..

## దానిపై ఇరాన్ 14 ప్రతిపాదనలు

### హార్ముజ్ జలసంధి దిగ్బంధంపై వీడని పీటముడి




**టెహ్రాన్/వాషింగ్టన్, మే 3:** మధ్యప్రాచ్యంలో యుద్ధం ముగింపు పలకడానికి ఇరాన్ 14 పాయింట్లతో కొత్త ప్రతిపాదనలను అమెరికాకు పంపించింది. పాకిస్థాన్ ద్వారా ఈ ప్రతిపాదనలను అమెరికాకు పంపించినట్లు ఇరాన్ జాతీయ మీడియా వెల్లడించింది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలకు ముగింపు పలికేందుకు అమెరికా 9 పాయింట్లను ప్రతిపాదించింది. ప్రతిగా, ఇరాన్ 14 పాయింట్లతో తాజా ప్రతిపాదనలు పంపించింది. యుద్ధాన్ని అన్ని విధాలుగా ముగించాలని తాజా ప్రతిపాదనల్లో స్పష్టం చేసింది. లెబనాన్‌లో కూడా యుద్ధం ముగింపును ఇరాన్ కోరుకుంది. తమపై మళ్లీ దాడులు చేయవద్దని, సరిహద్దు ప్రాంతాల్లో అమెరికా తన బలగాలను ఉపసంహరించుకోవాలని, వివిధ దేశాల్లో స్తంభింప చేసిన ఇరాన్ ఆస్తులను విడుదల చేయాలని, ఇంధనం సహా వివిధ రూపాల్లో తమపై విధించిన ఆంక్షలను ఎత్తివేయాలని ఆ ప్రతిపాదనల్లో స్పష్టం చేసింది. హార్ముజ్ జలసంధి దిగ్బంధనాన్ని ఉపసంహరించుకోవాలని పేర్కొంది. యుద్ధం కారణంగా జరిగిన నష్టానికి పరిహారం చెల్లించాలని ఇరాన్ ఈ ప్రతిపాదనల్లో తెలిపింది. కాల్పుల విరమణ పొడిగింపు పేరుతో తాత్కాలిక సంధికి బదులు సమస్యను శాశ్వతంగా ముగించేలా సమగ్ర పరిష్కారాన్ని ఇరాన్ కోరింది. ముప్పై రోజుల్లో యుద్ధాన్ని ముగించాలని కోరింది. యుద్ధానికి ముగింపు పలకాలా లేక కొనసాగించాలా అనే నిర్ణయం ఇప్పుడు అమెరికానే తీసుకోవాలని ఇరాన్ తెలిపింది. యుద్ధానికి శాశ్వతముగింపు పలకడమే తమలక్ష్యమని పేర్కొంది. జాతీయ ప్రయోజనాలు, భద్రతను కాపాడుకోవడానికి తాము మాత్రం దేనికైనా సిద్ధంగానే ఉన్నామని ఇరాన్ స్పష్టం చేసింది.

**కొత్తప్రతిపాదనలు అందాయి..సమగ్ర పరిశీలన తర్వాతేనిర్ణయం: ట్రంప్**

ఇరాన్‌తో ఒప్పందానికి సంబంధించిన కొత్తప్రతిపాదనలు తనకు వివరించారని, తుది ప్రతిని పరిశీలించాకే నిర్ణయం తీసుకుంటానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెలిపారు. అదే సమయంలో టెహ్రాన్ దుందుడుకుగా ప్రవర్తిస్తే సైనిక చర్యకు వెనుకాడబోమని ఆయన గట్టిగా హెచ్చరించారు. ఫ్లోరిడా నుంచి మియామి వెళ్లే ముందు ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు పెరిగిన నేపథ్యంలో, చర్చలకు సిద్ధమంటూనే ఒత్తిడిని కొనసాగించే ద్వంద్వ వైఖరిని వాషింగ్టన్ అవలంబిస్తోంది. ఇరాన్‌పై తిరిగి దాడులు చేసే అవకాశాన్ని తోసిపుచ్చలేదని ట్రంప్ స్పష్టం చేశారు. ఈ అంశంపై తన ట్రూత్ సోషల్ ప్లాట్‌ఫామ్‌లో కూడా ట్రంప్ స్పందించారు. గత 47 ఏళ్లుగా ప్రపంచానికి, మానవాళికి ఇరాన్ చేసిన నష్టానికి ఇంకా తగిన మూల్యం చెల్లించలేదు. కాబట్టి వారు పంపిన ప్రణాళిక ఆమోదయోగ్యంగా ఉంటుందని నేను ఊహించలేనని ఆయన పోస్ట్ చేశారు. తమ ప్రతిపాదనను పాకిస్థాన్ ద్వారా ఇరాన్ అమెరికాకు పంపింది. ఈ డీల్‌కు అంగీకరిస్తే కీలకమైన హార్మూజ్ జలసంధిగుండా నౌకల రాకపోకలను పునరుద్ధరిస్తామని, అమెరికా దిగ్బంధనానికి ముగింపు పలుకుతామని ఇరాన్‌తెలిపింది. తమ అణు కార్యక్రమంపై చర్చలను తదుపరిదశకు వాయిదా వేయాలని ఇరాన్ కోరుతోంది. ఈ ప్రతిపాదనను ట్రంప్ గతంలో తిరస్కరించారు. దౌత్యపరంగా చర్చలకు కట్టుబడి ఉన్నామని, కానీ ఎలాంటి సైనిక చర్యనయినా స్పందించేందుకు, తాము సిద్ధమేనని ఇరాన్ అధికారులు స్పష్టం చేశారు.

## అనుమతిలేనిదే ఒక్క నౌకకూడా వెళ్లనివ్వం!: ఐఆర్‌జిసి



**టెహ్రాన్, మే 3:** హార్మూజ్ జలసంధిపై తమకు పూర్తి నియంత్రణ ఉందని, తమ అనుమతి లేకుండా స్నేహపూర్వక లేదా శత్రు దేశాలకు చెందిన ఏ నౌక కూడా ఆ మార్గం గుండా ప్రయాణించలేదని ఇరాన్ ఆర్మీ స్పష్టం చేసింది. ఈ జలసంధిని నియంత్రించడం తమకు ఉన్న సహజమైన హక్కు అని ఇరాన్ ఆర్మీ ప్రతినిధి మహమ్మద్ అక్రమినియా అన్నారు. ప్రస్తుతం ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్, దేశ సైన్యం సంయుక్తంగా హార్మూజ్ జలసంధిని పూర్తిస్థాయిలో నియంత్రిస్తున్నాయని ఆయన తెలిపారు. తమ బలగాల అనుమతి లేకుండా ఏ నౌకకూ ప్రయాణించే హక్కు లేదని ఆయన తేల్చి చెప్పారు. మరోవైపు, తమ నౌకలను అనుమతించాలంటూ వివిధ దేశాలు టెలెక్స్, లేఖల ద్వారా ఇరాన్‌ను అత్యవసరంగా అభ్యర్థిస్తున్నాయని ఇరాన్ ఉప విదేశాంగ మంత్రి హమీద్ ఘన్‌బారీ వెల్లడించారు.

ఈ ఏడాది ఫిబ్రవరి 28 నుంచి ఇరాన్ హార్మూజ్ జలసంధిపై తన పట్టును బిగించింది. తమ భూభాగంపై అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా దాడులు చేసిన నేపథ్యంలో ఆ రెండు దేశాలకు చెందిన, వాటితో సంబంధం ఉన్న నౌకలపై ఇరాన్ నిషేధం విధించింది. ఇదిలా ఉంటే, పర్షియన్ గల్ఫ్, హార్మూజ్ జలసంధిలో ఒక కొత్త అధ్యాయం ప్రారంభం కాబోతోందని ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తబా ఖొమైనీ అన్నారు. ఈ జలసంధి నిర్వహణకు త్వరలోనే ఒక కొత్త చట్టపరమైన ఫ్రేమ్‌వర్క్‌ను తీసుకువస్తామని, ఇది ఈ ప్రాంతంలోని అన్ని దేశాల అభివృద్ధికి దోహదపడుతుందని తెలిపారు. భవిష్యత్తులో పెర్షియన్ గల్ఫ్ అమెరికా రహితంగా శాంతి, శ్రేయస్సుతో వర్ధిల్లుతుందని ఆయన పేర్కొన్నారు.

## నెదర్లాండ్స్ యువరాణుల హత్యకు కుట్ర!

### 33 యేళ్ల అనుమానితుడి అరెస్టు

**హేగ్,మే 3:** నెదర్లాండ్స్‌లో ఇద్దరు రాజకుమార్తెలపై హత్యకు కుట్ర పన్నారన్న ఆరోపణలతో ఓ వ్యక్తిని అరెస్ట్ చేసారు. డచ్ సింహాసనానికి వారసురాలైన యువరాణి కాథరినాఅమాలియా (22), ఆమె సోదరి యువరాణి అలెక్సియా (20)లే లక్ష్యంగా దాడికి ప్లాన్ చేసినట్లు అధికారులు గుర్తించారు. ఈ కేసుకు సంబంధించి సోమవారం నిందితుడిని కోర్టులో హాజరుపరచనున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో హేగ్ నగరంలో 33 ఏళ్ల వ్యక్తిని అధికారులు అరెస్ట్ చేశారు. అతడి వద్ద నుంచి రెండు గొడ్డళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఒక గొడ్డలిపై అలెక్సియా, ఇజ్రాయెల్ గూఢచారి సంస్థ మొస్సాద్, నాజీ నినాదమైన సీగ్ హీల్ వంటి పదాలు చెక్కి ఉండటం తీవ్ర కలకలం రేపింది. దీంతో పాటు అమాలియా, అలెక్సియా, బ్లడ్‌బాత్ (రక్తపాతం) అని రాసి ఉన్న చేతిరాత నోట్‌ను కూడా అధికారులు కనుగొన్నారు. ఈ అరెస్ట్‌కు సంబంధించిన వివరాలను పబ్లిక్ ప్రాసిక్యూషన్ కార్యాలయం తాజాగా వెల్లడించింది. నిందితుడి తరఫు న్యాయవాది కోర్టు విచారణకు ముందు వివరాలు వెల్లడించేందుకు నిరాకరించారు. డచ్ రాజకుటుంబం కూడా ఈ ఘటనపై తక్షణమే స్పందించలేదు. యువరాణి అమాలియాకు భద్రతాపరమైన ముప్పు ఎదురవడం ఇది మొదటిసారి కాదు. 2022లో ఆర్గనైజ్డ్ క్రైమ్ ముఠాల నుంచి తీవ్రమైన బెదిరింపులు రావడంతో ఆమె ఆమ్‌స్టర్‌డామ్‌లోని విద్యార్థి వసతి గృహాన్ని విడిచిపెట్టి, దాదాపు ఏడాది పాటు స్పెయిన్‌లోని మాడ్రిడ్‌లో నివసించాల్సి వచ్చింది. తాజా ఘటనతో రాజకుటుంబ భద్రతపై మరోసారి ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

## ఓట్ల లెక్కింపు సందర్భంగా అడ్డంకులకు బిజెపి యత్నం

### ఎన్నికల ప్రధాన అధికారికి డిఎంకె ఫిర్యాదు

**చెన్నై, మే 3:** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు రోజున కౌంటింగ్ సెంటర్ల వద్ద అడ్డంకులు సృష్టించేందుకు బిజెపి కుట్రలు చేస్తోందని అధికార డిఎంకే ఆరోపించింది. పెద్దఎత్తున శాంతిభద్రతలకు ఆటంకం కలిగే అవకాశాలున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. కౌంటింగ్ ప్రక్రియ సమగ్రతను కాపాడేందుకు, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరక్కుండా చూసేందుకు ఎన్నికల అధికారులు చర్యలు తీసుకోవాలని కోరింది.

ఈ మేరకు డిఎంకే ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆర్.ఎస్.భారతి ఎన్నికల ప్రధానాధికారికి ఆదివారంనాడు లేఖ రాశారు. బిజెపి, ఇతర రాజకీయల పార్టీలు కేంద్రంలోని అధికార పార్టీ సూచనల మేరకు కౌంటింగ్ సెంటర్ల వల్ల అవాంతరాలు సృష్టించేందుకు వ్యూహరచన చేస్తున్నట్టు తమకు విశ్వసనీయ సమాచారం ఉందని ఆ లేఖలో ఆర్ఎస్ భారతి పేర్కొన్నారు. కౌంటింగ్ బూత్‌లకు చుట్టుపక్కల ఉన్న ప్రాంతాలు, పార్టీ కార్యాలయాలు ఉన్న సున్నితమైన ప్రాంతాల్లో కూడా అవాంతరాలు సృష్టించే వీలుందని డీఎంకే నేత ఆరోపించారు. ఇందువల్ల పెద్దఎత్తున శాంతిభద్రతలక సమస్య తలెత్తవచ్చని, ఆ ప్రభావం స్వేచ్ఛగా, సజావుగా జరగాల్సిన ఎన్నికల ప్రక్రియపై పడవచ్చని పేర్కొన్నారు.

ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరక్కుండా తగినంత భద్రతా సిబ్బందిని నియమించాలని, ఏజెన్సీల మధ్య సమన్వయాన్ని కట్టుదిట్టం చేయాలని ఎన్నికల ప్రధానాధికారిని ఆ లేఖలో కోరారు. తద్వారా ఎన్నికల ప్రక్రియ పవిత్రత, ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజలకున్న విశ్వాసాన్ని పరిరక్షించాలని విజ్ఞప్తి చేశారు. మే 4న అసెంబ్లీ ఎన్నికల కౌటింగ్ జరిపి, ఫలితాలను ప్రకటించనున్నారు.

## హెజ్బొల్లా స్థావరాలపై ఇజ్రాయెల్ భీకర దాడులు

### 50కిపైగా మౌలిక సదుపాయాలు ధ్వంసం



**బీరూట్, మే 3:** ఇజ్రాయెల్, హెజ్బొల్లా మధ్య ఉద్రిక్తతలు మరోసారి తీవ్రస్థాయికి చేరాయి. లెబనాన్‌లోని హెజ్బొల్లా స్థావరాలపై ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ (ఐడీఎఫ్) భీకర దాడులు నిర్వహించింది. ఈరోజు తెల్లవారుజామున జరిపిన ఈ దాడుల్లో 50కి పైగా కీలక మౌలిక సదుపాయాల కేంద్రాలను ధ్వంసం చేసినట్లు ప్రకటించింది. దక్షిణ లెబనాన్, బెకా వ్యాలీలోని హెజ్బొల్లా స్థావరాలే లక్ష్యంగా ఈ వైమానిక దాడులు జరిగినట్లు ఐడీఎఫ్ వెల్లడించింది. గత 24 గంటల్లోనే సుమారు 50 లక్ష్యాలపై దాడి చేశామని ఐడీఎఫ్ శనివారం ప్రకటించింది. ఈ వారాంతంలో మొత్తం 70 సైనిక నిర్మాణాలు, 50 మౌలిక సదుపాయాల సైట్‌లతో కలిపి 120 టార్గెట్లను ధ్వంసం చేసినట్లు మరో నివేదిక పేర్కొంది. హెజ్బొల్లాకు చెందిన కమాండ్ సెంటర్లు, ఆయుధాగారాలు, సైనిక భవనాలను ధ్వంసం చేసినట్లు ఐడీఎఫ్ తెలిపింది. తమ దేశ పౌరులు, సైనికులపై దాడులను అడ్డుకోవడానికే ఈ ఆపరేషన్ చేపట్టినట్లు స్పష్టం చేసింది. ఆదివారం ఉదయం కూడా దాడులు కొనసాగాయని పేర్కొంది. ఇజ్రాయెల్ దాడులకు ప్రతిగా హెజ్బొల్లా కూడా ఇజ్రాయెల్‌పైకి రాకెట్లు, డ్రోన్లతో దాడులు చేసింది. మరోవైపు, ఇజ్రాయెల్ జరిపినదాడుల్లో 12 మందివరకు మరణించినట్లు లెబనాన్ ఆరోగ్య శాఖ వర్గాలు తెలిపాయి. అయితే, మృతుల్లో ఎంతమంది పౌరులు, ఎంతమంది మిలిటెంట్లు ఉన్నారనే దానిపై స్పష్టత లేదు. దాడులకు ముందు పలు గ్రామాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని ఇజ్రాయెల్ సైన్యం హెచ్చరికలు జారీ చేసింది. ఇరుపక్షాల దాడులు, ప్రతిదాడులతో సరిహద్దు ప్రాంతాల్లో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

## సంక్షిప్తంగా..

### తోబుట్టువులను ఇటుకలతో కొట్టిచంపిన కన్న తల్లి!

**లక్నో,మే 3:** తోబుట్టువులైన నలుగురు పిల్లలను ఇటుకలతో కొట్టి దారుణంగా హత్య చేసి ఇంటి లోపల నుంచి లాక్ వేసి పారిపోయిన ఉదంతం యూపిలో వెలుగులోకి వచ్చింది. ఈ సంఘటనలో పరారీలో ఉన్న పిల్లల తల్లిపై అనుమానం వ్యక్తం చేశారు. ఉత్తరప్రదేశ్‌లోని అంబేద్కర్ నగర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. మురాదాబాద్ మొహల్లాలో తాళం వేసి ఉన్న ఒక ఇంటి లోపల నలుగురు పిల్లల మృతదేహాలు పడి ఉన్నాయని శనివారం మధ్యాహ్నం పోలీసులకు సమాచారం అందడంతో వారు అక్కడకు చేరుకున్నారు. లోపల నుంచి లాక్ వేసి ఉన్న ఆ ఇంట్లోకి పోలీసులు ప్రవేశించారు. తోబుట్టువులైన నలుగురు పిల్లలను ఇటుకలతో కొట్టి దారుణంగా హత్య చేసినట్లు గమనించారు. మృతుల్లో ముగ్గురు బాలురు, ఒక బాలిక ఉన్నారు.

### విమానం డోర్ తెరిచి కిందకు దూకిన ప్యాసింజర్




**చెన్నై, మే 3:** షార్జాచెన్నై విమానం చెన్నై అంతర్జాతీయ విమానాశ్రయంలో ల్యాండ్ కాగానే ఒక ప్రయాణికుడు ఎమర్జెన్సీ డోర్ తెరిచి కిందకు దూకడం అందరినీ తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. ఆదివారం ఉదయం జరిగిన ఈ ఘటనతో, తోటి ప్రయాణికులు ఆందోళనకు గురయ్యారు. వేకువజామున షార్జా నుంచి ఎయిర్ అరేబియా విమానం ల్యాండ్ కాగానే, ట్యాక్సీవేపై కదులుతుండగా సదరు ప్రయాణికుడు బయటకు దూకాడు. పైలట్ గ్రౌండ్ సెక్యూరిటీని అప్రమత్తం చేశారు. సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ సిబ్బంది వెంటనే స్పందించి అతడిని అదుపులోకి తీసుకున్నారు. తదుపరి విచారణ కోసం అతడిని పోలీసులకు అప్పగించారు. ఆ ప్రయాణికుడు కిందకు దూకినప్పుడు విమానం ఇంకా నెమ్మదిగా కదులుతూనే ఉంది. అతడికి ఏమీ కాలేదు. విమానానానికి కూడా నష్టం జరగలేదని విమానాశ్రయ సీనియర్ అధికారి ఒకరు అన్నారు.

### 500 మెజార్టీ ఉంటే రీకౌంటింగ్‌కు డిమాండ్ చేయండి: మమత

**కోల్‌కతా, మే 3:** దేశవ్యాప్తంగా అందరూ ఆసక్తిగా చూస్తున్న పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ మరికొద్ది గంటల్లో జరుగనుండటంతో ముఖ్యమంత్రి మమతా బెనర్జీ పార్టీ కౌంటింగ్ ఏజెంట్లకు దిశానిర్దేశం చేశారు. బిజెపి 500 నుంచి 700 ఓట్ల ఆధిక్యంలో ఉంటే ఆయా బూత్‌లలో కచ్చితంగా రీకౌంటింగ్ కోరాలని వారికి సూచించారు. ఆదివారంనాడు రాత్రంతా కౌంటింగ్ సెంటర్ల వద్దే ఉండాలని, అందువల్ల సోమవారం ఉదయమే కౌంటింగ్ సెంటర్లకు చేరే వీలుంటుందని చెప్పారు. 294 అసెంబ్లీ నియోజకవర్గాల్లో మే 4న ఎన్నికల ఫలితాలు వెలువడనుండటంతో పార్టీ నేతలు, కౌంటింగ్ ఏజెంట్లతో మమతాబెనర్జీ వర్చువల్ మీట్ జరిపారు. కౌంటింగ్ సమయంలో సమన్వయం, నిఘా అనేది చాలా ముఖ్యమని, కౌంటింగ్ సెంటర్లకు ఉదయమే కార్యకర్తలు చేరుకుని కలిసికట్టుగా పనిచేయాలని మమతా బెనర్జీ సూచించారు. బీజేపీకి ఎక్కడైనా 500 నుంచి 700, 1,000 ఓట్ల వరకూ మార్జిన్‌వస్తే రీకౌంటింగ్‌కు డిమాండ్ చేయాలని హితబోధచేసారు.

### అపార్టుమెంట్‌లో ఎసి పేలి తొమ్మిది మంది మృతి

**న్యూఢిల్లీ,మే 3:** దేశ రాజధాని ఢిల్లీలో ఘోర అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. తూర్పు ఢిల్లీలోని షాహదరా జిల్లా వివేక్ విహార్ ఫేజ్1లో ఉన్న ఓ నాలుగు అంతస్తుల నివాస భవనంలో ఈరోజు తెల్లవారుజామున ఎసి పేలిపోయి భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ దుర్ఘటనలో తొమ్మిది మంది ప్రాణాలుకోల్పోయారు. మరోఇద్దరు గాయపడ్డారు. పోలీసులు, అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, ఈరోజు తెల్లవారుజామున భవనంలో మంటలు చెలరేగినట్లు సమాచారం అందింది. వెంటనే 14 ఫైర్‌ఇంజన్లు ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. భవనంలోని రెండు, మూడు, నాలుగు అంతస్తుల్లో మంటలు వేగంగా వ్యాపించాయి. సుమారు రెండు గంటల పాటు శ్రమించి అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకు వచ్చారు.

### మందులోకి నీళ్లివ్వలేదని తొమ్మిదేళ్ల బాలుడి హత్య

**ఖాస్‌గంజ్, (యుపి), మే 3:** ఉత్తరప్రదేశ్‌లో దారుణ ఘటన చోటుచేసుకుంది. మద్యంలో కలిపేందుకు నీళ్లు తీసుకురాలేదన్న చిన్నకారణంతో 9 ఏళ్ల బాలుడిని బంధువే కాల్చిచంపాడు. కాస్‌గంజ్ జిల్లాలోని యాకుత్‌గంజ్ గ్రామంలో శుక్రవారం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. యాకుత్‌గంజ్ గ్రామంలోని జస్వీర్ గోలా ఇంట్లో నామకరణ వేడుక జరుగుతోంది. ఈ కార్యక్రమానికి బంధువులు, గ్రామస్థులు హాజరయ్యారు. ఇదే సమయంలో జస్వీర్ బంధువైన ధనేశ్ యాదవ్ మద్యం తాగుతున్నాడు. అక్కడే ఆడుకుంటున్న జస్వీర్ కుమారుడిని పిలిచి మద్యం కలుపు కోవడానికి నీళ్లుతీసుకురమ్మని అడిగాడు. అందుకు ఆబాలుడు నిరాకరించాడు. దీంతో మద్యం మత్తులో ఉన్న ధనేశ్‌యాదవ్ తీవ్ర ఆగ్రహానికిగురై తన వద్దఉన్న తుపాకితో బాలుడి కడుపులో కాల్చాడు.

# తెలంగాణలో రాబోయేది బిజెపి ప్రభుత్వమే

## ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో బిజెపిదే సత్తా: ధర్మపురి అరవింద్



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మే3:** ఇటీవల జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో బిజెపి తన సత్తా చాటనుందని,ఐదు రాష్ట్రాల్లో బిజెపికి అనుకూలంగా ఫలితాలు రానున్నాయని నిజామాబాద్ ధర్మపురి అరవింద్ అన్నారు. పశ్చిమ బెంగాల్‌లో భారీ మెజారిటీతో గెలువబోతుందని పేర్కొన్నారు. ఈ నెల 10న ప్రధాని నరేంద్ర మోదీ రాష్ట్రంలో రూ.8 వేల కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారని బిజెపి ఎంపీ ధర్మపురి అర్వింద్ ప్రకటించారు. పసుపు రైతులకు మంచి మద్దతు ధర లభిస్తోందంటే దానికి కారణం ప్రధాని మోదీ మాత్రమేనని స్పష్టం చేశారు.ఆదివారం ఆయన నిజామాబాద్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. తెలంగాణలో రాబోయే ఎన్నికల్లో బిజెపి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. 'కేసీఆర్‌కు మతి భ్రమించింది. నమ్మిన నాయకులను మోసం చేయడం ఆయనకు అలవాటు. బీఆర్ఎస్‌లో చేరిన జీవన్‌రెడ్డిని కూడా కేసీఆర్ మోసం చేస్తారు అని పేర్కొన్నారు.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి పరిపాలనపై పట్టు లేదు. రేవంత్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలను కూడా మరచిపోయారు. ధాన్యం కొనుగోళ్లలో తీవ్రస్థాయిలో జాప్యం జరుగుతోందన్నారు. రైతు పండించిన ప్రతి ధాన్యం గింజను వారం రోజుల్లోగా కొనుగోలు చేయాలని బీజేపీ అల్టిమేటం జారీ చేసిందన్నారు. జిల్లాల్లో 8లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ జరగాల్సి ఉండగా ఇప్పటి వరకు 2లక్షల మెట్రిక్ టన్నులు కూడా సేకరించలేకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వం చేతకాని తనమే అని ఆయన అన్నారు. సరైన సమయంలో కొనుగోళ్లు జరగకపోతే రాష్ట్రంలో రైతాంగం నుంచి పెద్దఎత్తున ఉద్యమం వస్తుందని అన్నారు.

తెలంగాణలో రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కమిషన్ ప్రభుత్వం నడుస్తోందని, అవినీతి పాలన కొనసాగుతుందని ఆరోపించారు. మహిళా సాధికారత కోసం కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన బిల్లును అడ్డుకుని కాంగ్రెస్ పార్టీ మహిళలను వంచించిందన్నారు. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్‌పాపులర్ లీడర్, ఆయన చుట్టూ ఎం జరుగుతుందో తెలుసుకోలేకపోతున్నారని వ్యాఖ్యానించారు. పేద ప్రజలకు ప్రతి నెలా రేషన్ బియ్యం ఉచితంగా సరఫరా చేసేది కేంద్ర ప్రభుత్వ మేనని ఎంపీ అన్నారు.

# మానవత్వాన్ని చాటుకున్న మంత్రి సీతక్క

## రోడ్డు ప్రమాద బాధితులకు వైద్య సాయం

**హైదరాబాద్, మే 3, ప్రభాతవార్త:** రాష్ట్ర గ్రామీణాభివృద్ధిశాఖమంత్రి సీతక్క మరోసారి మానవత్వాన్ని చాటుకున్నారు. రోడ్డు ప్రమాద బాధితులను స్వయంగా తన కారులో ఆసుపత్రికి చేర్చి వైద్య సహాయం అందేలా చూశారు. మంత్రి సీతక్క ఆదివారం ఉదయం హైదరాబాద్ నుంచి ములుగుకు వెళ్తున్న క్రమంలో బీబీనగర్ సమీపంలో రోడ్డు ప్రమాదం జరగడాన్ని గమనించారు. ప్రమాదంలో గాయపడి కన్నీరు మున్నీరుగా విలపిస్తున్న ఒక కుటుంబాన్ని చూసి ఆమె వెంటనే తన కాన్వాయ్‌ను ఆపారు. ఏమాత్రం ఆలస్యం చేయకుండా ఏడుస్తున్న చిన్న పిల్లలను స్వయంగా తన చేతులతో ఎత్తుకుని తన కాన్వాయ్ వాహనంలోకి ఎక్కించి సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ఆసు పత్రికి వెళ్ళిన తర్వాత కూడా వైద్యులతో మాట్లాడి క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందేలా స్వయంగా పర్యవేక్షించారు. కాగా రోడ్డు ప్రమాద సమ యంలో బాధితులను ఆదుకోవడానికి మంత్రి సీతక్క చూపించిన చొరవను పలువురు ప్రశంసిస్తున్నారు.



ఆదివారం హైదరాబాదలో జరిగిన సమావేశంలో పాల్గొన్న బిసి విద్యార్థి, యువజన, సంక్షేమ సంఘాల నేతలు ఆర్.కృష్ణయ్య, నీల వెంకటేష్, జిల్లపల్లి అంజీ, సి.రాజేందర్, గోరిగే మల్లేష్, అనంతయ్య తదితరులు

### పేద విద్యార్థులకు ఫీజుల రీయింబర్స్‌మెంట్

# చెల్లించేదాకా సిఎంను నిద్రబోనివ్వం

### లక్షల కోట్లు అప్పులు చేసి రాష్ట్రాన్ని అప్పుల కుప్ప చేశారు

### రాష్ట్రాన్ని దోచుకున్నవారిపై పిఎంకు ఫిర్యాదు చేస్తాం: ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్ (సైఫాబాద్), మే 3 ప్రభాతవార్త:** పేద విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం ప్రవేశపెట్టిన ఫీజుల రీయంబర్స్‌మెంట్ పథకాన్ని యథావిధిగా కొనసాగించేంతవరకు సిఎం రేవంత్‌రెడ్డిని నిద్రపోనీయకుండా చేస్తామని రాజ్యసభ సభ్యుడు, ఆర్.కృష్ణయ్య హెచ్చరించారు. ఈ పథకాన్ని ఎత్తివేసేందుకు ప్రభుత్వం కుట్ర పన్నుతున్నదని, దీని పైన ఉద్యమాన్ని గ్రామస్థాయి వరకు విస్తరింపజేస్తామని, జూన్‌లో 5 లక్షల మంది విద్యార్థులతో సిఎం ఇంటిని ముట్టడిస్తామని, మంత్రులు, ఎమ్మెల్యేలను రాష్ట్రంలో తిరగనీయకుండా ఘెరావ్ చేస్తామని చెప్పారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బిసి విద్యార్థి, యువజన, బిసి సంక్షేమ సంఘాల ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సమావేశానికి సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు నీల వెంకటేష్, యువజన సంఘం అధ్యక్షుడు జిల్లపల్లి అంజీ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య ప్రసంగిస్తూ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సిఎంగా ఉన్నప్పుడు 5 రోజులపాటు ఆమరణ నిరాహారదీక్ష చేసి ఫీజుల రీయంబర్స్‌మెంట్ పథకాన్ని సాధించడం జరిగిందని, ఆ తరువాత వచ్చిన సిఎంలు కె.రోశయ్య, ఎన్.కిరణ్‌కుమార్‌రెడ్డి కూడా ఈ పథకాన్ని ఎత్తివేసేందుకు ప్రయత్నించి విఫలం చెందారని, ఆనంతరం కెసిఆర్ ఈ పథకాన్ని యథావిధిగా కొనసాగించారని తెలిపారు. ప్రసుత్త ప్రభుత్వం లక్షల కోట్లు రూపాయలు అప్పులు చేసి రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచారని ఆయన ధ్వజమెత్తారు.

కోట్లాది రూపాయలు డబ్బులు పోసి బిసి ఉద్యమాలను, ప్రజా ఉద్యమాలను చీల్చుతున్నారని, రాష్ట్రాన్ని సర్వనాశనం చేస్తున్నా రని ఆరోపించారు. ఈ అవినీతి, అక్రమాలు, దోపిడీలపై ప్రధాని నరేంద్ర మోదీకి ఫిర్యాదు చేస్తానని ఆర్.కృష్ణయ్య హెచ్చరించారు. విద్యా, వైద్యం ఉచితంగా కల్పించాలని, ఇది రాజ్యాంగం కల్పించిన హక్కు, ఈ సమావేశంలో బిసి నేతలు సి.రాజేందర్, గోరిగె మల్లేష్‌యాదవ్, అనంతయ్య, నిఖిల్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎత్తివేతకు ప్రభుత్వం కుట్ర

## ఏఐఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర కమిటీ

**హైదరాబాద్, ప్రభాతవార్త, మే 3:** రాష్ట్రంలోని పేద, బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు అమలు చేస్తున్న ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ఎత్తివేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఏఐఎస్ఎఫ్) తెలంగాణ రాష్ట్ర కమిటీ మండిపడింది. రాష్ట్రంలో గత మూడేళ్లుగా ఉన్నపెండింగ్ ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని సంఘం రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలరషిప్ బకాయిల విడుదలపై కాంగ్రెస్ ప్రభుత్వం పూటకో తీరుగా వ్యవహరిస్తూ, లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం చెలగాట మాడుతోందన్నారు. గతంలో ఫీజు బకాయిల విడుదలపై సెటిల్‌మెంట్ రూపంలో చెల్లిస్తామని చెప్పి ఆ తర్వాత కళాశాల యాజమాన్యాలు సమ్మె చేస్తే విడతల వారిగా విడుదల చేస్తామని చెప్పారని, ఇప్పుడేమో రానున్న విద్యా సంవత్సరం నుంచి విద్యార్థులకే నేరుగా ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వారి అకౌంట్లోకి వేస్తామని జీవో నెం 7ను తీసుకొచ్చిందన్నారు. పాత బకాయిలను ఎప్పుడు విడుదల చేస్తారో ప్రభుత్వంస్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వం ప్రతి సంవత్సరం ఏ నెలలో విడుదల చేస్తుందో స్పష్టత ఇవ్వాలన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు చూస్తుంటే ఫీజు రియంబర్స్‌మెంట్ పథకం ఎత్తివేసే కుట్ర చేస్తుందని అర్థమవుతుందన్నారు.

# మళ్లీ కొండెక్కిన చికెన్ ధరలు: కిలోపై రూ.40దాకా పెంపు

**హైదరాబాద్, మే 3, ప్రభాతవార్త:** తెలుగు రాష్ట్రాల్లో భానుడి భగభగలకు తోడు ఇప్పుడు చికెన్ ధరలు కూడా సామాన్యుడికి చుక్కలు చూపిస్తున్నాయి. రెండు, మూడు వారాలపాటు తగ్గుముఖం పట్టిన ధరలు ఆదివారం మళ్లీ పెరిగాయి. ప్రస్తుత వేసవి తీవ్రత దృష్ట్యా పౌల్ట్రీ పరిశ్రమ ఎదుర్కొంటున్న సవాళ్లు నేరుగా వినియోగదారులపై పడుతున్నాయి. సాధారణంగా వేసవిలో డిమాండ్ కొంత తక్కువగా ఉన్నప్పటికీ ఈసారి సరఫరా మరీ తక్కువగా ఉండటంతో కేవలం వారం వ్యవధిలోనే కిలో చికెన్‌పై రూ. 40వరకు ధర పెరగడం గమనార్హం. గత వారంతో పోలిస్తే కేజీ చికెన్‌పై దాదాపు రూ. 20నుండి రూ. 40 వరకు అదనపు భారం పడింది.

ప్రస్తుతం తెలంగాణ వ్యా ప్తంగా వరంగల్, నిజామాబాద్ వంటి జిల్లాల్లో ధర రూ. 270 పలుకుతుండగా హైదరాబాద్‌లో రూ. 280కు చేరింది. ధరలు విపరీతంగా పెరగడంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు చికెన్ కొనాలంటేనే వెనకాడుతున్నారు.



దివ్యాంగునితో మాట్లాడుతున్న గవర్నర్ శివప్రతాప్‌శుక్లా

## నారాయణ సేవా సంస్థాన్ సేవలు

# మానవత్వానికి నిదర్శనం: గవర్నర్ శివప్రతాప్ శుక్లా

**హైదరాబాద్ (గోషామహల్), మే 3ప్రభాతవార్త:** నారాయణ సేవా సంస్థాన్ దివ్యాం గులకు అందిస్తున్న అమూల్యమైన సేవలు మానవత్వానికి నిదర్శమని రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్‌శుక్లా కితాబిచ్చారు. ఆదివారం నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో నారాయణ సేవాసంస్థాన్ పక్షాన 745 మంది దివ్యాం గులకు కృతిమ అవయవాలు పంపిణి కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త ఆవయవాల పంపిణి తర్వాత పలువురు లబ్దిదారులు, నడవడం,అడుకోవడం, స్వతంత్రులుగా పనులు చేసుకోవడం వంటి బావోద్వేగక్షణాలు అవిష్కృతమయ్యావని పేర్కొన్నారు.రోడ్డు ప్రమాదాల్లో ప్రమాదశాత్తు కాళ్లు,చేతులు కోల్పొయిన నిస్సయస్థితుల్లో ఉన్న ఆభాగ్యులను గుర్తించి వారికి తిరిగి ఉచితంగా కృత్రిమ అవయవాలు అందించి కొత్త జీవితాన్ని ప్రసాదించేందుకు చేస్తున్న కృషిని ఆయన అభినందించారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రి టి.జి.భరత్ మాట్లాడుతూ దివ్యాంగులను సమాజంలో ప్రధాన ప్రవాహంలోకి తీసుకురావడంలోను నారాయణ సేవా సంస్థాన్ ఎంతో కీలకంగా మారిందన్నారు. ఇది సేవా మాత్రమే కాదు.వారి జీవితాలనే మార్చే ఉద్యమన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్‌చైర్మన్ దేవేంద్ర చోబిసా, రాహుల్, సత్యభూషన్‌జై ట్రస్టీ డైరెక్టర్ దేవేంద్ర చౌదరి, భగవాన్‌ప్రసాద్, మహేంద్ర అగర్వాల్, అశోక్ సామ్రేచా, మహేంద్రగోల్సా, ప్రేంప్రకాష్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగుల పట్ల ప్రభుత్వ చిత్తశుద్ధికి కృతజ్ఞతలు

### 63 డిమాండ్స్‌లో 26 పరిష్కరించినందుకు ధన్యవాదాలు

### మిగిలిన 37 డిమాండ్లను పరిష్కరించాలి

### టిజిఈజేఏసీ ప్రత్యేక సమావేశంలో ప్రకటన

**హైదరాబాద్, ప్రభాతవార్త, మే 3:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలను పరిష్కారానికి ప్రభుత్వం హామీ ఇవ్వడంతో.. తెలంగాణ ఉద్యోగ, అధికార, ఉపాధ్యాయ, కార్మిక పెన్షనర్ల ఐక్య కార్యాచరణ సమితి (టిజిఈజేఏసీ) మీడియా వేదికగా ఆదివారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది. శనివారం ముఖ్యమంత్రితో జరిగిన సమావేశంలో ఉద్యోగుల చిరకాల వాంఛలైన పీఆర్సీ, ఆరోగ్య కార్డులు, పెండింగ్ బకాయి లపై ముఖ్యమంత్రి చూపిన చిత్తశుద్ధి, ప్రకటించిన కార్యాచరణ హర్షణీయమని జేఏసీ ఛైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం టిజిఈజేఏసీ నేతలు టిఎన్‌జీవో భవన్‌లో మీడియాతో మాట్లాడారు. పీఆర్సీ నివేదికను వెంటనే సమర్పించాలని శివశంకర్ కమిటీని ముఖ్యమంత్రి ఆదేశించారని, ఈ నివేదిక ఆధారంగా జేఏసీ నేతలతో చర్చించి వేతన పెరుగుదల (ఫిట్మెంట్) ప్రకటించబడుతుందని తెలిపారన్నారు. పెండింగ్ డీఏల బకాయిలు కలుపబడుతాయని స్పష్టం చేయడం జరిగిందన్నారు. దశలవారీగా ఉద్యోగులకు వర్తింప చేస్తమన్నారు. జూన్ 1వ తేదీలోగా రాష్ట్రంలోని ఉద్యోగులందరికీ కొత్త ఆరోగ్య భద్రత కార్డులు(ఈహెచ్ఎస్) అందజేస్తామని హామీ ఇచ్చారని, దీన్ని ప్రభుత్వ వ్యవస్థలో పనిచేస్తున్న అన్నీ వర్గాలకి దశల వారీగా ఉద్యోగులకు వర్తింప చేస్తామన్నారని తెలిపారు. పెన్షనర్లకు సంబంధించి రూ.6,000 కోట్ల బకాయిలను రాబోయే 100 రోజుల్లో చెల్లిస్తామని స్పష్టమైన గడువును ప్రకటించారని, దాంతోపాటు పెండింగ్‌లో ఉన్న ఇతర బకాయిల చెల్లింపుల కోసం ప్రతి నెల వెయ్యి కోట్ల రూపాయల కేటాయింపులు కొనసాగిస్తామన్నరని తెలిపారు. సీపీఎస్‌పైన కూడా విధాన నిర్ణయం తీసుకుంటామని అలాగే సెప్టెంబర్ 1, 2004 కంటె ముందూ నోటిఫికేషన్ ద్వారా నియామితులైనా ఉద్యోగులకు వెంటనే పాత పింఛను పథకం(ఓపీఎస్)ను అమలు చేయలనగా దానిపై ఉప ముఖ్యమంత్రితో చర్చించి నిర్ణయం తీసుకుందామని చెప్పారన్నారు. జేఏసీ తరపున ప్రభుత్వం ముందు ఉంచిన మొత్తం 63 డిమాండ్లలో ఇప్పటికే 26 డిమాండ్లు పూర్తిగా, పాక్షి కంగా నెరవేరాయన్నారు. మిగిలిన 37 డిమాండ్ల పరిష్కారం కోసం కూడా ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందని ఆశిస్తున్నామన్నారు. ఇందు కోసం ప్రతి రెండు నెలలకు ఒకసారి ఖచ్చితంగా ఉన్నతాధికారులతో జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ మీటింగు జరిగేటట్లు స్పష్టమైనా ఆదేశాలు ప్రధాన కార్యదర్శికి ఇస్తామని సీఎం హామీ ఇచ్చారన్నారు.ఉద్యోగులకు పదోన్నతులు కల్పించడంలో జరుగుతున్న జాప్యాన్ని నివారించేందుకు ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 1 నుండి ఆగష్టు 31 వరకు ఏర్పడే ఖాళీలన్నింటినీ పరిగణనలోకి తీసుకుని, డిపార్ట్ మెంటల్ ప్రమోషన్ కమిటీ ఒకసారి ఆమోదించాలని ప్రతిపా దించామన్నారు. దీనివల్ల ఏర్పడిన ఖాళీలను ప్రతిసారీ కొత్తగా డీపీసీ నిర్వహించే అవసరం లేకుండా, అర్హులైన ఉద్యోగులకు వెంటనే పదోన్నతులు లభిస్తాయన్నారు. ఈ ప్రక్రియను వేగవంతం చేసేందుకు ఉన్నతాధికా రులు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. మీడియా సమా వేశంలో జేఏసీ నాయకులు సదానంద గౌడ్, ఏ. వెంకట్, కటకం రమేష్, మధుసూదన్ రెడ్డి, ఎం.బి. కృష్ణ యాదవ్, వినోద్ కుమార్, ఉమా దేవి, శైలజ పాల్గొన్నారు.

# రామగుండం కోల్ మైన్‌కు పర్యావరణ అనుమతులు

### 314.98 మిలియన్ టన్నుల లక్ష్యం

### యేడాదికి 210 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి

### రూ. 2,194 కోట్ల మూల పెట్టుబడులు

### బొగ్గు గరిష్ఠ వినియోగానికి వినూత్న ప్రణాళిక

### సింగరేణి సిఎండి డాక్టర్ బుద్ధప్రకాష్

**హైదరాబాద్, మే 3, ప్రభాతవార్త:** సింగరేణి సంస్థ ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న వినూత్నమైన రామగుండం కోల్ మైన్ ప్రాజెక్టుకు ఎట్టకేలకు కేంద్ర పర్యావరణ శాఖ ప్రాథమిక అనుమతులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ నుండి తమకు సమాచార వచ్చినట్లు సింగరేణి సిఎండి డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటనలో సింగరేణి చరిత్రలోనే అత్యధికంగా ఏడాదికి 210 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సామర్థ్యంతో ఈ ప్రాజెక్టుకు రూపకల్పన చేశామన్నారు. మూతపడుతున్న పాత గనుల ఉత్పత్తిని భర్తీ చేయడానికి, ఇప్పటికే కనీస అనుమతులు ఉన్న 2 ఓపెన్ కాస్ట్ గనులు, 3 భూగర్భ గనుల పరిధిలో 314.98 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలను ఉత్పత్తి చేయడానికి ఈ ప్రాజెక్టును రూపొందించినట్లు చెప్పారు.

ఇక్కడ ఉత్పత్తి చేసే బొగ్గు ప్రధానంగా రామగుండం ఎన్టీపీసీతో పాటు, ఇతర బొగ్గు ఆధారిత పరిశ్రమలకు ఇంధన సరఫరా ఒప్పందం ప్రకారం సరఫరా చేయనున్నట్లు వెల్లడించారు. మూతపడిన జీడీకే10 ఇంక్లైన్, మూతపడనున్న వకీల్‌పల్లి భూగర్భ గనులను ఓపెన్ కాస్ట్ గనులుగా మార్చి అక్కడ మిగిలి ఉన్న బొగ్గును సంపూర్ణంగా వెలికి తీయడంతో పాటు, వీటికి ఆనుకొని ఉన్న రామగుండం ఓపెన్ కాస్ట్ 1 విస్తరణ ప్రాజెక్టు ఫేజ్ 2, రామగుండం ఓపెన్ కాస్ట్2, అడ్రియాల షాఫ్ట్ అండర్ గ్రౌండ్‌లో మిగిలిన బొగ్గును కూడా గరిష్టంగా వెలికి తీయడం కోసం వీటన్నింటిని కలిపి రామగుండం కోల్ మైన్ ప్రాజెక్టుకు రూపకల్పన చేసినట్లు వివరించారు. ఇప్పటికే ఉన్న అనుమతులను సద్వినియోగం చేస్తూ తక్కువ పెట్టుబడులతో, పర్యావరణకు ఎటువంటి ఇబ్బంది లేకుండా బొగ్గు ఉత్పత్తి చేయడమే లక్ష్యంగా దీన్ని రూపొందిం చామన్నారు.

ఈ నేపథ్యంలో ఓపెన్ కాస్ట్ గనుల ప్రాంతం నుండి 182.28 మిలియన్ టన్నుల బొగ్గు, భూగర్భ గనుల ప్రాంతం నుండి 132.70 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉత్పత్తి చేయనున్నట్లు పేర్కొన్నారు. ఇక్కడి సగటు బొగ్గు గ్రేడు జీ10 గా గుర్తించబడిందని తెలియచేశారు ఈ మొత్తం ప్రాజెక్టుకు 4326.08 హెక్టార్ల విస్తీర్ణం గల భూమి అవసరం ఉందన్నారు. ఈ ప్రాజెక్టులో మొత్తం 5,403 మంది సింగరేణి ఉద్యోగులు గాను, మరో 600 మంది కాంట్రాక్టు సిబ్బందిగా పని చేయనున్నట్లు ఆయన తెలిపారు. మొత్తం 2,194.05 కోట్ల రూపాయల మూల పెట్టుబడులతో ఈ ప్రాజెక్టును ప్రారంభించనున్నారు. రామగుండం రీజియన్ లోని 3 ఏరియాలలో కొన్ని పాత గనులు మూతపడుతున్నందువల్ల సింగరేణి సంస్థ ఆ గనుల్లోని ఉద్యోగులకు వేరే చోట పని కల్పించడానికి, బొగ్గు ఉత్పత్తి లోటు తీర్చడానికి ఈ ఆర్.జి కోల్ మైన్ ఒక వరంగా మారనున్నదని చెప్పారు.

### 12.38లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు

### 1129.43కోట్ల మేర చెల్లింపు

**హైదరాబాద్, మే 3, ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ వేగంగా కొనసాగుతోందని పౌరసరఫరాలశాఖ పేర్కొంది. ఈ రబీ సీజన్‌కు సంబంధించి ఇప్పటివరకు 12.38 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని విజయవంతంగా కొనుగోలు చేసి, రైతుల ఖాతాల్లో నగదు జమ చేసినట్లు పేర్కొంది. ఈ విషయమై పౌరసరఫరాలశాఖ కమిషనర్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రైతుల నుండి కొనుగోలు చేసిన ధాన్యం తాలూకు రూ.1129.43 కోట్లను చెల్లింపులు చేసినట్లు వివరించారు. భారీగా వస్తున్న ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు మొత్తం 8,575 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని వివరించారు. వీటిలో 4,350 ప్యాక్స్ కేంద్రాలు, 3,563 ఐకేపీ, ఇతర సంస్థల ద్వారా 662 కేంద్రాలు నడుస్తున్నాయని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వలు పేరుకుపోకుండా, కొన్న ధాన్యాన్ని అధికారులు ఎప్పటికప్పుడు వేగంగా తరలిస్తున్నారని వివరించించారు.

# వ్యవసాయ గట్ల మీద సోలార్ పంట

**హైదరాబాద్, మే 3, ప్రభాత వార్త:** తెలంగాణలోని రైతులు ఇక నుంచి తమ పంట పొలాల లోని గట్టు మీద సాధారణ పంటలకు భిన్నంగా సోలార్ పంట పండించొచ్చు. అందుకు అనుగుణంగా అధికారులు విధివిధానాలు రూపొందించారు. ఇందుకు గాను రైతుల వ్యవసాయ పొలం గట్లపై సోలార్ యూనిట్లను ఏర్పాటు చేయనుంది. రైతులు తమ వ్యవసాయ పొలాల్లో సోలార్ తెలంగాణ ప్రభుత్వం కల్పిస్తోంది. బీడు భూములు లేదా పొలం గట్లపై ప్లాంట్ల ఏర్పాటు ద్వారా అదనపు ఆదాయం పొందే అవకాశం ఉందని అధికార వర్గాలు చెబుతున్నారు. ప్రధానంగా రైతుల పొలాల్లో సోలార్ ప్లాంట్లు నిమత్తం లోడు తక్కువగా ఉన్న సబ్‌స్టేషన్ల ప్రాంతాల్లో ఏర్పాటుకు అవకాశం పరిశీలనలో ఉంది. ప్రధానంగా అన్నదాతలు సొంతంగా లేక ఏదైనా సహకార స్వయం సహాయక సంఘం, కంపెనీల భాగస్వామ్యంతో తమ వ్యవసాయ పొలాల్లో సోలార్ ప్లాంట్లు ఏర్పాటుకు అధికారులు చర్యలు చేపట్టారు. ప్రధానమంత్రి కిసాన్ ఊర్జ సురక్ష ఏవం ఉత్తాన్ మహాభియాన్ కింద పొలం గట్లపై లేదా బీడుభూముల్లో ఈ కేంద్రాల ఏర్పాటు చేసుకోవచ్చు. వీటి ద్వారా రైతులకు అదనంగా ఆదాయం పొందొచ్చు. ఈ పథకాన్ని తెలంగాణలో అమలుకు కేంద్రంఅనుమతి ఇచ్చింది. దీంతో రైతుల పొలాల్లో 4వేల సోలార్ ప్లాంట్లను వచ్చే మార్చిలోగా ఏర్పాటుచేసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

# రైస్ మిల్లర్లను ఆదుకోండి

### రాష్ట్ర రైస్ మిల్లర్ల వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు పాడి గణపతి

**హైదరాబాద్, మే 3, ప్రభాతవార్త:** సిఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) కోసం వెంటనే మిల్లులకు ధాన్యం కేటాయించాలని ప్రభుత్వాన్ని రాష్ట్ర రైస్‌మిల్లర్ల వెల్ఫేర్‌అసోసియేషన్ అధ్యక్షుడు పాడి గణపతి కోరారు. రాష్ట్రంలో రైస్ మిల్లింగ్ పరిశ్రమ చాలా కష్టాల్లో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై ఆదివారం ఆయన ఒకప్రకటన విడుదల చేశారు. తెలంగాణ వ్యాప్తంగా 350 నుంచి 400 రైస్ మిల్లులు 100 శాతం బియ్యం సరఫరా చేసి 25 శాతం పెనాల్టీ, 12 శాతంవడ్డీలేని డిఫాల్ట్ లిస్టులో ఉన్నట్లు తెలిపారు.

# గ్రే హౌండ్స్, ఎస్ఐబి విభాగాల సిబ్బందిలో కోత?

**హైదరాబాద్, మే 3, ప్రభాతవార్త:** మావోయిస్టుల కట్టడిలో పోలీసు శాఖలో మూడున్నర దశాబ్దాలుగా కీలకంగా వ్యవహరించిన గ్రే హౌండ్స్, స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబి) మారిన పరిస్థితుల్లో రూపాంతరం చెందనున్నాయి. ఈ రెండు విభాగాల్లో వున్న సిబ్బందిలో సగం వ రకు ఇతర విభాగాల్లో బదిలీ చేసేందుకు సర్కారు నిర్ణయించింది. వాస్తవానికి ఈ రెండు విభాగాలలో వున్న వారంతా డిప్యూటేషన్‌పై వున్న వా రే కావడం గమనార్హం. ఎసిబి, నిఘా విభాగం, విజిలెన్స్ తరహాలో రెండు లేదా మూడేళ్ల పాటు డిప్యూటేషన్‌పై వచ్చి ఆ తరువాత తమ సొం త విభాగాలకు వెళుతుంటారు. అయితే కొత్తగా పోలీసు శాఖలో చేరిన వారు శిక్షణ పూర్తయి విధుల్లో చేరేముందు రెండు నుంచి నాలుగు నెలల పాటు గ్రే హౌండ్స్‌లో శిక్షణ పొందడం ఆనవాయితీగా వస్తోంది. కానిస్టేబుల్ నుంచి ఐపిఎస్ వరకు ఈ నిబంధన కచ్చితంగా అమలవుతోంది. ఇక్కడకు వచ్చిన వారికి నక్సల్స్ ఏరివేతలో శిక్షణ ఇవ్వడంతో పాటు మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలలో కొన్ని నెలల పాటు విధుల్లో వుండే లా చేయడం ద్వారా నక్సలైట్ల సమస్యపై వారికి అవగాహన కల్పిస్తుంటారు. ఇక ఎస్ఐబి వరకు వస్తే ఈ విభాగం కేవలం నక్సలైట్లకు సంబం ధించిన సమాచారం సేకరణ వరకే పరిమితమైందని చెప్పాలి. ఆయా జిల్లాలలో మావోయిస్టుల గురించి సమాచారం సేకరించడంలో ఆరితేరిన వారిని ఇందులో నియమిస్తారు. అయితే ఆపరేషన్ కగార్ పూర్తయిన తరువాత మావోయిస్టులు వేల సంఖ్యలో లొంగిపోవడం, ఇదే సమయం లో పదుల సంఖ్యలో నక్సలైట్లు ఎన్‌కౌంటర్‌లో చనిపోవడం తెలిసిందే. ఆయుధాలు కూడా వందల సంఖ్యలో పట్టుబడడం లేదా లొంగిపోయి న వారు పోలీసులకు అప్పగించడం జరిగింది. మావోయిస్టులకు పట్టుగా వున్న ఛత్తీస్‌ఘఢ్‌లోనే ఇప్పుడు నక్సలైట్ల సమస్య లేదని ఆ రాష్ట్ర స ర్కారు ప్రకటించింది. ఈ రాష్ట్రానికి సరిహద్దుగా వున్న తెలంగాణలో ఆరు నెలల క్రితమే నక్సలైట్ల సమస్య కనుమరుగవగా రెండు నెలల క్రిత ం రాష్ట్రం మావోయిస్టు రహితంగా మారిందని నాటి డిజిపి శివధర్ రెడ్డి ప్రకటించారు. దీంతో మావోయిస్టుల ఏరివేతకు వున్న గ్రే హౌండ్స్ ఎస్ఐబి విభాగాలను ఏంచేయాలనే దానిపై సర్కారు మల్లగుల్లాలు పడి చివరకు ఈ రెండు విభాగాల్లో వున్న సిబ్బందిని సగానికి కుదించాలని నిర్ణయించింది. భవిష్యత్ అవసరాల రీత్యా ఈ రెండు విభాగాలు యధాతథంగా వుంచాలని నిర్ణయించిన సర్కారు ఇక్కడ పనిచేస్తున్న సిబ్బంది ని ఈగల్, సైబర్ విభాగాలకు బదిలీ చేయాలని నిర్ణయించింది. అయితే మావోయిస్టుల ఏరివేతతో పోలిస్తే డ్రగ్స్ కట్టడి, సైబర్ నేరాల నివార ణ భిన్నంగా వుండే వీలుండడంతో వీరికి శిక్షణ ఇచ్చి కొత్త విధుల్లో చేర్చేందుకు సర్కారు నిర్ణయించినట్లు తెలిసింది. అయితే కొత్తగా పోలీసుశాఖలో చేరేవారికి గ్రేహౌండ్స్‌లో ఇచ్చే శిక్షణ యధావిధిగా కొనసాగించేందుకు సర్కారు నిర్ణయించినట్లు తెలిసింది. అయితే ఈశిక్షణను ఇదివరకటిలా కాకుండా కొంత తగ్గించి కొనసాగించాలని సర్కారు యోచనగా కనిపిస్తోంది.ఇక ఎస్ఐబిని కూడా ఎప్పటిలాగే కొనసాగించి అందులోని సిబ్బందిని కొంతమేర తగ్గించి భవిష్యత్ అవసరాల కోసం దీనిని వాడుకోవాలని సర్కారు నిర్ణయించినట్లు తెలిసింది.

# పోషకాహార కేంద్రాలుగా అంగన్వాడీలు

## పోషణ్ వాటికలో కూరగాయలు, పండ్ల విత్తనాల కిట్లు

**హైదరాబాద్, మే 3, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలు త్వరలోనే చిన్న తరహా పోషకాహార కేంద్రాలుగా మారనున్నాయి. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పోషణ్ వాటిక కార్యక్రమంలో భాగంగా ఈ కేంద్రాలకు కూరగాయలు, పండ్ల విత్తనాలతో కూడిన కిట్లు అందించనున్నారు. ఈ విత్తన కిట్‌లలో పాలకూర, తోటకూర, టొమాటో, వంకాయ, బెండకాయ, మెంతికూర వంటి పౌష్టిక కూరగాయలు ఉంటాయి. నిర్వాహకులు కేంద్రం అందించే ఈ విత్తనాలను అంగన్‌వాడీ కేంద్రాల్లోనే పంట పండించి. వాటి నుంచి వచ్చిన కూరగాయలతోనే చిన్నారు, గర్భిణీలకు ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించనున్నారు. చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు అంగన్‌వాడీ కేంద్రాల్లోనేపండిన తాజా, ఆరోగ్యకరమైన ఆహారం అందించడమే లక్ష్యంగా కేంద్రం ఈ తోటల పద్దతిని అమలు చేస్తోంది. ఇది జాతీయ పోషణ మిషన్‌కు




అనుబంధంగా తీసుకున్న కీలక ముందడుగు. ఈ కార్యక్రమంలో భాగంగా మొదటి విడతలో రాష్ట్రవ్యాప్తంగా 4,500 అంగన్‌వాడీలకు ఈ విత్తన కిట్‌లుఅందనున్నాయి. రాష్ట్రంలో 35,000కి పైగా అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, ఇవి ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్ మెంట్ స్కీమ్ కింద పిల్లలు, మహిళలకు పోషణ సేవలు అందిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో పిల్లలు తరచూ పోషకాహార లోపంతో బాధ పడుతున్న నేపథ్యంలో, ఈ చర్యలు వారికి నేరుగా మేలు చేస్తాయి.ఇక, పంటల తోటకు స్థలం లేని పట్టణ ప్రాంతాల్లో మొబైల్ అంగన్‌వాడీలు ప్రారంభించనున్నారు. ఇవి వారానికి రెండు సార్లు పోష కాహారాన్ని పిల్లలకు అంది స్తాయి. ఇంతకు ముందు తెలం గాణ ప్రభుత్వం తెలంగాణ న్యూట్రిషన్ ప్లాన్స్‌ను ప్రారంభించింది. దానికింద ప్రతి రోజు 200 గ్రాముల పాలు, పల్లీలు, మిల్లెట్ బార్లు, వారానికి రెండుసార్లు ఎగ్ బిర్యానీ అందిస్తోంది. ప్రభుత్వం ఇప్పటికే గ్రామీణ ప్రాంత ప్రజల్లో పోషకాహారంపై అవగాహన పెంచేందుకు స్వచ్ఛంద సంస్థల సహకారాన్ని తీసుకుంటోంది.

# వ్యర్థాల నుంచి గ్యాస్

## రూ.1,500 కోట్లతో 20 బయో ప్లాంట్లు

**హైదరాబాద్, మే 3, ప్రభాతవార్త:** వ్యర్థాలను కాల్చడం వల్ల నేల ఆరోగ్యం, పంటల నాణ్యత నశించడమే కాక, గాలి కాలుష్యం కూడా పెరిగిపోతోంది. ఈ నేపథ్యంలో పర్యావరణ పరిరక్షణను లక్ష్యంగా పెట్టుకుని తెలంగాణ రాష్ట్రం పంట వ్యర్థాల నుంచి బయోగ్యాస్ తయారీ దిశగా శక్తివంతమైన అడుగు వేసింది. రాష్ట్రవ్యాప్తంగా రూ.1,500కోట్ల వ్యయంతో 20 బయో గ్యాస్ ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు ఇప్పటికే ఒప్పందాలు కుదిరాయి. ప్రతి ప్లాంట్‌కు రోజుకు 15 టన్నుల ఉత్పత్తి సామర్థ్యం కలిగి ఉంటుందని ఒప్పందాల్లో ప్రతిపాదించారు. ఇలా మొత్తం రోజువారీ ఉత్పత్తి లక్ష్యం 225 టన్నులుగా ఉంది. ఇక ఈ ప్లాంట్లకు ఏటా 7.5 లక్షల మెట్రిక్ టన్నుల వరి గడ్డి వినియోగించనున్నారు. తద్వారా ఉత్పత్తి చేయబోయే బయోగ్యాస్ 82,125 టన్నులుగా ఉంటుందని పేర్కొన్నారు. అంతేకాకుండా 3 లక్షల టన్నుల సేంద్రియ ఎరువు ఉత్పత్తి అవుతుంది. ఈ ప్రాజెక్టుల ద్వారా 57.84 లక్షల ఎల్‌పిజి సిలిండర్లకు సమానమైన బయో గ్యాస్ ఉత్పత్తి జరుగుతుందని అంచనా. ఈ ప్రాజెక్టులను మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట, కరీంనగర్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, ఖమ్మం, సూర్యా పేట, నల్లగొండ, యాదాద్రి, వనపర్తి, మహబూబ్‌నగర్, కామారెడ్డి, నిజామా బాద్ జిల్లాల్లో ఏర్పాటుచేయాలని నిర్ణయించినట్లు అధికారవర్గాలు వెల్లడించాయి.



# ఎన్నికల ఫలితాలకుముందే ఇల్లు ఖాళీచేస్తున్న సిఎం మమతా బెనర్జీ

**కోల్‌కత్తా, మే 3:** పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ పూర్తికాకముందే, ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తన నివాసాన్ని ఖాళీ చేస్తున్నారన్న వార్త రాజకీయ దుమారం రేపింది. సాధారణంగా ఎన్నికల ఫలితాలు వెలువడి, గెలుపోటములు ఖరారైన తర్వాతే ముఖ్యమంత్రులు తమ నివాసాల మార్పుపై నిర్ణయం తీసుకుంటారు. కానీ, బెంగాల్ ఫైర్ బ్రాండ్ మమతా బెనర్జీ ఫలితాలకు ముందే తన నివాసాన్ని ఖాళీ చేయడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. కోల్‌కతాలోని కాళీఘాట్‌లో ఉన్న ఆమె ఇల్లు వాస్తవానికి ఒక చిన్న గది వంటిది. ఆమె ముఖ్యమంత్రి అయినప్పటికీ, విలాసవంతమైన అధికారిక బంగ్లాకు వెళ్ల కుండా అక్కడే నివసించడం ఆమె నిరాడంబరతకు నిదర్శనంగా నిలిచింది. మమతా బెనర్జీ తన పూర్వ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్జీ తరహాలోనే సాధారణ జీవితాన్ని గడపడానికి ఇష్టపడతారు. ఆమె నివసిస్తున్న ఇల్లు చాలా చిన్నది కావడంతో భద్రతా సిబ్బంది గతంలోనే ఆమెకు హెచ్చరికలు జారీ చేశారు. భద్రతా కారణాల దృష్ట్యా అధికారిక నివాసానికి మారాలని అధికారులు పలుమార్లు కోరినా, ఆమె తన కాళీఘాట్ నివాసాన్ని వీడటానికి ఇష్టపడలేదు. ఇప్పుడు అకస్మాత్తుగా ఆమె ఇల్లు ఖాళీ చేస్తున్నారనే వార్తలు రావడంతో, ఇది రాజకీయ వ్యూహమా లేక వ్యక్తిగత నిర్ణయమా అనే కోణంలో విశ్లేషణలు మొదలయ్యాయి. ఈ నిర్ణయం వెనుక ఉన్న అసలు కారణం ఏంటన్నది ఇంకా స్పష్టంగా తెలియలేదు. కొందరు దీనిని ఎన్నికల ఫలితాలపై ఆమెకు ఉన్న ముందస్తు సంకేతంగా భావిస్తుంటే, మరికొందరు మాత్రం భద్రతా పరమైన మార్పుల్లో భాగంగానే ఇది జరుగుతోందని అంటున్నారు. ఏది ఏమైనా, బెంగాల్ ఎన్నికల ఫలితాల వేళ మమతా బెనర్జీ తీసుకున్న ఈ నిర్ణయం హాట్ టాపిక్‌గా మారింది.

# నేటి నుండి రైతు వారోత్సవాలు

## తాండూరులో నేడు ప్రారంభించనున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, మే 3, ప్రభాతవార్త:** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ప్రజాపాలనా - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా రైతు వారోత్సవాలకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ నెల 4 నుంచి 9 వరకు రాష్ట్రవ్యాప్తంగా రైతు వారోత్సవాలు నిర్వహించనున్నారు. రైతు వారోత్సవాలను సోమవారం తాండూరులో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పారంభించనున్నారు. ఈ సందర్భంగా టిజి ఆర్గానిక్స్ యాప్‌ను ఆవిష్కరించనున్నారు. రైతు వారోత్సవాల్లో భాగంగా ఒక్కో రోజు ఒక్కో అంశంపై రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు కార్యక్రమ నిర్వహణపై కలెక్టర్, నోడల్ ఆఫీసర్లతో మంత్రి తుమ్మల మాట్లాడారు. అన్ని శాఖలు సమన్వయంతో కార్యక్రమం విజయవంతం చేయాలని సూచించారు. చివరి రైతు వరకు ప్రభుత్వ పథకాలు చేరవేసే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. వారోత్సవాల్లో భాగంగా మట్టి ఆరోగ్యం, సహజ వ్యవసాయంపై అవగాహన కల్పిస్తామని వివరించారు. మైక్రో ఇరిగేషన్‌పై రైతులకు సూచనలు ఇస్తామన్నారు. మార్కెట్ లింకేజీలు, రుణాలపై వివరాలు చేరవేస్తామని తెలిపారు. డ్రోన్స్, యాంత్రీకరణ ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని చెప్పుకొచ్చారు. సాంకేతిక వినియోగంపై అవగాహన కల్పిస్తామని, పశువుల ఆరోగ్యం, వేసవి ఉత్పత్తిపై రైతన్నలకు శిక్షణ ఇప్పిస్తామన్నారు. వానాకాలానికి ముందస్తు సాగునీటి చర్యలు చేపడుతున్నామని.. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్లు, నోడల్ అధికారులు పర్యవేక్షిస్తారని వివరించారు.

# సిఎం,మంత్రులు రోడ్లపై తిరగలేరు

## విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తాం

### సీఎం రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బహిరంగ లేఖ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మే3:** తెలంగాణలో ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకంపై రాజకీయ దుమారం చెలరేగింది. ఈ పథకాన్ని రద్దు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆదివారం బహిరంగ లేఖ రాశారు. ప్రభుత్వం జారీ చేసిన జీవో 7ను వెంటనే ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో విద్యార్థులతో కలిసి రాష్ట్రవ్యాప్త ఆందోళనలు చేపడతామని అన్నారు. సీఎం, మంత్రులు రోడ్లపై తిరగలేరని ఆయన హెచ్చరించారు. రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలనలో విద్యావ్యవస్థను పూర్తిగా కుప్పకూల్చారని కేటీఆర్ తన లేఖలో తీవ్రస్థాయిలో విమర్శించారు. 'ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 7 ముమ్మాటికి ఫీజుల పథకానికి పాతరేసేందుకు చేస్తున్న కుటిల ఎత్తుగడ. దీనివల్ల 14 లక్షల మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలోకి వెళ్తుంది. ఇది నిరుపేద విద్యార్థులను ఉన్నత చదువులకు దూరం చేసే వెన్నుపోటు చర్య' అని కేటీఆర్ ఆగ్రహించారు. విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టే ఈ జీవోను వెంటనే వెనక్కి తీసుకుని, విద్యార్థి లోకానికి క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రవేశపెట్టిన ఈ పథకాన్ని కేసీఆర్ ప్రభుత్వం రాజకీయాలకు అతీతంగా కొనసాగించిందని గుర్తుచేశారు. కానీ, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఈ పథకానికి గ్రహణం పట్టిందని విమర్శించారు. గత రెండున్నరేళ్లుగా సుమారు 10వేల కోట్ల రూపాయల ఫీజు బకాయిలను చెల్లించలేదని, ఇప్పుడు విద్యార్థుల ఖాతాల్లో నేరుగా డబ్బులు వేస్తామంటే ఎవరూ నమ్మరని కేటీఆర్ అన్నారు. బకాయిలు పేరుకుపోవడంతో 2500కు పైగా కళాశాలల యాజమాన్యాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని తెలిపారు. నిధులుఅడిగిన వారిని వన్‌టైమ్ సెటిల్‌మెంట్, టోకెన్ పేరుతో మభ్యపెట్టారని, నిరసన తెలిపితే విజిలెన్స్ దాడులతో బెదిరించారని ఆరోపించారు.

# డిగ్రీలో కొత్త కోర్సులకు సిలబస్ రూపకల్పన!

## నేడు యూనివర్సిటీల బీవోఎస్‌లతో చర్చ

### ఉపాధి కల్పించడమే ప్రధాన లక్ష్యం: ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి

**హైదరాబాద్, ప్రభాతవార్త, మే3:** తెలంగాణ రాష్ట్రంలో రానున్న 2026-27 విద్యా సంవత్సరంలో డిగ్రీలో కొత్తగా 15 కోర్సులను ప్రవేశ పెట్టనున్నారు. డిగ్రీ చదివిన విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా కొత్త కోర్సులను ప్రారంభించనున్నారు. కొత్తగా ప్రారంభించనున్న కోర్సులకు సంబంధించి ఏ ఏ కాలేజీల్లో ప్రారంభించాలనుకుంటున్నారో దరఖాస్తు చేసుకోవాలని ఉన్నత విద్యా మండలి దరఖాస్తులను ఆహ్వానించింది. రాష్ట్ర వ్యాప్తంగా కొత్త కోర్సులను ప్రారంభించడానికి 142 కాలేజీల నుంచి దరఖాస్తులు వచ్చినట్టు ఉన్నత విద్యా మండలి తెలిపింది. కొత్త కోర్సుల్లో డిఫెన్స్, సెక్యూరిటీ, ఏవియేషన్, డేటా సైన్స్, ఫైనాన్షియల్ టెక్నాలజీ, రూరల్ మేనేజ్‌మెంట్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి కొత్త కోర్సులను ప్రవేశపెడుతోంది. ఈ కోర్సులు ఇంటర్న్‌షిప్‌లతో కూడిన డిగ్రీలుగా ఉంటాయి. బీఏలో డిఫెన్స్ అండ్ సెక్యూరిటీ స్టడీస్, లాండ్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్, సైబర్ సెక్యూరిటీ అండ్ సైబర్ గవర్నెన్స్, బీబీఏలో హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ హెల్త్ మేనేజ్‌మెంట్, ఎయిర్‌పోర్ట్, ఎయిర్‌లైన్స్, ఏరోస్పేస్ మేనేజ్‌మెంట్, మేరటైమ్ టెక్నాలజీ, కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్, ఫుడ్ టెక్నాలజీ, ఫుడ్ సెక్యూరిటీ అండ్ మేనేజ్‌మెంట్, ట్రావెల్, టూరిజమన అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్, స్పేస్ టెక్నాలజీ, స్పేస్ కామర్స్ అండ్ స్పేస్ మేనేజ్‌మెంట్, బీకామ్‌లో ఫైనాన్స్ టెక్నాలజీ, ఇంటర్నేషనల్ బ్యాంకింగ్, ఫైనాన్స్ అండ్ అకౌంట్స్, ఈ కామర్స్, ఎం కామర్స్ అండ్ డిజిటల్ మార్కెటింగ్, బీఎస్సీలో డాటా సైన్స్ అండ్ ఏఐఎంఎల్(హానర్స్), క్లయిమేట్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్, డిజిటల్ ఫోర్సెనిక్ సైన్స్ అండ్ సైబర్ సెక్యూరిటీ(హానర్స్) కోర్సులను ప్రారంభించనున్నారు. ఈ కోర్సుల గురించి ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి వార్త ప్రతినిధితో మాట్లాడుతూ.. కొత్తగా ప్రారంభించనున్న కోర్సులను విద్యార్థులు డిగ్రీ కోర్సులు పూర్తికాగానే ఉపాధి లక్ష్యంగా ఉండాలని రూపొందించామన్నారు. కొత్త కోర్సుల్లో 90 శాతానికిపైగా కోర్సులకు ప్రాథమికంగా సిలబస్ ఎలా ఉండాలనేది ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు.

నేడు(సోమవారం) యూనివర్సిటీల బోర్డు ఆఫ్ స్టడీస్(బీవోఎస్) చైర్‌పర్సన్లతో సమావేశం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. వారిలో చర్చించిన తరువాత కొత్త కోర్సులకు సిలబస్‌ను ఫైనల్ చేయనున్నట్టు తెలిపారు. సిలబస్‌ను రూపొందించడమే కాకుండా.. కొత్త కోర్సులకు స్టడీ మెటీరియల్ కూడా తయారు చేసినట్టు తెలి పారు. కొత్త కోర్సుల సిలబస్, మెటీరియల్ తోపాటు ఆయా కోర్సులను చదవడం వలన కలిగే లాభాలు ఎలా ఉంటాయనేది, అలాగే కోర్సులు పూర్తి అయిన తరువాత ఎక్కడెక్కడ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కుతాయనే వాటిని కూడా రూపొందించినట్టు తెలిపారు. కొత్త కోర్సులకు సంబంధించి బోధన అధ్యాపకులు, ఫీజులను త్వరలోనే నిర్ణయించాల్సి ఉందని తెలిపారు.

# ఎండలో కష్టం.. యాప్‌తో నష్టం

## పౌడర్ రాసుకుంటేనే ఉపాధి కూలి, నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్ యాప్‌తో కూలీల కష్టాలు

**హైదరాబాద్, మే 3, ప్రభాతవార్త:** ఉపాధిహామీ పథకం నిర్వహణలో తాజాగా అమల్లోకి వచ్చిన కొన్ని నిబంధనలు కూలీల ఉపాధిని కష్టతరం చేస్తున్నాయి. ఎండలో కాయకష్టం చేసే ఉపాధి హామీ కూలీలు, ఇప్పుడు తమ పనిముట్లతోపాటు పౌడర్ డబ్బాలను కూడా వెంట తీసుకెళ్లడం అని వార్యమైంది. పథకం అమలులో పారదర్శకతను పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొత్తగా నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్ యాప్‌ను ప్రవేశపెట్టింది. అయితే ఈ యాప్ నిబంధనలు ఇప్పుడు ఉపాధి కూలీలను ముప్పుతిప్పలు పెడుతున్నాయి. తెలంగాణ రాష్ట్రంలో దాదాపు 107.08లక్షల మందికి మించి ఉపాధిహామీ కార్మికులు ఉన్నారు. మొత్తం 52.22లక్షల ఉపాధిహామీ జాబ్‌కార్డులు జారీ అయ్యాయి. కొత్త నిబంధనల మేరకు రెండు పూటలా ఉపాధి కూలీల ఫోటోలను అప్‌లోడ్ చేయడంతోపాటు ఫేస్ అథెంటికేషన్ హాజరును నమోదు చేయాలి. అయితే ప్రస్తుతం భగ్గుమనే ఎండల్లో పని చేయడం వల్ల కూలీల ముఖాలు చెమటతో జిడ్డుగా, నల్లగా మారుతున్నాయి. దీనివల్ల ఫేస్ అథెంటికేషన్ యాప్ ముఖాన్ని గుర్తించక హాజరు నమోదు కావడం లేదు. దీంతో వేతనం కోల్పోయే ప్రమాదం పొంచి ఉండడంతో అక్కడి సిబ్బంది కూలీలను ముఖానికి పౌడర్ రాసుకోవాలని సూచిస్తున్నారు. పౌడర్ రాసుకుని తెల్లగా మారిన ముఖాలను ఫోన్ కెమెరాకు చూపిస్తేనే అటెండెన్స్ పడుతోంది. దీంతో రాష్ట్రంలోని ఆదిలాబాద్, ఆసిఫాబాద్ వంటి మారుమూల ఏజెన్సీ ప్రాంతాలతోపాటు మైదాన ప్రాంత జిల్లాల్లోనూ ఉపాధి కూలీలు వెంట పౌడర్‌ను తీసుకెళ్లాల్సిన విచిత్ర పరిస్థితి నెలకొంది. సాంకేతిక లోపాలు, సిగ్నల్ సమస్యలు, సర్వర్ మొరాయించడంతో కూలీలు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. రెండు పూటలా ఫోటోలు అప్‌లోడ్ చేయాలనే నిబంధన వీరి పాలిట శాపంగా మారింది. ఫోటో అప్‌లోడ్ కాకపోతే ఆ రోజు వేతనం కోల్పోవాల్సి వస్తోంది. ముఖ్యంగా ఫోటో హాజరు విధానం కారణంగా కూలీలు అనుకోని సమస్యలను ఎదుర్కొంటున్నారు. పని చేసినా హాజరు నమోదు కాక వేతనం కోల్పోవాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. ఈ విధానంలో కూలీలు పనికి వచ్చినప్పుడు మొబైల్ ఫోన్ ద్వారా ఫోటో తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. అంతే కాదు మొదటి ఫోటో తీసిన నాలుగు గంటల తర్వాత మరోసారి ఫోటో తీసి అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఈ రెండు ఫోటోలు సరిగ్గా అప్‌లోడ్ అయినప్పుడే హాజరు నమోదు అవుతుంది. గ్రామీణ ప్రాంతాల్లో నెట్‌వర్క్ సిగ్నల్ సమస్యలు, సర్వర్ లోపాలు, సాంకేతిక ఆటంకాల కారణంగా ఫోటోలు అప్‌లోడ్ చేయడం కష్టంగా మారుతోంది. ఫోటో కోసం వేచి చూస్తుండగా సమయం వృథా అవుతోంది. ఎండ తీవ్రత పెరిగి పనులు చేయడం కష్టమవుతోంది. కొన్నిసార్లు ఫోటోలు సరిగ్గా అప్‌లోడ్ కాకపోవడంతో హాజరు నమోదు కాక వేతనం కోల్పోతున్నామని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వంటి మారుమూల ప్రాంతాల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ఫేస్ అథెంటికేషన్ యాప్ సరిగా పనిచేయక కూలీల ముఖాలను గుర్తించడంలో విఫలమవుతోంది. మండుతున్న ఎండలో పని చేస్తూ చెమటలు పట్టిన ముఖాలను యాప్ గుర్తించలేక పోవడం వల్ల ఒకటి కాదు, రెండు మూడు సార్లు ఫోటోలు తీసినా ఫలితం లేకపోతోంది. కొందరు కూలీలు ఇంటికి వెళ్లి ముఖం కడుక్కొని మళ్లీ రావాల్సి వస్తోంది. మరికొందరు పౌడర్ వేసుకుని ఫోటో దిగాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఈ నేపథ్యంలో ఫోటో హాజరు విధానానికి బదులుగా మరింత సులభమైన, కూలీలకు అనుకూలమైన ప్రత్యామ్నాయం తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఉపాధికూలీలు కోరుతున్నారు. కాయకష్టం చేసే పేదలను ఇలా సాంకేతిక ఇబ్బందులకు గురిచేసే ఫోటో హాజరు విధానాన్ని రద్దు చేయాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ప్రభుత్వం తక్షణమే స్పందించి, ఇబ్బందులు లేని శాశ్వత పరిష్కారాన్ని చూపాలని కూలీలు వేడుకుంటున్నారు.

# రాష్ట్రంపై భానుడి పంజా..

## ఉదయం 9 గంటల నుండే మండే ఎండ

### పగటివేళ రహదారులు నిర్మానుష్యం

### పలు జిల్లాల్లో 45 డిగ్రీలకు మించి గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదు

**హైదరాబాద్, మే 3, ప్రభాతవార్త :** భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తుండటంతో జనం విలవిలలాడుతున్నారు. పగటి ఉష్ణోగ్రతలు పలు ప్రాంతాల్లో 45 డిగ్రీల మార్కును తాకడం భయాందోళన కలిగిస్తోంది. రాష్ట్రంలో రాజధాని హైదరాబాద్‌తో పాటు పలు జిల్లాల్లో సాధారణం కంటే 2 నుంచి 3 డిగ్రీల అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. పస్తుతం రాష్ట్రంలో పగటి ఉష్ణోగ్రతలు 41 డిగ్రీల నుంచి 44 డిగ్రీల వరకు నమోదవుతున్నాయి. వాతావరణశాఖ నివేదిక మేరకు నిజామాబాద్ జిల్లా మెండోరలో 46 డిగ్రీలు, నల్గొండ జిల్లా అనుములలో 45.9, నిర్మల్ జిల్లా ఖానాపూర్ లో 45.9, సిద్దిపేట్ జిల్లా తొగుట లో 45.9, ఆదిలాబాద్ జిల్లా ఆదిలాబాద్ అర్బన్ లో 45.8, పెద్దపల్లి జిల్లా కమాన్ పూర్‌లో 45.8, కామారెడ్డి జిల్లా కొల్లూరులో 45.7, కుమరం భీం జిల్లా తిర్యాణిలో 45.7, జగిత్యాల జిల్లా రాఘవపేటలో 45.6, ఖమ్మం జిల్లా కొజిజెర్లలో 45.6, సూర్యాపేట జిల్లా గరిడెపల్లిలో 45.5, మంచిర్యాల జిల్లా భీమారంలో 45.1, కరీంనగర్ జిల్లా మానకొండూర్ లో 44.6 డిగ్రీ సెల్సియస్ ల గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సాధారణంగా మే నెలాఖరులో వచ్చే రోహిణి కార్తె సమయంలో ఎండలు తీవ్రంగా ఉంటాయి. అయితే ఈ ఏడాది మే మొదటి వారంలోనే 45 డిగ్రీలకు చేరువగా ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో ఇక మే 25 నుంచి ప్రారంభమయ్యే రోహిణి కార్తె సమయంలో పరిస్థితి ఇంకెంత దారుణంగా ఉంటుందోనని సామాన్యులు బెంబెళెత్తిపోతున్నారు. ప్రతీ రోజు ఉదయం 9 గంటల నుంచే ఎండ తీవ్రత మొదలై మధ్యాహ్నం అయ్యేసరికి నిప్పుల కొలిమిని తలపిస్తోంది. వేడి గాలుల (వడగాల్పుల) ప్రభావంతో ప్రజలు మధ్యాహ్నం వేళ బయటకు రావాలంటేనే జంకుతున్నారు. ప్రధాన రహదారులన్నీ జనసంచారం లేక కర్ఫ్యూను తలపిస్తున్నాయి.

అకాల వర్షాలు అక్కడక్కడా కురుస్తున్నప్పటికీ అది కేవలం గాలిలో తేమను పెంచి ఉక్కపోతకు కారణమవుతోందే తప్ప ఎండ తీవ్రతను తగ్గించడం లేదు. ఈ నేపథ్యంలో రాగల మూడు రోజులపాటు వర్షాలు కురిసినప్పటికీ పగటివేళ ఉష్ణోగ్రతల్లో మాత్రం మార్పు ఉండదని వాతావరణశాఖ స్పష్టం చేసింది. రాగల రెండు వారాల్లో మరిన్ని ప్రాంతాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరించింది. ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు మధ్యాహ్నం వేళ బయటకు రావొద్దని వైద్యులు సూచిస్తున్నారు. డిహైడ్రేషన్ బారిన పడకుండా ఉండేలా ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలని కోరుతున్నారు.

# రైతు సమస్యలను పరిష్కరించండి

## కాంగ్రెస్ మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలను అమలు చేయాలి

### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మరోసారి బహిరంగ లేఖ రాసిన కేంద్ర మంత్రి బండి సంజయ్



**హైదరాబాద్, మే 3 ప్రభాతవార్త:** రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని, కాంగ్రెస్ మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలను అమలు చేయాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. ఈమేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మరోసారి బహిరంగ లేఖ రాసారు. తాను రైతుల సమస్యలపై లేఖ రాస్తే ఎదురు దాడి చేయడం ఎంతవరకు సమంజసం? అంటూ ప్రశ్నించారు. అబద్దాలు, అవగాహన రాహిత్యంలో తుమ్మల ఆస్కార్‌కు అర్హులు అన్నారు. ఎమ్మెస్పీ చట్టం తెస్తానని ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చింది తెలంగాణ కాంగ్రెస్సే అన్నారు. సొంత పార్టీ మేనిఫెస్టోలో ఏం రాశారో కూడా తెలుసుకోలేని అసమర్థుడు అన్నారు. ఎమ్మెస్పీ నిర్ణయాధికారం కేంద్రానిదే అయితే దాన్ని అమలు చేసే బాధ్యత రాష్ట్రాలదేననే సోయి లేకుంటే మాట్లాడుతున్నారన్నారు. దాదాపు 20 లక్షల మంది రైతులకు రుణమాఫీ చేయలేదని మీరే ఒప్పుకున్నారు కదా? నరం లేని నాలుక ఏది మాట్లాడినా చెల్లుతుందని మాట్లాడుతుందని, ఫసల్ బీమా యోజన పథకాన్ని బిజెపియేతర రాష్ట్రాల్లోనూ అమలు చేస్తున్నారనే సోయి లేదా? అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఫసల్ బీమా పనికి రానిదైతే రెండున్నరేళ్లు కావొస్తున్నా ప్రత్యామ్నాయ పంటల భీమా పథకం ఎందుకు తీసుకురాలేకపోయారు? అన్నారు. కొత్త పథకం తీసుకురాకుండా, ఫసల్ భీమా అమలు చేయకుండా రైతుల నోట్లో మట్టి కొడుతున్నది మీరు కాదా? అంటూ ప్రశ్నించారు. ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టపోతున్న తెలంగాణను కేంద్రం పట్టించుకోవడం లేదని చెప్పడం పచ్చి అబద్ధం అన్నారు. కాంగ్రెస్ పాలనలో ఎస్డీఆర్ఎఫ్ పేరిట ఏటా కేంద్రం తెలంగాణకు రూ.400 కోట్లు ఇస్తుందన్నారు. ఆ డబ్బును ఏం చేస్తున్నారో లెక్కలు చెప్పగలరా? అన్నారు. 5 లక్షల ఎకరాల్లో రైతులు పంట నష్టపోతే ఎకరాకు రూ.10 వేల చొప్పున రూ.5 వేల కోట్లు చెల్లించాల్సి ఉండగా, రూ.250 కోట్లు చెల్లించి చేతులు దులుపుకుంది నిజం కాదా? అన్నారు. రాష్ట్రంలో ఎరువుల సరఫరా కూడా సక్రమంగా పంపిణీ చేయలేని అసమర్థ మంత్రివర్యులు తుమ్మ అని, ఖమ్మం గడప దాటి క్షేత్రస్థాయిలో రైతులు పడుతున్న బాధలను కళ్లారా చూడలేని మంత్రికి రైతుల బాధలు ఏమి తెలుసునన్నారు. రాష్ట్రంలో 25 శాతం వడ్లను మాత్రమే కేంద్రం కొంటుందని చెప్పడం పచ్చి అబద్దం అన్నారు. పౌరసరఫరాల సంస్థ ప్రొక్యూర్ చేసిన ధాన్యంలో సింహభాగం కేంద్రమే తీసుకుంటుందని, గత ఖరీఫ్ సీజన్‌లో 71.86 లక్షల మెట్రిక్ టన్నులకు గాను 60 లక్షల మెట్రిక్ టన్నులు కేంద్రం కొనుగోలు చేసిందన్నారు. గత రబీ సీజన్‌లో 74.22 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లింగ్ చేస్తే, 50.10 లక్షల మెట్రిక్ టన్నులను కేంద్రం కొనుగోలు చేసిందన్నారు. గత రబీ సీజన్ కంటే 2 లక్షల మెట్రిక్ టన్నులు అదనంగా ఈ సీజన్‌లో కొనుగోలు చేసేందుకు కేంద్రం సిద్దమైందన్నారు. కేంద్రం నుండి రాష్ట్రానికి ఎలాంటి సహాయ సహకారాలు అందడం లేదని చెప్పడం పచ్చి అబద్ధం అన్నారు. 12 ఏళ్లలో రూ.12 లక్షల కోట్లకుపైగా నిధులు తెలంగాణకు ఇచ్చింది మోడీ ప్రభుత్వం అన్నారు. సుతిలీ తాడు, గోనె సంచె మొదలు వడ్ల కొనుగోలుకు అయ్యే ప్రతి పైసా చెల్లిస్తుంది కేంద్రమేనని, కేంద్రం సహకరించలేదని భావిస్తే ప్రధానమంత్రికి లేఖ ఎందుకు రాయలేదు? అన్నారు. కేంద్రం సహకరించకపోతే వడ్ల కొనుగోలు సమయంలో రాష్ట్ర ప్రభుత్వ నిర్వాకం బయటపడేది అన్నారు. పార్లమెంట్ చేసిన రైతు చట్టాలను నల్ల చట్టాలని వ్యవసాయ మంత్రి చెప్పడం రాజ్యాంగ ద్రోహమని, వ్యవసాయ మంత్రిగా కొనసాగే అర్హత తుమ్మలకు లేదన్నారు. ఇప్పటికైనా రాజకీయ నిందారోపణలు, ఎదురుదాడి మాని కొనుగోలు కేంద్రాల వద్ద అన్నదాతలు పడుతున్న బాధలు తెలుసుకోవాలన్నారు. కనీస మద్దతు ధర అందించడంతో పాటు రబీ సీజన్ లోనూ అన్ని రకాల వడ్లకు బోనస్ చెల్లించాలన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో రైతులకు ఇచ్చిన హామీలకు సంబంధించిన ప్రతులను ఈ లేఖతోపాటు జత చేస్తున్నామని, మేనిఫెస్టో హామీల అమలుపై తక్షణమే దృష్టి సారించి రాష్ట్ర రైతాంగాన్ని ఆదుకోవాలన్నారు.

# ట్రాఫిక్ ఘటనను రాజకీయాలకు వాడుకోవద్దు: టీనా చౌదరి

**ముంబయి, మే 3:** ముంబైలో బీజేపీ ర్యాలీ కారణంగా ఏర్పడిన ట్రాఫిక్‌లో మంత్రి గిరీశ్ మహాజన్‌ను నిలదీసి సోషల్ మీడియాలో వైరల్ అయిన మహిళ టీనా చౌదరి ఆ ఘటనపై తొలిసారి స్పందించారు. ఈ వివాదాన్ని రాజకీయాలకు వాడుకోవద్దని కోరారు. నా భుజంపై తుపాకీ పెట్టి ఎవరినీ లక్ష్యంగా చేసుకోవద్దని కోరుతూ శనివారం ఆమె ఓ వీడియోను విడుదల చేశారు. గతనెల 21న వర్లీ ప్రాంతంలో జరిగిన ఆ ఘటన గురించి టీనా వివరిస్తూ నా కూతురిని మ్యూజిక్ క్లాస్ నుంచి తీసుకురావడానికి వెళ్తుండగా, ర్యాలీ వల్ల గంటన్నర పైగా ట్రాఫిక్‌లో చిక్కుకుపోయాను. అక్కడ ఉన్న పోలీసులను ఎంత వేడుకున్నా స్పందించలేదు. వారి దృష్టిని ఆకర్షించేందుకే నీళ్ల బాటిల్‌ను నేలపైకి విసిరాను కానీ, ఎవరి మీదా కాదని స్పష్టం చేశారు. ఆ సమయంలో మంత్రి గిరీశ్ మహాజన్ మాత్రమే తన సమస్యను అర్థం చేసుకున్నారని టీనా తెలిపారు. మంత్రి గారు నా మాట విని, వెంటనే అక్కడి బస్సులను తొలగించాలని ఆదేశించారు. ఆయన వల్లే మాకు దారి దొరికిందని ఆమె వివరించారు. ప్రజల పట్ల అన్ని రాజకీయ పార్టీలూ ఒకేలా నిర్లక్ష్యంగాగా వ్యవహరిస్తాయని టీనా విమర్శించారు. తన తండ్రి సహా కుటుంబంలో 8 మందిభారత సైన్యంలో పనిచేశారని గుర్తుచేస్తూ యూనిఫాం ధరించడం అంటే ప్రజా సేవ చేయడమే కానీ, ప్రజలను భయపెట్టడం కాదని వ్యాఖ్యానించారు. ఇదిలా ఉండగా, పబ్లిక్‌లో గందరగోళం సృష్టించారని ఆరోపిస్తూ టీనాపై ఓ వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

# బస్సుబోల్తాపడి 26 మందికి తీవ్రగాయాలు



**కాంగ్రా(హిమాచల్), మే 3:** హిమాచల్ ప్రదేశ్‌లోని కంగ్రాలో ఆదివారం జరిగిన బస్సు ప్రమాదంలో 26 మంది ప్రయాణికులు గాయపడ్డారు. ఈ ఘటన ఉత్తర ప్రదేశ్‌లోని కంగ్రా జిల్లాలో జరిగింది. ఒక ప్రైవేటు ట్రావెల్స్ బస్సు 40 మంది ప్రయాణికులతో చంబా నుంచి ఉనా వెళ్తోన్న క్రమంలో నుర్పూర్ సమీపంలోని నియాజ్‌పూర్ వద్ద బస్సు బోల్తా పడింది. ఈ ఘటనలో బస్సులోని ప్రయాణికుల్లో 26 మందికిపైగా గాయపడ్డట్లు తెలుస్తోంది. బస్సు డ్రైవర్ గుండె పోటుకు గురికావడం, ఈ సమయంలో బస్సును నియంత్రించలేకపోవడం వల్లే బోల్తాపడి ఈ ప్రమాదం జరిగిందని ప్రాథమిక అంచనా. బస్సు అదుపుతప్పుతున్న సమయంలోనే కొందరు ప్రయాణికులు గమనించి తమను తాము రక్షించుకునేందుకు అప్రమత్తమయ్యారు. బస్సు బోల్తా పడినే వెంటనే స్థానికులు స్పందించారు. అధికారులకు వెంటనే సమాచారం అందించారు. వెంటనే అధికారులు, స్థానికులు సహాయక చర్యలు చేపట్టారు. బస్సులో చిక్కుకుపోయిన ప్రయాణికుల్ని బయటకు తీశారు. గాయపడ్డవారిని నుర్పూర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వారికి చికిత్స అందుతోంది. ఈ 26 మందిలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయని, వారిని మెరుగైన చికిత్సకోసం టాండా మెడికల్ కాలేజీకి పంపించినట్లు వైద్యులు తెలిపారు. మిగతా వారికి గాయాలైనప్పటికీ, ప్రాణాపాయం లేదని తెలిపారు. నుర్పూర్ ఎస్పీ ఆధ్వర్యంలోని పోలీసుల బృందం ఈ ఘటనపై విచారణ జరుపుతోంది. బాధితులకు మెరుగైన వైద్యం అందిస్తామని అధికారులు తెలిపారు.

# గోండా పోటీల్లో ఏదైనా జరిగితే ప్రభుత్వానిదే బాధ్యత

## రెజ్లింగ్ క్రీడాకారిణి వినేశ్ ఫొగట్



**చండీగఢ్, మే 3:** భారత రెజ్లింగ్ ఫెడరేషన్ మాజీ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ కంచుకోట అయిన గొండాలో జరగబోయే నేషనల్ ఓపెన్ ర్యాంకింగ్ టోర్నమెంట్ పై ఏస్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ టోర్నీలో తనకు గానీ, తన బృందానికి గానీ ఏదైనా అవాంఛనీయ ఘటన జరిగితే దానికి కేంద్ర ప్రభుత్వం, క్రీడా మంత్రిత్వ శాఖనే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని ఆమె తీవ్ర స్వరంతో హెచ్చ రించింది. ఈ మేరకు సోషల్ మీడియాలో ఒక వీడియో విడుదల చేసిన వినేశ్ ఫొగాట్, మే 12నుంచి 14 వరకు గొండాలో జరగనున్న టోర్నమెంట్‌లో తాను పాల్గొననున్నట్టు తెలిపింది. బ్రిజ్ భూషణ్, ఆయన మనుషుల నియంత్రణలో జరిగే ఈ టోర్నీలో కష్టపడి ఆడే అథ్లెట్లకు న్యాయం జరగడం అసాధ్యం. ఎవరి మ్యాచ్‌కు ఎవరు రిఫరీగా ఉంటారు, ఎవరికి ఎన్ని పాయింట్లు వేస్తారు అనేదంతా వాళ్లే నిర్ణయిస్తారని ఆమె ఆరోపించింది. క్రీడాకారుల వెయిట్ చెకింగ్ ప్రక్రియ కూడా పారదర్శకంగా జరగదనే అనుమానాన్ని ఆమె వ్యక్తం చేసింది. ఇదే వీడియోలో, బ్రిజ్ భూషణ్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలతో కోర్టులో ఫిర్యాదు చేసిన ఆరుగురు మహిళా రెజ్లర్లలో తానూ ఒకరినని వినేశ్ తొలిసారిగా వెల్లడించింది. లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా మేము మూడేళ్ల క్రితమే గళమెత్తాం. కేసు విచారణలో ఉన్నందున ఇప్పటివరకు మాట్లాడలేదు. కానీ ఫిర్యాదు చేసిన ఆ ఆరుగురిలో నేనూ ఒక బాధితురాలినని ఆమె స్పష్టం చేసింది. బ్రిజ్ భూషణ్‌ను అధికారికంగా డబ్ల్యూఎఫ్ఐ చీఫ్ పదవి నుంచి తొలగించినప్పటికీ, ఫెడరేషన్‌పై తనకే పట్టుందని ఆయన బహిరంగంగా చెబుతున్నా క్రీడా మంత్రిత్వ శాఖ ప్రేక్షకపాత్ర వహిస్తోందని వినేశ్ ఫొగాట్ విమర్శించారు.

# ఎంఎ సోషియాలజీలో 'మోడీ తత్వ' మాడ్యూల్..

## గుజరాత్‌లోని షాయాజీరావు వర్సిటీ నిర్ణయం

**అహ్మదాబాద్, మే 3:** గుజరాత్‌లోని వదోదరలో కొనసాగుతున్న మహారాజా సాయాజిరావు యూనివర్సిటీలో వచ్చే విద్యాసంవత్సరంనుంచి ఎం ఎ సోషియాలజీలో మోడి తత్వ అనే సోషియాలజీ కోర్సును ప్రవేశపెడుతున్నారు. అండర్‌గ్రాడ్యుయేట్,పోస్టు గ్రాడ్యుయేట్ విద్యాబోధనలో రివిజన్ తీసుకువస్తున్నామనంటూ వర్సిటీ అధికారులు చెపుతున్నారు. కొత్తగా ఎంఎ సోషియాలజీ మొదటి ఏడాదే మోడీ తత్వ అనే కోర్సును చేర్చారు. ఈ సవరించిన కర్క్యులమ్‌లో ఆర్‌ఎస్ఎస్ కార్యక్రమాలు, భారతీయ విజ్ఞాన సాంప్రదాయాలు, హిందూ సిద్ధాంతాలు, జాతీయతావాదం వంటివి ఉంటాయని సోషియాలజీ విభాగం హెడ్ వీరేంద్రసింగ్ తెలిపారు. ఆయనే స్వయంగా బోర్డ్ ఆఫ్ స్టడీస్‌కకు ఛైర్మన్‌గా కూడా ఉన్నారు. జర్మన్ సామాజికవేత్త మాక్స్‌వెబర్ సిద్ధాంతం ఆధారంగా ఆకర్షణీయ పాలకుడు అన్న విధానాన్ని విశ్లేషిస్తుందని ఆయన చెప్పారు. మోడి తత్వ సిలబస్ తోపాటే నాయకత్వ అధ్యయనం, జాతీయతావాదం, భారతీయ విజ్ఞాన వనయవస్థలపైనా కొత్త సిద్ధాంతపత్రాలరూపకల్పనకు ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఈ మార్పులు వచ్చేకొత్త విద్యాసంవత్సరంనుంచి ప్రారంభం అవుతాయి. అంటే జూన్‌నుంచి అండర్‌గ్రాడ్యుయేట్, పోస్టుగ్రాడ్యుయేట్ విద్యలోని సోషియాలజీ సిలబస్‌లలో ఉంటుందని వర్సిటీ అధికారులు తెలిపారు.

# ఇజ్రాయెల్‌ను కలవరపెడుతున్న హెజ్బొల్లా కొత్తడ్రోన్లు

**బీరూట్, మే 3:** ఇజ్రాయెల్‌తో కొనసాగుతున్న ఘర్షణలో హిజ్బుల్లా సరికొత్త, ప్రమాదకరమైన ఆయుధాన్ని ప్రయోగిస్తోంది. ఎలక్ట్రానిక్ జామింగ్‌కు ఏ మాత్రం చిక్కని ఫైబర్ ఆప్టిక్ గైడెడ్ క్వాడ్‌కాప్టర్ డ్రోన్లతో దాడులకు పాల్పడుతూ ఇజ్రాయెల్ సైన్యాన్ని విస్తుపోయేలా చేస్తోంది. ఇటీవల ఇలాంటి దాడిలోనే 19 ఏళ్ల ఐడీఎఫ్ సార్జెంట్ ఇడాన్ ఫూక్స్ మరణించగా, మరికొందరు సైనికులు గాయపడ్డారు. ఈ దాడికి సంబంధించిన వీడియోను హిజ్బుల్లానే స్వయంగా విడుదల చేసింది. సాధారణంగా డ్రోన్లను రేడియో సిగ్నల్స్ ద్వారా నియంత్రిస్తారు. ఇజ్రాయెల్ తన సాంకేతికతతో ఆ సిగ్నల్స్‌ను జామ్ చేసి డ్రోన్లను నిర్వీర్యం చేస్తుంది. హిజ్బుల్లా వాడుతున్న ఈ కొత్త డ్రోన్లు ఆపరేటర్‌కు ఒక సన్నని ఫైబర్ ఆప్టిక్ కేబుల్‌తో అనుసంధానమై ఉంటాయి. దాదాపు 15 కిలోమీటర్ల పొడవు ఉండే ఈ కేబుల్ కంటికి కనిపించక పోవడంతో, డ్రోన్‌ను గుర్తించడం,దానిపై దాడి చేయడం ఇజ్రాయెల్ సైన్యానికి కష్టంగా మారింది. చైనా లేదా ఇరాన్ నుంచి తెప్పించిన ఈ డ్రోన్లకు, రష్యా ఉక్రెయిన్‌యుద్ధంలోవాడిన ఫైబర్ ఆప్టిక్ పరిజ్ఞానాన్ని హిజ్బుల్లా జతచేసింది.




## ఉప్పల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌ను

# తిప్పేసిన వరుణ్

**సొంతగ్రౌండ్‌లో ఆరేంజ్ ఆర్మీ ఆరంభం అంతా సాఫీగానే సాగింది. ఉప్పల్‌లో ఉప్పెన ఖాయంగా కనిపించింది. పవర్ ప్లేలోనే 71 రన్స్. పది ఓవర్లలో వందకు పైగా రన్స్. క్రీజ్‌లో ట్రావిస్ హెడ్, ఇషాన్ కిషన్‌ల విధ్వంసకర బ్యాటింగ్. అంతలోనే హైదరాబాద్ వికెట్లు టపటపా రాలాయి. 60 పరుగులకే 9 వికెట్లు అదీ ఒక ఓవర్ ఉండగానే కోల్పోయింది. భారీ స్కోరు చేస్తుందనుకున్న సన్‌రైజర్స్ స్వల్ప స్కోరుకే ఖేల్ ఖతమైంది. కోల్‌కతా నైట్ రైడర్స్ స్పిన్నర్లు హైదరాబాద్‌ను తిప్పేశారు. ఫలితం అయిదు విక్టరీల జైత్రయాత్రకు బ్రేక్.**

**హైదరాబాద్, మే3(వార్త క్రీడా ప్రతినిధి):** ఐపీఎల్ 2026లో వరుస విజయాలతో దూసుకుపోతున్న సన్‌రైజర్స్ హైదరాబాద్ జోరుకు సొంత గ్రౌండ్ ఉప్పల్ స్టేడియంలోనే ఫుల్‌స్టాప్ పడింది. ఉప్పల్‌లో వరుసగా మూడు విజయాల జోరుతో బయట కూడా రెండు విజయాలతో హైదరాబాద్ చేరిన సన్‌రైజర్స్‌కు కేకేఆర్ కళ్లెం వేసింది. 7 వికెట్ల తేడాతో హైదరాబాద్‌ను ఓడించింది. సన్‌రైజర్స్ ఉంచిన 165 పరుగులకు స్వల్ప లక్ష్యాన్ని.. కోల్‌కతా 18.2 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి ఛేదించింది. అంగ్‌క్రిష్ రఘువంశీ (47 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లతో 59), కెప్టెన్ అజింక్య రహానె (36 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్‌తో 43) గెలుపుకు బాటలు వేశారు. ఫిన్ అలెన్ (13 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లతో 29) ఫర్వాలేదనిపించాడు. రింకు సింగ్ (11 బంతుల్లో 22), కామరూన్ గ్రీన్(3) మిగతా పనిని పూర్తి చేశారు. 10 మ్యాచ్‌ల్లో హైదరాబాద్‌కు ఇది నాలుగో ఓటమి. ఆరంభంలో వరుస పరాజయాలు చవిచూసిన కోల్‌కతాకు ఇది హ్యాట్రిక్ విజయం. ప్రస్తుతం కేకేఆర్ ఖాతాలో ఏడు పాయింట్లున్నాయి.

అంతకుముందు సన్‌రైజర్స్‌కు ఆదిరే ఆరంభం లభించింది. అభిషేక్(10 బంతుల్లో 15), ట్రావిస్ హెడ్(28బంతుల్లో 9ఫోర్లు,3సిక్స్‌లతో61) 44పరుగుల ఫ్లయింగ్‌స్టార్‌న ఇచ్చారు. అభిషేక్ ఇన్నింగ్స్‌కు కార్తీక్ త్యాగి తెరదించాడు. క్రీజ్‌లోకి వచ్చిన ఇషాన్ కిషన్(29 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లతో 42)తో కలిసి ట్రావిస్ హెడ్ ధాటిగా ఆడుతూ స్కోరు వంద దాటించాడు.వరుణ్ చక్రవర్తి ఎంట్రీతో సీన్ ఒక్కసారిగా రివర్స్ అయింది. ట్రావిస్ హెడ్‌ను బోల్తా కొట్టించిన వరుణ్.. రవిచంద్రన్(4), అనికేత్(6)ను కూడా పెలిలియన్ పంపాడు. మరో ఎండ్‌లో కామెరూన్ గ్రీన్, సునీల్ నరైన్ ధాటికి హైదరాబాద్ పేకమేడలా కూలింది. సలీల్ అరోరా (2), కమిన్స్ (10) కూడా నిరాశపర్చారు. 8.5 ఓవర్లకు 105/1తో పటిష్ఠ స్థితిలో ఉన్న హైదరాబాద్.. 60 పరుగులకు చివరి 9 వికెట్లు కోల్పయింది. 19 ఓవర్లలోనే 165 పరుగులకు ఆలౌటైంది. కేకేఆర్ బౌలర్లలో రుణ్ చక్రవర్తి 3, కార్తిక్ త్యాగి 2, నరైన్ 2, వైభవ్ అరోరా, కామెరూన్ గ్రీన్, అనుకుల్ రాయ్ ఒక్కో వికెట్ పడగొట్టారు.

## పంజాబ్‌పై గుజరాత్ టైటాన్స్ విజయం

**అహ్మదాబాద్:** సొంతగడ్డపై గుజరాత్ టైటాన్స్ మరో విజయం అందుకుంది. పంజాబ్ కింగ్స్‌పై 4 వికెట్ల తేడాతో నెగ్గి ప్లే ఆఫ్ అవకాశాలను మెరుగుపర్చుకుంది. మొదట బ్యాటింగ్ చేసిన పంజాబ్ కింగ్స్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 163 రన్స్ చేసింది. తొలి ఓవర్లోనే సిరాజ్ డబుల్ షాకిచ్చాడు. వరుస బంతుల్లో ప్రియాన్ష్ ఆర్య(2), కొనెల్లీ(0)ను అవుట్‌చేశాడు. మరో ఎండ్‌లో రబడ, హోల్డర్ చకచకా మిడిలార్డర్ పని పట్టారు. దీంతో 47 పరుగులకే పంజాబ్ 5 వికెట్లు కోల్పోయింది.ఈ దశలో అన్‌క్యాప్డ్ ప్లేయర్ సూర్యాన్ష్ షెడ్గే(57), మార్కస్ స్టోయినిస్(40) ఆదుకున్నారు. ఆరో వికెట్‌కు 79 పరుగులు జోడించారు. చివర్లో జెన్సన్(20)కూడా ఓ చేయడంతో 150 మార్కు దాటింది. గుజరాత్ బౌలర్లలో హోల్డర్ 4, సిరాజ్ 2, రబడ 2 వికెట్లు పడగొట్టారు.

ఈ స్వల్ప లక్ష్యాన్ని గుజరాత్ మరో బంతి మిగిలి ఉండగానే 6 వికెట్లు కోల్పోయి అందుకుంది. ఆరంభంలోనే శుభ్‌మన్ గిల్(5) విఫలమైనా...టాప్‌ఫామ్‌లో ఉన్న సాయి సుదర్శన్(41 బంతుల్లో 5 ఫోర్లు, ఓ సిక్స్‌తో 57), జాస్ బట్లర్(22 బంతుల్లో 25), వాషింగ్టన్ సుందర్(23 బంతుల్లో 5 ఫోర్లు, ఓ సిక్స్‌తో 40నాటౌట్) రాణించి గుజరాత్ టైటాన్స్‌కు విజయం ఖాయం చేశాడు. గుజరాత్‌కు ఇది హ్యాట్రిక్ విజయం.పది మ్యాచ్‌ల్లో ఆరు విజయాలతో 12 పాయింట్లతో ఉంది. టాప్ ప్లేస్‌లో పంజాబ్ కొనసాగుతోంది.



# థామస్ కప్‌లో భారత్‌కు కాంస్యం


## సెమీఫైనల్లో ఫ్రాన్స్ చేతిలో క్లీన్‌స్వీప్

**హోర్సెన్స్ (డెన్మార్క్):** ప్రతిష్ఠాత్మక థామస్ కప్ బ్యాడ్మింటన్ టోర్నీలో ఫైనల్ చేరాలన్న భారత్ ఆశలకు ఫ్రాన్స్ గండికొట్టింది. స్టార్ ప్లేయర్ లక్ష్యసేన్ గాయంతో అందుబాటులో లేకపోవడం జట్టు అవకాశాలను దెబ్బతీసింది. సెమీఫైనల్లో ఫ్రాన్స్ 3-0తో భారత్‌పై క్లీన్ స్వీప్ చేసి ఫైనల్ చేరింది.ఈ ఓటమితో భారత్ కాంస్యంతో సరిపెట్టింది.నాలుగేళ్ల గ్యాప్ తర్వాత మెడల్ అందుకుంది.2022లో ఒకే ఒకసారి థామస్ కప్ విజేతగా నిలిచిన భారత్..1952, 1955, 1979, 2026లో సెమీస్ వరకు చేరి కాంస్య పతకాలు నెగ్గింది.

భారత ఏస్ ప్లేయర్ లక్ష్యసేన్ గాయంతో దూరం కావడంతో తొలి సింగిల్స్ ఆడిన ఆయుష్ షెట్టి నిరాశ పరిచాడు. అతడు 11-21, 9-21తో వరుస సెట్లలో పొపోవ్ చేతిలో పరాజయం పొందాడు. తొలి సెట్ ఆరంభంలో చక్కని ప్రదర్శన ఇచ్చిన ఆయుష్.. ఆ తర్వాత లయ కోల్పోయాడు. రెండో గేమ్ లోనూ ఆయుష్ షెట్టి తేలిపోయాడు. ఇక రెండో సింగిల్స్‌లో లక్ష్యసేన్ స్థానంలో దిగిన కిదాంబి శ్రీకాంత్ పోరాడినా ఓటమి తప్పలేదు. శ్రీకాంత్‌పై లానియర్ 21-16, 21-18తో నెగ్గి ఫ్రాన్స్‌కు 2-0 ఆధిక్యం అందించాడు.రెండో సెట్‌లో శ్రీకాంత్ ఓ దశలో 16-14తో ఆధిక్యంలో నిలిచి సమం చేసే ఊపులో కనిపించాడు.అయితే లానియర్ అతనికి అవకాశం ఇవ్వలేదు. కచ్చితంగా గెలవాల్సిన మూడో సింగిల్స్‌లో అనుభవజ్ఞుడు ప్రణయ్ కూడా చేతులెత్తేయడంతో భారత్‌కు ఓటమి తప్పలేదు. ఈ మ్యాచ్‌లో హెచ్‌ఎస్ ప్రణయ్ 19-21, 16-21తో పొపోవ్ చేతిలో కంగుతిన్నాడు. కీలక సమయాల్లో ఒత్తిడికి లోనై మ్యాచ్ చేజార్చుకున్నాడు.దీంతో ఫ్రాన్స్ 3-0తో ఆధిక్యంలో నిలిచింది. దీంతో డబుల్స్ ఆడే అవసరం రాలేదు. సెమీస్‌లో ఓటమితో భారత్ ఖాతాలో కాంస్య పతకం చేరింది.

## కోస్టియుక్‌కు మాడ్రిడ్ ఓపెన్ టైటిల్

**ముతువా(మాడ్రిడ్):** ఉక్రెయిన్‌కు చెందిన మార్టా కోస్టియుక్.. మాడ్రిడ్ ఓపెనర్ మహిళల సింగిల్స్ టైటిల్ అందుకుంది. ఫైనల్లో ప్రపంచ నెంబర్8 ర్యాంకర్ మిర్రా ఆండ్రీవా(రష్యా)పై సంచలన విజయం సాధించింది. మొదటి సెట్‌ను 6-3తో అలవోకగా ముగించిన 23 ఏళ్ల కోస్టియుక్‌కు... రెండో సెట్‌లో ఆండ్రీవా నుంచి గట్టి పోటీ ఎదురైంది. ఇరువురు పోటాపోటీగా సర్వీసులు నిలబెట్టుకోవడంతో 5-5తో సమవుజ్జీగా నిలిచారు. ఈ దశలో ఆండ్రీవా సర్వీసును కొల్లగొట్టడమే గాక, తన సర్వీసును నిలుపుకుని రెండోసెట్‌ను మ్యాచ్‌ను ముగించింది.కోస్టియుక్‌కు ఇది మొదటి డబ్ల్యుటిఎ 1000 టైటిల్.అలాగే క్లే కోర్టుపై వరుస విజయాల సంఖ్యను 11కు పెంచుకుంది. డబ్ల్యూటిఎ ర్యాంకింగ్స్‌లో కోస్టియుక్ ప్రపంచ నంబర్ 23 నుండి... కెరీర్‌లోనే అత్యుత్తమమైన 15వ ర్యాంకుకు చేరుకుంది. మే 24న పారిస్‌లో పారంభం కానున్న ఫ్రెంచ్ ఓపెన్‌లో టాప్ కంటెండర్‌గా కోస్టియుక్ బరిలోకి దిగనుంది.మాడ్రిడ్‌లో టైటిల్ గెలుస్తానని ఎప్పుడూ అనుకోలేదని, అది నేరవేరినందుకు సంతోషంగా ఉందని కోస్టియుక్ ఆనందం వ్యక్తం చేసింది.





## బిజ్ వల్ల నష్టపోయా
### వినేశ్ ఫోగట్

**న్యూఢిల్లీ:** ఇప్పటికే రెజ్లింగ్ సమాఖ్య మాజీ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ వల్ల తాము నష్టపోయామని స్టార్ మహిళా రెజ్లర్ వినేశ్ ఫోగట్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు.జాతీయ టోర్నీలో తనకు గానీ, రెజ్లర్లకు గానీ ఏదైనా జరిగితే దానికి కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.ఉత్తర్‌ప్రదేశ్‌లోని గోండాలో నేషనల్ ఓపెన్ ర్యాంకింగ్ టోర్నమెంట్ త్వరలో జరగనుంది. గోండా ప్రాంతంపై బ్రిజ్ భూషణ్ ప్రభావంఉందన్నారు.ఆయన తన సన్నిహితుల ద్వారా ఈ పోటీ ఫలితాలను ప్రభావితం చేసే అవకాశం ఉందని వినేశ్ పేర్కొన్నారు. గోండాలో జరగనున్న టోర్నమెంట్‌లో వినేశ్ 57 కేజీల విభాగంలో పోటీపడనున్నారు. 2026 ఆసియా క్రీడల్లో భారత్ తరఫున పోటీ చేయడానికి రెజ్లర్‌ల ఎంపికకు భారత రెజ్లింగ్ సమాఖ్య నిర్వహించే ఈటోర్నమెంట్ కీలకం కానుంది. రిజిస్ట్రేషన్ అంశంలో కూడా వివాదమైంది.




# ఎయిరిండియాకు రూ.22వేల కోట్ల నష్టం

## నష్టాల తగ్గింపుపై బోర్డు కీలక భేటీ

## ఏడో తేదీ అత్యవసర సమావేశం

**ముంబయి, మే 3:** నష్టాల్లో కొట్టుమిట్టాడుతున్న ఎయిరిండియాను గట్టెక్కించేందుకు ఖర్చులు తగ్గించే ప్రణాళికలపై ఎయిరిండియా బోర్డు సమావేశం కానున్నది. ఈనెల 7వ తేదీ ఎయిరిండియా బోర్డు సమావేశం అవుతుందని తేలింది. కొత్త సిఇఒ నియామకం, కంపెనీ ఆర్తిక వివరాలు వంటివి చర్చకు రానున్నాయి. ఎయిరిండియా గ్రూప్ ఈ ఆర్థికసంవత్సరంలోనే 22 వేల కోట్ల నష్టం చవిచూసింది. పశ్చిమాసియా యుద్ధం ప్రభావం ఎయిరిండియాపై ఎక్కువ చూపించింది. సింగపూర్ ఎయిర్ లైన్స్ గ్రూప్ సిఇఒ కాంప్‌బెల్ విల్సన్ ఈ ఏడాది పదవినుంచి దిగిపోతున్నట్లు ప్రకటించడంతో ఇపుడు కొత్త సిఇఒ ఎంపికపైనా చర్చకు రానున్నది. టాటాసన్స్ ఛైర్మన్ఎన్‌చంద్రశేఖరన్ అధ్యక్షతన ముంబయిలో ఈనెల 7వ తేదీ జరిగే సమావేశం అత్యంత కీలకం కానున్నది. జెట్ ఇంధన ధరలు అంతర్జాతీయంగా భారీగాపెరగడంతో ఎయిరిండియా ప్రస్తుతం టికెట్లనుంచి భోజనసదుపాయం లాంజ్ యాక్సెస్ వంటివి తొలగిస్తోంది. బిజినెస్ క్లాస్ ప్రయాణీకులకు ఈ తొలగింపు వర్తిస్తుంది. అలాగే పశ్చిమాసియా వివాదంతో గగనతల ఆంక్షలు కూడా పెరిగిపోయాయి. దీనివల్ల అంతర్జాతీయ రూట్లలో దూరం భారీగా పెరిగి ఇంధన భారం పెరిగింది. ఎయిరిండియాలో 25.1శాతం వాటా ఉన్న సింగపూర్ ఎయిర్ లైన్స్ నుంచి ప్రాతినిధ్యం వహించిన కాంప్‌బెల్ స్థానంలో కొత్త సిఇఒను కూడా ఎంపికచేయాలి. ఈసారి యూరోపియన్ అభ్యర్థులను సిఇఒగా నియమించాలని భావిస్తున్నారు. చంద్రశేఖరన్, విల్సన్‌లు కాకుండా సింగపూర్ ఎయిర్‌లైన్స్ సిఇఒ గోహ్ చూన్ ఫాంగ్ మరో నలుగురు బోర్డు డైరెక్టర్లుగా ఉన్నారు. సంజీవ్‌మెహతా, అలైస్ వైద్యన్; పిఆర్ రమేష్; పిబి బాలాజీలు ఎయిరిండియా బోర్డులో సభ్యులుగా ఉన్నారు. ఈనెల ఒకటవ తేదీనే ఎ యిరిండియా సిఇఒ సంస్థకు జెట్‌ఇంధన సమస్య సవాల్‌గా మారుతున్నదని హెచ్చరించారు కూడా. ఈపరిస్థితుల్లో ఎయిరిండియా బోర్డు సమావేశానికి ఇపుడు అత్యంత ప్రాధాన్యత ఏర్పడింది. ఏప్రిల్ నెలతోపాటు మేలో కూడా అంతర్జాతీయ రూట్లను కొన్ని కుదించింది. జూన్;జులైనెలలకు కూడా కొన్ని షెడ్యూళ్లను కుదించాలనినిర్ణయించింది. గతనెల 26వ తేదీనే భారత్‌లో అత్యధిక సర్వీసులున్న ఎయిరిండియా, ఇండిగో, స్పైస్‌జెట్‌లు ధరల పెంపుదలతో తాము సర్వీసులు నడపలేమని కూడా లేఖరాసాయి. అంతర్జాతీయ విమానాలకు మే ఒకటో తేదీనుంచి ఐదుశాతం జెట్‌ఫ్యూయల్ ధరలు పెంచింది. రానున్న నెలల్లో ఇంధన ధరలు కూడా భరించలేనిస్థాయికి పెరుగుతాయని కూడా ఎయిరిండియా భావిస్తోంది.




## టాటాసన్స్ లిస్టింగ్‌కు రిజర్వ్ బ్యాంక్

# కొత్త నిబంధనల బ్రేక్!

**ముంబయి, మే 3:** స్టాక్ మార్కెట్లో లిస్టింగ్ ఆపేందుకు టాటా సన్స్ చేస్తున్న ప్రయత్నాలకు ఆర్బీఐ బ్రేకులు వేసింది. టాటా గ్రూప్ కంపెనీల నుంచి వచ్చే నిధులను పరోక్షంగా ప్రజల నిధుల కిందే పరిగణించాలని ఆర్బీఐ కొత్త రూల్స్ తీసుకొచ్చింది. పెట్టుబడి కంపెనీగా డీరిడిస్టర్ చేయాలని టాటా సన్స్ పెట్టుకున్న దరఖాస్తుపై ఈ నిర్ణయం ప్రభావం చూపించనుంది. జులై 1 నుంచే అమలులోకి ఈ కొత్త నిబంధనలు రానున్న క్రమంలో టాటా సన్స్ భవిష్యత్ ప్రణాళికలపై ప్రభావం పడుతుంది. టాటా గ్రూప్ హోల్డింగ్ కంపెనీ తన ఫైనాన్స్ లైసెన్స్‌ను సరెండ్ చేస్తే తప్పనిసరి స్టాక్ మార్కెట్ లిస్టింగును తప్పించుకోవచ్చనే వాదననూ ఇటీవలి ఓ నోటిఫికేషన్ ద్వారా ఆర్బీఐ తోసిపుచ్చింది. రిజర్వ్ బ్యాంక్ మార్గనిర్దేశాల ప్రకారం డెట్ మార్కెట్‌తో సంబంధాలు ఉన్న గ్రూప్ కంపెనీలు, అనుబంధ సంస్థల నుంచి ఈక్విటీని పొందిన క్రమంలో పరోక్షంగా ప్రజా నిధులను పొందినట్లుగానే పరిగణించనున్నారు. న్యాయ నిపుణుల అంచనాల ప్రకారం టాటా సన్స్‌కు చెందిన టాటా మోటార్స్, టాటాపవర్, టాటాస్టీల్, ఇండియన్ హోటల్స్,టాటా కెమికల్స్ తమ హోల్డింగ్ సంస్థల నిధులను అందజేసిన సమయంలో డెట్‌మార్కెట్ల ద్వారా నిధులను సమీకరించాయి.మరోవైపు రూ.1000 కోట్ల ఆస్తుల్లోపు ఉన్న ఎన్‌బీఎఫ్‌సీలకు మాత్రమే డీరిజిస్ట్రేషన్ మార్గాన్ని కొత్త నిబంధనలు సూచిస్తున్నాయి. టాటా సన్స్ స్టాండలోన్ ఆస్తులు రూ.1.75లక్షల కోట్లుగా ఉన్నాయి. అంటే ఈ పరిమితిని దాటి ఉన్నట్లు తెలుస్తోంది. అంతకుముందు లక్ష కోట్లకు పైగా ఉన్న కంపెనీలను అప్పర్ లేయర్ నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీగా వర్గీకరిస్తారని ఆర్బీఐ ప్రతిపాదించిన సంగతి తెలిసిందే. సెప్టెంబర్ 2022న మొదటి సారి ఆర్బీఐ అప్పర్ లేయర్ లిస్ట్ విడుదల చేసింది. అప్పుడు టాటా సన్స్ ఒక్కటే తప్పనిసరి లిస్టింగ్ చేయకుండా ఉన్న కంపెనీగా మినహాయింపు పొందింది. టాటా సన్స్ లిస్టింగ్ విషయంలో టాటా ట్రస్ట్స్‌లో విభేదాలు కనిపించిన విషయం తెలిసిందే. టాటా ట్రస్ట్స్ ఛైర్మన్ నోయల్ టాటా లిస్టింగ్ కు వ్యతిరేకంగా ఉన్నారు. వైస్ ఛైర్మన్ వేణు శ్రీనివాసం, విజయం సింగ్ లిస్టింగ్ చేయాలని కోరుతున్నారు. గతనెలలో షాపూర్జీ పల్లోంజీ మిస్త్రీ, వేణు శ్రీనివాసన్ లు టాటా సన్స్ లిస్టింగ్ కు మద్దతు పలికి అత్యవసరమైన ప్రక్రియగా పేర్కొన్నారు. లిస్టిం గ్‌ప్రక్రియ ద్వారా గ్రూప్ లో పాలన, పారదర్శకత, బాధ్యత బలోపేతం అవుతుందని వారు వాదిస్తున్నారు.

## 21.3శాతం తగ్గిన అంతర్జాతీయ ప్రయాణాలు

**ముంబయి, మే 3:** పశ్చిమాసియాలో నెలకొన్న రాజకీయ సంక్షోభం భారత విమానయాన రంగంపై తీవ్ర ప్రభావం చూపిస్తోంది. దీనివల్ల ఈ ఏడాది మార్చిలో భారత్ నుంచి అంతర్జాతీయ ప్రయాణాలు గణనీయంగా తగ్గాయి. ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా విడుదల చేసిన నివేదిక ప్రకారం గత నెలల వృద్ధితో పోలిస్తే మార్చిలో విదేశాలకు వెళ్లే ప్రయాణికుల సంఖ్య 18.5 శాతం మేర క్షీణించింది. మొత్తం అంతర్జాతీయ విమాన రాకపోకల్లో 21.3 శాతం తగ్గుదల నమోదైంది. పశ్చిమాసియాలో అమెరికా, ఇజ్రాయెల్‌ఇరాన్ మధ్య ఉద్రిక్తతల కారణంగా పలు దేశాలు తమ గగనతలాలను మూసివేశాయి. దీంతో దుబాయ్, ఖతార్ వంటి ప్రధాన రవాణా కేంద్రాలకు విమాన సర్వీసులు రద్దయ్యాయి. ఐరోపా, అమెరికా వెళ్లే విమానాలు సుదీర్ఘ మార్గాల్లో ప్రయాణించాల్సి వస్తోంది.దీనికి తోడు, ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ ఎటిఎఫ్ ధరలు గతేడాదితో పోలిస్తే 34 శాతం పెరిగాయి.ఈ పరిణామాలతో విమానయాన సంస్థలకు నిర్వహణ ఖర్చులు భారీగా పెరిగాయి. అందువల్లనే పలు అంతర్జాతీయ సర్వీసులను తగ్గించుకుంటున్నట్లు ఎయిర్ ఇండియా ఇప్పటికే ప్రకటించింది.


## డీమార్ట్ నికరలాభం రూ.656.6 కోట్లు




**ముంబయి, మే 3:** దేశంలో డీమార్ట్ పేరిట స్టోర్లను నిర్వహిస్తున్న అవెన్యూ సూపర్ మార్ట్స్ నాలుగో త్రైమాసికంలో నికరలాభం రూ. 656.6 కోట్లుగా నమోదైంది. అంతకుముందు ఆర్థిక సంవత్సరం ఇదే కాలంతో పోలిస్తే లాభం19శాతం పెరిగింది. గత ఏడాదిఇదేకాలంలో లాభం రూ.550.90కోట్లుగా ఉంది. మరోవైపు కంపెనీ కార్యకలాపాల ఆదాయం రూ.17,684 కోట్లుగా నమోదైంది. గత ఏడాది ఇదే కాలానికిగాను సంస్థ ఆదాయం రూ. 14,872 కోట్లుగా ఉండగా 19శాతం మేర పెరిగింది.ఇక కంపెనీ ఎబిటా కూడా పెరిగింది.వార్షిక ప్రాతిపదికన ఇది 26.7 శాతం పెరిగి రూ.1210.5 కోట్లకు చేరుకుంది.అంతకు ముందు ఏడాదిలో ఎబిటా 955.1 కోట్లుగా ఉండేది. చివరి త్రైమాసికంలో 58 కొత్త స్టోర్లను తెరిచి మొత్తం 500 స్టోర్ల మార్కును చేరుకుంది. మార్చి 2026లో పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలోకొనుగోళ్లదారుల సెంటిమెంట్ బలపడిందని దీంతో కొనుగోళ్లు పెరిగాయని పేర్కొంది.ఇకపూర్తి ఆర్థిక సంవత్సరానికిచూస్తే డీమార్ట్ మొత్తం ఆదాయం 15.9శాతం పెరిగి 66,968 కోట్లకు చేరుకుంది. ఎబిటా 15.7 శాతం పెరిగి 5,255 కోట్లుగా నమోదైంది.

## నాలుగు సంస్థల్లో 2.20 లక్షలకోట్లు ఎంక్యాప్ వృద్ధి

**ముంబయి, మే 3:** మార్కెట్లలోని టాప్ పది కార్పొరేట్ సంస్థల్లో నాలుగు సంస్థల మార్కెట్ విలువలు 2.20 లక్షలకోట్లు పెరిగాయి. శెలవులతో వారం తగ్గినప్పటికీ మార్కెట్లర్యాలీతో ఈ షేర్లు పుంజుకుని కంపెనీ టర్నోవర్‌ను భారీగా పెంచింది. అయితే ఈ పెరుగుదలను రానున్న రోజుల్లో ముడిచమురు ధరల పెరుగుదల కట్టడిచేస్తుందని నిపుణుల అంచనా. ఆసియా మార్కెట్ల ధోరణులు, ఎఫ్‌పిఐల విత్‌డ్రాలు, డాలర్‌రూపాయి మారకం విలువలతో భారీ మార్పులు ఉండవచ్చన్న అంచనాలున్నాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్ రూ.1,39,655.8కోట్లుపెరిగి రూ.19,36,303.30 కోట్లకు పెరిగింది. భారతీ ఎయిర్‌టెల్ విలువలు రూ.43,503.51కోట్లుపెరిగి రూ.11,49,222.13కోట్లకు చేరింది. టిసిఎస్ విలువలు కూడా 27,569.83 కోట్లుపెరిగి రూ.8,94,933.95 కోట్లుకు చేరుకోగా బజాజ్‌ఫైనాన్స్ విలువలు కూడా రూ.9432.32కోట్లు పెరిగి రూ.5,83,123.13 కోట్లకు చేరింది.ఇక ఐసిఐసిఐబ్యాంకు మార్కెట్ క్యాపిటల్ మాత్రం రూ.45,364.62 కోట్లు క్షీణించి రూ.9,04,980.78 కోట్లకు చేరింది.



## ఈఎల్వీ నిబంధనలతో ఆటోరంగంపై

# రూ.25వేల కోట్ల భారం

**న్యూఢిల్లీ, మే 3:** కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఎండ్‌ఆఫ్‌లైఫ్ వాహనాల ఇ ఎల్ వి నిబంధనల కారణంగా భారత ఆటోమొబైల్ రంగంపై భారీ ఆర్థిక భారం పడనున్నట్లు తెలుస్తోంది. 2025లో కేంద్ర పర్యావరణ, అటవీ మరియు పర్యావరణ మంత్రిత్వ శాఖ ప్రకటించిన కొత్త నిబంధనల వల్ల 2026లో ఆటో కంపెనీల లాభాలపై సుమారు రూ.25,000 కోట్ల ప్రభావం పడే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాలు వెల్లడించాయి. పర్యావరణ పరిరక్షణ (ఎండ్‌ఆఫ్‌లైఫ్ వాహనాలు) రూల్స్, 2025లోని రూల్ 4(6) ప్రకారం, ఒక వాహన తయారీ సంస్థ కార్యకలాపాలు నిలిపివేసినా, అప్పటివరకు మార్కెట్లో విక్రయించిన వాహనాలపై ఉత్పత్తిదారు బాధ్యతలను కొనసాగించాల్సి ఉంటుంది. ఈ నిబంధన కారణంగా ఇండ్ ఎఎస్ 37అకౌంటింగ్ ప్రమాణం అమల్లోకి వస్తుందని పరిశ్రమ నిపుణులు చెబుతున్నారు. దీని ప్రకారం, గత 20 సంవత్సరాల్లో విక్రయించిన ప్రైవేట్ వాహనాలు, 15 సంవత్సరాల్లో విక్రయించిన కమర్షియల్ వాహనాల కోసం కంపెనీలు పర్యావరణ పరిహారం ఖర్చులకు ముందుగానే నిధులు కేటాయించాల్సి ఉంటుంది. దీంతో ఆటో కంపెనీలు మార్కెట్ నుంచి నిష్క్రమించే ఉద్దేశం లేకపోయినా, గతంలో విక్రయించిన వాహనాలకుగాను భారీ మొత్తంలో ప్రొవి జన్లు ఏర్పాటు చేయాల్సి వస్తుందని పరిశ్రమ వర్గాలు పేర్కొన్నాయి.

ప్రాథమిక అంచనాల ప్రకారం, 2025-26లో మొత్తం ఆటో పరిశ్రమపై ఒకేసారి సుమారు రూ.25,000 కోట్ల స్థూల ప్రభావం ఉండొచ్చని, డిస్కౌంటెడ్ ప్రాతిపదికన ఇది సుమారు రూ.9వేల కోట్ల వరకు ఉండవచ్చనిసియామ్ తెలిపింది. ఈ సమస్య పరిష్కారానికి రూల్ 4(6)లో మార్పులు చేయాలని పరిశ్రమ కోరినప్పటికీ, మార్చి 27న విడుదలైన సవరణ నోటిఫికేషన్‌లో సంబంధిత క్లాజ్‌లో ఎలాంటి మార్పులు చేయలేదు. పరిశ్రమ అంచనాల ప్రకారం, నాలుగు చక్రాల వాహన తయారీదారులపై ఈ నిబంధనల ప్రభావం సుమారు రూ.14,623 కోట్లు ఉండగా, రెండు మరియు మూడు చక్రాల వాహన తయారీదారులపై సుమారు రూ.9,650 కోట్ల ప్రభావం ఉంటుందని దీనివల్ల ఆటో రంగ లాభాలను గణనీయంగా దెబ్బతీసే అవకాశం ఉందని, కొత్త టెక్నాలజీల్లో పెట్టుబడులు పెట్టే సామర్థ్యాన్ని మరియు భవిష్యత్ వృద్ధి ప్రణాళికలను కూడా ప్రభావితం చేయవచ్చని పరిశ్రమ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at Superior Printers (P) Ltd. and published at Plot No.4-40/1, Alugunuru, 'X' Roads, Karimnagar-505527. Ph:2223355,2277034, 35, FAX: 2277036; Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. RNI No.APTEL/2001/07563.